తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 22.02.2026 | సంపుటి :12 సంచిక : 214 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## ఢిల్లీకి ఉగ్ర ముప్పు

- నిఘా వర్గాల హెచ్చరికలు
- కశ్మీర్‌లో ఐఈడీ గుర్తింపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ రాజధానిలో ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఢిల్లీలోని ఎర్రకోట చాందినీ చౌక్ ప్రాంతంలోని ఆలయాల వద్ద దాడులు చేసేందుకు పాక్‌కు చెందిన ఉగ్ర సంస్థ లష్కరే తయ్యిబా ప్లాన్ చేసినట్లు తెలిపాయి. ఇందుకు భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను వినియోగించే అవకాశం ఉందన్నాయి. దీంతో పాటు ప్రముఖ నగరాల్లోనూ దాడులు జరిగే అవకాశం ఉందన్నారు. దీంతో అప్రమత్తమైన భద్రతా సంస్థలు ఢిల్లీలో హైఅలర్ట్ ప్రకటించాయి. సున్నితమైన ప్రాంతాల్లో అదనపు

మిగతా 2లో..

## స్వాతంత్ర్య సమరంలో మహాత్ముడిపై బ్రిటీషర్లు లాఠీఎత్తే

# సాహసం చేయలేదు


డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- అవకాశాలను అందిపుచ్చుకుని సాగాలి
- డీసీసీ అధ్యక్ష పదవి ఎదిగేందుకు తొలిమెట్టు
- కాంగ్రెస్‌లో కష్టపడితేనే పదవులు వరిస్తాయి
- ఎవ్వరికైనా మెరిట్ లిస్ట్ ప్రకారమే అవకాశం
- భిన్నాభిప్రాయాలు పార్టీ కార్యకర్తల స్థైర్యాన్ని దెబ్బతీస్తాయి
- డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### భారతీయుల పార్టీ ఉన్మాది తూటాల వర్షం కురిపించాడు
### పైరవీ కారులుగా మారొద్దు.. ప్రజల కోసం పోరాడండి

**వికారాబాద్‌బ్యూరో(జనంసాక్షి):**భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు. రెండు డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం

మిగతా 2లో..

> నేను పీసీసీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉండేది. పార్టీలోనూ కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నాను. నేతలందరినీ కలిసి నా ఆలోచనలు చెప్పి అందరినీ ఒప్పించాను. అందరం కృషి చేయడంతో పార్టీ ఓటింగ్ 2.5 శాతం నుంచి 40 శాతానికి చేరింది. డీసీసీ అధ్యక్షులుగా బాగా పని చేసిన వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చాం. పార్టీ కోసం కృషి చేసిన మరో 60 మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. ఎమ్మెల్యే టికెట్లు పొందలేని వారికి ఎమ్మెల్సీలు ఇచ్చాం. పార్టీలో అందరి పని తీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్న వారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుంది." - రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి



## కనీసం ఈ ఏడాదిలోనైనా

# 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి

- గ్రామీణ ప్రాంతాల్లో గడిచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు
- పేదల సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి



**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014-23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమాన్ని విస్మరించిన ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలల్లో కేంద్రం నుండి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలకు ఇండ్లు మంజురు చేయాలని గడిచిన రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం. కానీ కేంద్రం నుంచి సానుకూల స్పం దన రావడం లేదు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇండ్లు మంజురు చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం హైదరాబాద్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రెండేళ్ల క్రితం రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత

మిగతా 2లో..



## పిల్లలపై లైంగిక దాడులు

- 33 మంది బాలలకు నరకం చూపిన దంపతులు
- మరణశిక్ష విధించిన సీబీఐ కోర్టు


**లక్నో(జనంసాక్షి):**అభంశుభం తెలియని పసి పిల్లలపై కొందరు మానవ మృగాలు లైంగిక వేధింపులకు పాల్పడ్డ కేసులో దంపతులకు మరణశిక్ష పడింది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారికి కోర్టులు సైతం కఠిన శిక్షలు విధిస్తున్నాయి. తాజాగా ఇలాంటి ఓ కేసు విషయంలో దంపతులకు మరణశిక్ష పడింది. పదేళ్లలో 33 మంది బాలురపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు, ఆ దృశ్యాలను చిత్రీకరించి విదేశాలకు పంపించిన ఈ నరరూప రాక్షస దంపతులకు సరైన శిక్షపడింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రామ్

మిగతా 2లో..



## మీ అవసరం సమాజానికెంతో ఉంది

- 'లీగల్'గా వచ్చేయండి
- సర్కారు సహకరించాలి
- ప్రకటనలో మేధావుల విజ్ఞప్తి



**హైదరాబాద్ (జనంసాక్షి):** అనేక సంవత్సరాలుగా ప్రజలు ఆత్మగౌరవంతో జీవించడానికి అవసరమైవ సామాజిక-ఆర్థిక మార్పునకు కృషి చేసిన మావోయిస్టు పార్టీ నాయకుల అవసరం సమాజానికి ఎంతో ఉందని పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు. వాళ్ల కృషితో ప్రజా జీవితంలో వచ్చిన మానవీయ మార్పుల పట్ల ఎంతో గౌరవం ఉందని, నిబద్ధతతో, నిజాయితీగా ప్రజల కోసం నిలబడిన వారిలాంటి అవసరం నేటి సమాజానికి ఉందని నమ్ముతున్నామని పేర్కొన్నారు. అయితే వర్తమాన పరిస్థితుల్లో మీ కార్యాచరణను సమీక్షించుకొని లీగల్ మార్గాల ద్వారా ముందుకు తీసుకొనివెళ్లాల్సిన అవశ్యకత

మిగతా 2లో..

## అమెరికా సుప్రీం తీర్పును పరిశీలిస్తున్నాం

ట్రంప్ వ్యాఖ్యలపైనా దృష్టి సారిస్తున్నాం: కేంద్రం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రపంచ దేశాలపై విధించిన సుంకాల విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకుఅక్కడి సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కేంద్రం నుంచి స్పందన వచ్చింది. అమెరికా సుప్రీం కోర్టు తీర్పును, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందనను విశ్లేషిస్తున్నామని వాణిజ్య శాఖ అధికారిక ప్రకటనలో పేర్కొంది. "సుంకాలపై అమెరికా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును మేం

మిగతా 2లో..

## అమెరికా సుప్రీం తీర్పుతో భారత్‌పై సుంకాలు ఇక

# 10 శాతమే!

### ట్రేడ్ డీల్‌లో మార్పుల అనంతరం మారిన సమీకరణలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లను అక్కడి సుప్రీంకోర్టు రద్దు చేసింది. దీంతో ఈ తీర్పునకు ముందు భారత్ సహా పలు వాణిజ్య భాగస్వామ్య దేశాలతో అమెరికా కుదుర్చుకున్న ట్రేడ్ డీల్స్‌లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఆయా దేశాలన్నింటిపైనా ఇక నుంచి 10శాతం సుంకాలు వర్తించనున్నాయని వైట్‌హౌస్ వెల్లడించింది. గతంలో ఇంతకంటే ఎక్కువ టారిఫ్‌లతో వాణిజ్య ఒప్పందాలు కుదిరినప్పటికీ.. కొత్త సుంకాలే వర్తిస్తాయని శ్వేతసౌధం స్పష్టం చేసింది. దీంతో భారత్‌పై టారిఫ్‌లు 18 శాతం నుంచి 10 శాతానికి దిగిరానున్నాయి. టారిఫ్‌లు చెల్లవంటూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే ప్రపంచ దేశాలపై 10శాతం సుంకాలు విధిస్తున్నట్లు మళ్లీ ప్రకటన చేశారు. అందుకు సంబంధించిన ఉత్తర్వుల పైనా సంతకం చేశారు. ఈ సుంకాలు ఫిబ్రవరి 24 నుంచి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయని వైట్‌హౌస్ తెలిపింది. 'ఇది తాత్కాలిక ఊరట మాత్రమే. మరింత సముచితమైన లేదా ముందు ఒప్పందం చేసుకున్నవిధంగా సుంకాల రేట్లను అమలుచేయడానికి ఉన్న చట్టపరమైన మార్గాలను మా యంత్రాంగం అన్వేషిస్తోంది" అని శ్వేతసౌధం అధికారి

మిగతా 2లో..

## విద్యుత్ సంస్థ నియామకాల్లో బీసీ రిజర్వేషన్ల ఉల్లంఘన

మార్చి 4న నేరుగా పరిశీలించాలని కమిషన్ నిర్ణయం



**హైదరాబాద్(జనంసాక్షి):**రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్ మరియు ఎస్‌పీడీసీఎల్ సంస్థల నియామకాలలో రిజర్వేషన్ల ఉల్లంఘన జరుగుతుందని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం బిసి కమిషన్ దష్టికి తీసుకువచ్చింది. ఈ అంశంపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. ఇందులో భాగంగా మార్చి 4వ వారంలో విద్యుత్ సంస్థల కార్యాలయాలను సందర్శించి ఈ విషయంపై విచారణ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. మరోవైపు రాష్ట్రంలోని విద్యార్థుల వివరాల సేకరణ వేగవంతం చేయాలని కమిషన్ అధికారులకు సూచించింది. రాష్ట్ర బీసీ కమిషన్ సమావేశం

మిగతా 2లో..

## వికసిత భారతానికి.. 'మేడిన్ ఇండియా చిప్'

# ఎంతో ముఖ్యం

### ఆర్థికాభివృద్ధి సాధించాలంటే స్వావలంబన సాధించడం అవసరం: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే స్వావలంబన సాధించడం అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దీనికోసం సెమీకండక్టర్ చిప్‌ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని తెలిపారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ కలిసి ఉత్తర్‌ప్రదేశ్‌లోని జేవర్‌లో ఏర్పాటు చేయనున్న సెమీకండక్టర్ పరిశ్రమకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. "వికసిత భారతానికి 'మేడ్ ఇన్ ఇండియా' చిప్‌లు ఎంతో ముఖ్యం. కరోనా సమయంలో చిప్‌ల సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో.. అనేక ఆర్థిక వ్యవస్థల అభివృద్ధి నిలిచిపోయింది. వివిధ కర్మాగారాల్లో పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో చిప్‌ల తయారీలో స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత దశాబ్దంలో సాంకేతిక పరంగా మనం తీసుకుంటున్న చర్యలు.. 21వ శతాబ్దంలో దేశ శక్తిసామర్థ్యాలకు పునాదులు అవుతాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ సంస్థలు కలిసి జేవర్‌లో 'ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్' (ఓఎస్ఏటీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాయి. దీని కోసం రూ.3,700 కోట్ల పెట్టుబడిని ప్రకటించాయి. 2028 నాటికి ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ పరిశ్రమ

మిగతా 9లో..

## 'ఇండియా- ఏఐ ఇంపాక్ట్ సదస్సు'

# విజయవంతమైంది

- తీర్మానంపై 86 దేశాల సంతకాలు చేశాయి
- కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దిల్లీ వేదికగా నిర్వహించిన 'ఇండియా- ఏఐ ఇంపాక్ట్ సదస్సు' విజయవంతమైందని, ప్రపంచ దేశాల నుంచి బలమైన మద్దతు లభించిందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. సదస్సు తీర్మానంపై 86 దేశాలతోపాటు రెండు అంతర్జాతీయ సంస్థలు సంతకం చేసినట్లు తెలిపారు. అమెరికా, బ్రిటన్, కెనడా, చైనా, డెన్మార్క్, జర్మనీ తదితర దేశాలు సంతకం చేసినవాటిలో ఉన్నాయని చెప్పారు. "ప్రధాని మోదీ 'ఏఐ' దార్శనికతను ప్రపంచం ఆమోదించింది. 'అందరికీ సంక్షేమం.. అందరికీ ఆనందం' అనే సూత్రాలను సమర్థించింది. ఏఐ సౌకర్యాలు, సేవలు, సాంకేతికత అనేవి ప్రతి ఒక్కరికీ చేరేలా కృత్రిమ మేధ వనరులను అందుబాటులో ఉంచేందుకు ప్రపంచ దేశాలు అంగీకరించాయి" అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియా సమావేశంలో చెప్పారు. ఏఐ దార్శనికతలో.. ఆర్థిక వృద్ధిని సమాజ హితంతో సమతుల్యం చేయడానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సదస్సులో 5 లక్షల మందికిపైగా సందర్శకులు పాల్గొన్నారని కేంద్రమంత్రి తెలిపారు. సరికొత్త ఏఐ యుగంలో భారత్ పోషిస్తున్న పాత్రపై ప్రపంచ దేశాల విశ్వాసాన్ని ఈ సమిట్ ప్రతిబింబించిందన్నారు.

మిగతా 2లో..

## ఇంకో ఐదేళ్లు అవకాశం ఇవ్వండి

అక్రమ వలసలను అడ్డుకుంటాం

ఓటర్లకు అమిత్‌షా పిలుపు



**గౌహతి(జనంసాక్షి):**నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు. రాబో యే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. అస్సాం లోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తు న్నట్లు తెలిపారు. చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు

మిగతా 9లో..

## ఆయేషా మీరా హత్య కేసు ముగింపు

- విజయవాడ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు
- అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగింత
- ఫిబ్రవరి 27న తెనాలిలో అంత్యక్రియలు

## యూరియా కొరతను నివారించాలి

- అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం
- దేశ రైతులతో పాటు తెలంగాణకూ ముప్పే
- మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శలు

## కామారెడ్డిలో బస్తీమే సవాల్

కాంగ్రెస్, భాజపా కార్యకర్తల వీరంగం

పోలీసులు రంగంలోకి దిగడంతో అదుపులోకి పరిస్థితి

వివరాలు 2వపేజీలో

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
22.02.2026

### అమెరికా సుప్రీం తీర్పుతో భారత్‌పై సుంకాలు ఇక

# 10 శాతమే!

ఒకరు మీడియాకు వెల్లడించారు.అమెరికా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో భారత్ చేసుకొన్న ట్రేడ్ డీల్‌లో మార్పులు జరగనున్నాయి. వాస్తవానికి ట్రంప్ అధికారంలోకి రాగానే అన్ని దేశాలతో పాటు భారత్ పైనా 25శాతం సుంకాలు విధించారు. ఆ తర్వాత రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో మరో 25శాతం అదనపు టారిఫ్‌లు వేశారు. దీంతో మన దేశంపై మొత్తం టారిఫ్‌లు 50శాతానికి పెరిగాయి. ఈ క్రమంలోనే ఇరుదేశాల మధ్య సుదీర్ఘంగా వాణిజ్య చర్చలు జరిగాయి.ఇటీవలే మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి ఫ్రేమ్‌వర్క్ రూపొందించేందుకు రెండు దేశాలు అంగీకారానికి వచ్చాయి. దీంతో భారత్‌పై సుంకాలు 50 శాతం నుంచి 18 శాతానికి దిగొచ్చాయి. ఇప్పుడు సుప్రీం తీర్పుతో ఆ సుంకాలు రద్దు కానున్నాయి. దాని స్థానంలో ట్రంప్ విధించిన తాజా 10శాతం టారిఫ్‌లు 150 రోజుల పాటు అమల్లో ఉండనున్నాయి. ఈ గడువును పొడిగించే అవకాశాలు లేకపోలేదు. అదే సమయంలో మరింత ఎక్కువ సుంకాలను విధించేందుకు కూడా ట్రంప్ సర్కారు ప్రయత్నిస్తోంది.ఇదిలాఉండగా.. స్విట్జర్లాండ్, దక్షిణ కొరియా, ఐరోపా సమాఖ్య, జపాన్, లిచెన్‌స్టీన్ దేశాలు 15 శాతం టారిఫ్‌లకు అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నాయి. వియత్నాంపై 20శాతం సుంకాలకు ఒప్పందం జరిగింది. ఇప్పుడు సుప్రీం తీర్పుతో ఇవన్నీ 10 శాతానికి తగ్గనున్నాయి.

## అమెరికా సుప్రీం తీర్పును పరిశీలిస్తున్నాం

పరిశీలిస్తున్నాం. ఆ తీర్పు తర్వాత అధ్యక్షుడు మీడియా తో మాట్లాడారు. అమెరికా యంత్రాంగం కొన్ని చర్యలను ప్రకటించింది. వాటి పర్యవసానాలు ఎలా ఉండొచ్చనే దానిపై విశ్లేషిస్తున్నాం" అని పేర్కొంది. టారిఫ్‌లపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ స్వాగతించారు. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని నియంత్రించే శక్తి మంచిదేనని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే.. సుప్రీం తీర్పుపై ఆగ్రహం వ్యక్తంచేసిన ట్రంప్.. ప్రపంచ దేశాలపై మళ్లీ 10శాతం టారిఫ్‌లు విధించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఈ టారిఫ్‌లు ఫిబ్రవరి 24 నుంచి అమల్లోకి వస్తాయని వైట్ హౌస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. అవి 150 రోజుల పాటు అమల్లోకి అమల్లో ఉంటాయని తెలిపింది. మరోవైపు, భారత్–అమెరికా మధ్య మధ్యంతర ట్రేడ్‌డీల్ ఖరారైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో భారత్‌పై 18 శాతం సుంకాలు ఉంటాయని ట్రంప్ ప్రకటించారు. అయితే అవి ఇప్పుడు 10 శాతానికి దిగిరానున్నాయి.

## ఇండియా- ఏఐ ఇంపాక్ట్ సదస్సు విజయవంతమైంది

ఈ సదస్సు ద్వారా మౌలిక సదుపాయాల రంగంలో 250 బిలియన్ డాలర్లకుపైగా, డీప్‌టెక్ రంగంలో 20 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులకు హామీలు లభించాయని ఇప్పటికే వెల్లడించిన విషయం తెలిసిందే.

## ఆయేషా మీరా హత్య కేసు ముగింపు

### విజయవాడ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు
### అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగింత!
### ఫిబ్రవరి 27న తెనాలిలో అంత్యక్రియలు

**అమరావతి(జనంసాక్షి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో విజయవాడలోని సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తును ముగిస్తున్నట్లు ప్రకటించిన న్యాయస్థానం.. వైద్య బృందం సేకరించిన ఆయేషా భౌతిక అవశేషాలను ఆమె తల్లిదండ్రులకు అప్పగించాలని సీబీఐని ఆదేశించింది. ఫిబ్రవరి 27న తెనాలిలో ప్రభుత్వ భద్రత నడుమ మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆయేషా హత్య కేసులో నిందితులను గుర్తించడానికి తగిన ఆధారాలు లభించలేదని సీబీఐ ఇటీవల కోర్టుకు తుది నివేదిక సమర్పించింది. ఈ నివేదికను తాజాగా న్యాయస్థానం ఆమోదించింది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయేషా మీరా మృతదేహానికి రెండో సారి పోస్టుమార్టం నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి వైద్యుల అభిప్రాయం తీసుకున్న అనంతరం అవశేషాలను సీబీఐ కోర్టు ముందుంచారు. ఈ క్రమంలో తమ కుమార్తె అవశేషాలను అంత్యక్రియల నిమిత్తం తమకు అప్పగించాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు షంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, ఫిబ్రవరి 27వ తేదీ తెనాలిలో అంత్యక్రియలు జరపాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని సీబీఐ, రెవెన్యూ, పోలీసు అధికారులు, మత పెద్దల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అవశేషాల తరలింపునకు ప్రత్యేక వాహనం, ఎస్కార్ట్, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2007లో విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలోని హాస్టల్‌లో ఆయేషా మీరా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే.

## విద్యుత్ సంస్థ నియామకాల్లో బీసీ రిజర్వేషన్ల ఉల్లంఘన

శనివారం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాల మాయ దేవి, పాల్గొన్నారు. ఈ సమావేశంలో అధికారులు డిప్యూటీ డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్ హాజరయ్యారు. సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది.

### స్వాతంత్య్ర సమరంలో మహాత్ముడిపై

# బ్రిటీషర్లు లాఠీఎత్తే సాహసం చేయలేదు




చేసుకోవాలని సూచించారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఈ తరగతులు సహాయపడతాయని సీఎం అన్నారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు బయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారని తెలిపారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం.. అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు' అని రేవంత్ అన్నారు. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు.రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని.. మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని.. ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడన్నారు. 'డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు' అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనాయకులను అవమానపరచాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం నుంచి షర్మిల వచ్చినా ఆమె అవకాశాలను తీసుకోలేదన్నారు. ముళ్లబాటలో కూడా ఏపీలో కాంగ్రెస్ కోసం షర్మిల కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజల దగ్గరికి వెళ్ళి రాజకీయాల్లో రాణించాలని షర్మిల చేస్తున్న కృషిని ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరయ్యారు. అలాగే, రెండు రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు

## పిల్లలపై లైంగిక దాడులు

భవాన్.. చిత్రకూట్ జిల్లాలో గతంలో నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో తన భార్య దుర్గావతితో కలిసి 2010–2020 మధ్య.. బందా, చిత్రకూట్ ప్రాంతాల్లో బాలురపై లైంగిక దాడులకు పాల్పడ్డాడు. వీరి దారుణాలకు బలైన వారిలో మూడేళ్ల వయసు చిన్నారులు కూడా ఉన్నారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్, బహుమతులు, తినుబండారాల పేరుతో పిల్లలను మభ్యపెట్టి ఇంటికి రప్పించి ఈ దారుణాలకు ఒడిగట్టారు. ఈ దంపతుల దారుణాలకు సంబంధించిన 2 లక్షల వీడియోలు, ఫొటోలను ఇంటర్నెట్ ద్వారా 47 దేశాలకు పంపించారు. నిందితులపై సీబీఐ 2020 అక్టోబరులో కేసు నమోదు చేసింది. మైనర్ బాధితుల పట్ల సీబీఐ దర్యాప్తు సున్నితంగానే కొనసాగింది. రామ్ భవాన్, అతడి భార్యపై 2021 ఫిబ్రవరిలో సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ దంపతుల నుంచి ప్రాణాలతో బయటపడిన పిల్లల్లో కొందరి ప్రైవేట్ భాగాలపై గాయాలు అయ్యాయని, వారిలో కొందరు ఏళ్ల తరబడి ఆసుపత్రులలో చికిత్స తీసుకోవాల్సి వచ్చిందని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఐదేళ్ల పాటు యూపీలోని పోక్సో కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. తాజాగా కోర్టు తుది తీర్పును వెల్లడించింది. దీన్ని అత్యంత అరుదైన కేసుగా పోక్సో కోర్టు అభివర్ణించింది. ఈ కేసులో నిందితులైన మాజీ ఇంజినీరు దంపతులకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. అలానే బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## మీ అవసరం సమాజానికెంతో ఉంది

కనబడుతుందని, ఈ దిశగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. మావోయిస్టులు తమ ఆచరణను సమీక్షించుకోవడానికి సహకరించవలసిన బాధ్యత ప్రభుత్వానిదని, ఈ చారిత్రక సందర్భంలో, సమాజంలో శాంతిని పెంపొందించే లక్ష్యంతో, మార్పునకు దోహదపడాల్సిందిగా సర్కారు కోరుతున్నామని ప్రొఫెసర్ జి హరగోపాల్, ప్రొఫెసర్ డి నరసింహారెడ్డి, ప్రొఫెసర్ రమా మేల్కొటె, ప్రొఫెసర్ యం కోదండరామ్, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, అల్లం నారాయణ, ప్రొఫెసర్ కల్పన కన్నాభిరాన్, కె శ్రీనివాస్ శనివారం తమ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## యూరియా కొరతను నివారించాలి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలన్నారు. సాగు పనిముట్లకు రాయితీపై రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చిస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన రైతుబడి అగ్రి షోను హరీశ్‌రావు సందర్శించారు. రైతులకు అగ్రి షో ఎన్నో రకాలుగా దోహదపడుతుందన్నారు. అగ్రి షో వంటి కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తే రైతులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు. మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం నుంచి ఈ పంటలను దిగుమతి చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లా డుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కేవలం 12 గంటల పాటే విద్యుత్ సరఫరా ఇస్తున్నారని, ఎరువులు సకాలంలో అందడం లేదని చెప్పుకొచ్చారు.

## ఢిల్లీకి ఉగ్ర ముప్పు..

సిబ్బందిని మోహరించాయి. బాంబ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని పోలీసులు స్థానికులను కోరారు. గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో.. నిఘా వర్గాల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. దిల్లీ సహా ఇతర ప్రముఖ నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు. ఇదీ చదవండి: షాకింగ్ ఘటన.. చేతులు కోసుకొంటున్న విద్యార్థులు

కశ్మీర్‌లో ఐఈడీ గుర్తింపు

దిల్లీ సహా దేశ వ్యాప్తంగా పలు ముఖ్య నగరాల్లో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాలింపు చర్యలు చేపట్టిన భద్రతా బలగాలు జమ్మూ కశ్మీర్‌లో ఉగ్ర కుట్రను భగ్నం చేశాయి. గందేర్‌బాల్ జిల్లాలో ఓ బ్యాగులో మందుపాతరను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. వెంటనే బాంబ్ నిర్వీర్యదళ సహాయంతో పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశామన్నారు. మరిన్ని ప్రదేశాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఏవైనా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు. దిల్లీలోని ఎర్రకోట చాందినీ చౌక్ ప్రాంతంలో దాడులు చేసేందుకు పాక్‌కు చెందిన ఉగ్ర సంస్థ లష్కరే తయ్యిబా ప్లాన్ చేసినట్లు నిఘావర్గాలు తాజాగా హెచ్చరించాయి. దేశంలోని ప్రముఖ నగరాల్లో దాడులు జరిగే అవకాశం ఉందని తెలిపాయి. నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు. దిల్లీకి ఉగ్ర ముప్పు.. నిఘా వర్గాల హెచ్చరికలు

## కనీసం ఈ ఏడాదిలోనైనా 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి

ప్రాధాన్యత ఇస్తోంది. వచ్చే మూడు సంవత్సరాలలో రాష్ట్రం లో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 1.0లో భాగస్వామ్యం కాలేదు. అయితే 2023 తరువాత మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం 2.0 లో రాష్ట్రం అధికారికంగా చేరింది.2024 ఆగస్టులో కేంద్ర మంత్రివర్గం 2.0కు ఆమోదం తెలిపి, ఆవాస్–?2018 సర్వే నవీకరణ తర్వాత సాచురేషన్ పద్ధతిలో గృహాల మంజూరు చేయాలని నిర్ణయించినప్పటికీ, పాత డేటా ఆధారంగా 2024–25 2025–26 సంవత్సరాలకు ఇతర రాష్ట్రాలకు 1.19 కోట్ల గృహాలను కేటాయించింది. తెలంగాణ రాష్ట్రం 1.0 లో భాగస్వామ్యం కాకపోవడంతో 2018 పెండింగ్ డాటా లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ విస్తృత సర్వే నిర్వహించి అర్హులైన లబ్దిదారుల డేటాబేస్‌ను సిద్ధం చేసుకుంది. అయినప్పటికీ, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్?2024 మొబైల్ యాప్ ద్వారా మరోసారి సర్వే నిర్వహించి మొత్తం 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లలో ఏర్పడిన పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని పరిస్థితులను అర్థం చేసుకొని ఈ ఆర్థిక సంవత్సరములో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఇండ్లను మజూరు చేయాలని' మంత్రి పొంగులేటి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## నెలాఖరుకు పత్తి కొనుగోళ్లు

### రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తితో సీసీఐ నిర్ణయం

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని, ఈ అవకాశాన్ని పత్తిరైతులు వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తమ అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు సీసీఐ పొడిగించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కోరినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. పొడిగించిన గడువును వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులను మంత్రి తుమ్మల కోరారు.రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, రాష్ట్రంలోని పత్తి రైతులకు ఇబ్బంది కలగకుండా, ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించాలని సీసీఐ అంగీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. రైతుల ప్రయోజనాలను ప్రాధాన్యంగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ వాస్తవ పరిస్థితిని కేంద్రానికి వివరిస్తూ కొనుగోళ్ల గడువును పొడిగించాలని మంత్రి గారు కోరారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో రాష్ట్ర పరిస్థితిని వివరించి, రైతులకు నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 45.32 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేయడం జరిగింది. ఇప్పటివరకు 8,80,053 మంది రైతుల నుంచి రూ.12,823 కోట్ల విలువైన 16.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అదేవిధంగా ఇప్పటివరకు మార్కెట్ ద్వారా 2.24 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యత ప్రమాణాలు లేని పత్తిని కోనుగోలు చేయడం జరిగింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఇంకా 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ పై మొదట రైతులు మరియు జిన్నర్ల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన యాప్ కి రాష్ట్ర ప్రభుత్వం సపోర్టు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీంతో ఈ యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతులకు సమయానికి ఎరువుల పంపిణీకి తమ సర్కారు మొబైల్ యూరియా బుకింగ్ యాప్ ని తీసుకొచ్చిందన్నారు. తద్వారా యూరియా బ్లాక్ మార్కెటింగ్ అరికట్టడంతో పాటు అధిక నిల్వలను నియంత్రిస్తూ పారదర్శక పంపిణీ వ్యవస్థ అమల్లోకి వచ్చిందన్నారు. పంట పూర్తిగా మార్కెట్‌కు రాకముందే సీసీఐ వారు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తారనే సమాచారంతో రైతుల్లో ఆందోళన నెలకొంది

### ప్రధాని నివాసం కోసం

# మురికివాడల ఖాళీ

## సుమారు 700 కుటుంబాలకు నోటీసులు ఇచ్చిన అధికారులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశ రాజధాని న్యూఢిల్లీలో పరధాని నూతన నివాస నిర్మాణం.. దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో మురికి వాడల్లో నివాసముంటున్న కుటుంబాలపై పడింది. అక్కడి నుంచి ఖాళీ చేయాలని కేంద్ర గృహని ర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ వారిని ఆదేశించింది. ఈ మేరకు వారికి నోటీ సులు పంపింది. అక్కడి నుంచి ఖాళీ చేయక`పోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చ రించింది. దాదాపు 700 కుటుంబాలకు ఈ నోటీసులు అందాయని తెలుస్తున్నది. అయితే కచ్చితమైన గడువు తేదీని పేర్కొనకపోవడం, పునరావాసంపై ఎలాంటి స్పష్టతా లేకపోవడంతో అక్కడి స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధాని నూతన నివాసం నిర్మాణం నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నోటీసులు వచ్చినట్టు అంతా భావిస్తున్నారు. రేస్‌కోర్స్ రోడ్ వెంట ఉన్న



భాయిరామ్ క్యాంప్, మస్జీద్ క్యాంప్, డిఐడి క్యాంప్ నివాసితులకు ఈ నోటీసులు అందినట్టు సమాచారం. నోటీసులో ఆ భూమిని ప్రభుత్వానికి చెందినదనీ, ఇకపై అక్కడ నివసించడం అనధికారికంగా పరిగణిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆదేశాలను పాటించకపోతే చట్ట ప్రకారం అక్కడి నుంచి తొలగింపు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు.ఈ నోటీసుతో అక్కడి స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చాలా మంది నిరుపేదల అక్కడ నివసిస్తూ సమీప ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. ఖాళీ చేయాల్సిన గడువు, పునరావాసం, ప్రత్యామ్నాయాలపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదని వారు అంటున్నారు. కాగా వారు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులను సంప్రదించి.. పునరావాసంపై స్పష్టత కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా ఈ చర్యలు రాజధాని సెంట్రల్ జోన్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే విస్తృత ప్రణాళికలో భాగమని అధికారులు తెలిపారు.

## కామారెడ్డిలో బస్తీమే సవాల్

- కాంగ్రెస్, భాజపా కార్యకర్తల వీరంగం
- పోలీసులు రంగంలోకి దిగడంతో అదుపులోకి పరిస్థితి

**కామారెడ్డి(జనంసాక్షి):** కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు గిరెడ్డి మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి కారును భాజపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైటెన్షన్ నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం ఉద్రిక్తతలకు దారితీసింది. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నేత గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది.ప్రభుత్వ, అరోరా కాలేజీ భూములను వెంకట రమణారెడ్డి కబ్జా చేశారని షబ్బీర్ ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన వెంకట రమణారెడ్డి.. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉందని.. సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో శిశుమందిర్ వేదికపై బహిరంగ చర్చకు రెండు పార్టీలు సిద్ధమయ్యాయి. ఇరు పార్టీల నేతల సవాళ్లతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి క్యాంప్ ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యాంప్ ఆఫీసు నుంచి బయటకు రాకుండా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు సవాలును స్వీకరించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ముదరడంతో మహేందర్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారును బోల్తా పడేశారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరు పార్టీల నేతలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**ఈటల రాజేందర్ హౌస్ అరెస్టు**

మేడ్చల్: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డితోపాటు పెద్ద ఎత్తున ఈటల నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయన్ను ఇంట్లోనే నిర్బంధించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిమీద దాడి నేపథ్యంలో ఆయన్ని పరామర్శించేందుకు ఈటల రాజేందర్ కామారెడ్డి బయల్దేరారు. ఈ క్రమంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈటలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఈటల తీవ్రంగా ఖండించారు. గుండాయిజం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

# భక్తుల ఇంటికే భద్రాద్రి శ్రీ సీతారామచంద్రుల కల్యాణ తలంబ్రాలు

- రూ.151 చెల్లిస్తే విశిష్టమైన రాములోరి తలంబ్రాలు పొందే సదావకాశం
- ఈ నెల 23 నుంచి బుకింగ్స్ ప్రారంభం
- గోడ పత్రికను ఆవిష్కరించిన వీసీ, ఎండీ శ్రీ నాగిరెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో జరగబోయే శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తులకు అందజేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) యాజమాన్యం నిర్ణయించింది. శ్రీ రామనవమి' సందర్భంగా మార్చి 27, 2026న జరిగే వేడుకలను దృష్టిలో ఉంచుకుని, వివిధ కారణాల వల్ల భద్రాచలం కు వెళ్లలేని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల భక్తుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా తెలంగాణ దేవాదాయ శాఖ సహకారంతో రాములవారి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇళ్ల వద్దకు చేరవేసే పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టింది. ఎంతో విశిష్టత కలిగిన ఈ తలంబ్రాల ప్యాకెట్లు' పొందాలనుకునే భక్తులు www.tgsrtclogistics.co.in వెబ్ సైట్లో లాగిన్ అయి ఆన్లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు. అలాగే టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి.. వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవం అనంతరం ఈ తలంబ్రాలను భక్తులకు టీఎస్ఆర్టీసీ హోం డెలివరీ చేస్తుంది. హైదరాబాద్ లోని బస్ భవన్ లో శనివారం భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్ను టీఎస్ఆర్టీసీ వీసీ, ఎండీ వై.నాగిరెడ్డి ఆవిష్కరించారు. నియమ నిష్టలతో ధాన్యాన్ని గోటితో ఒలిచి తీసిన కోటి బియ్యం గింజలను తలంబ్రాలుగా రాములోరి కల్యాణంలో ఉపయోగిస్తున్నారు. విశిష్టమైన ఈ తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చాలని మూడేళ్ళ క్రితమే టీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ ప్రయత్నానికి భక్తుల నుంచి మంచి స్పందన వచ్చింది.

సంస్థపై ఉన్న విశ్వాసంతో భక్తులు భారీ సంఖ్యలో తలంబ్రాలను బుక్ చేసుకుంటున్నారు. 2022లో దాదాపు 89 వేల మంది భక్తులకు తలంబ్రాలను బుక్ చేసుకోగా.. గత మూడేళ్ళలో లక్షలాది మంది భక్తులకు తలంబ్రాలను సంస్థ అందజేసిందని టీజీఎస్ఆర్టీసీ వీసీ, ఎండీ వై.నాగిరెడ్డి అన్నారు. భద్రాద్రిలో మార్చి 27న అంగరంగ వైభవంగా జరిగే శ్రీరామనవమి వేడుకలకు వెళ్లలేని భక్తులు ఈ సేవల్ని వినియోగించుకోవాలని టీజీఎస్ఆర్టీసీ కోరుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో తలంబ్రాలను బుక్ చేసుకోవచ్చని చెప్పారు. సంస్థ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్లు కూడా భక్తుల వద్ద నేరుగా ఆర్డర్లను స్వీకరిస్తారని నాగిరెడ్డి గారు తెలిపారు. తలంబ్రాల సేవను పొందాలనుకునే భక్తులు టీఎస్ ఆర్టీసీ కాల్ సెంటర్ ఫోన్ నంబర్లు 040-23450033, 040-69440069లలో సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ సీటీఎం(మార్కెటింగ్, కమర్షియల్) శ్రీధర్, లాజిస్టిక్ ఏటిఎం రాజన్, భాను తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణ

- కల్వకుర్తి వ్యవసాయ శాఖ ఏడిఏపై ఏసీబీ రైడ్స్
- ఎడీఏ కిరణ్ కుమార్ ఇంట్లో ఏసీబీ సోదాలు..ఏక కాలంలో 7 చోట్ల దాడులు
- కల్వకుర్తి వ్యవసాయ శాఖ ఎడిఏ కార్యాలయంలో ఏసీబీ సోదాలు
- గతంలో సూర్యాపేట జిల్లాలో డిఆర్డిఏ పీడీగా పనిచేసిన కిరణ్ కుమార్.






కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) : సూర్యాపేట జిల్లాలో గతంలో డీఆర్డీఏ పీడీగా పనిచేసిన సుందరి కిరణ్ కుమార్ ప్రస్తుతం ఆయన నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తిలో అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ లో ఏడీఏ గా పనిచేస్తున్నారు. అయితే ఆయన స్వస్థలమైన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం లోని పొనుగోడు గ్రామంలో ఏసీబీ అధికారులు ఉదయం దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తడంతో సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహబూబ్ నగర్ ఏసీబీ డి.ఎస్.పి బాలకృష్ణ తెలిపారు. కిరణ్ కుమార్ ఇంటితోపాటు ఆయన బంధువుల ఇండ్లలో సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏసీబీ అధికారులు ఏకకాలంలో ఏడు చోట్ల దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఆయనకు పార్ట్నర్ షిప్ ఉన్న నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి గ్రామ శివారులోని అవని రైస్ మిల్లులో కూడా అధికారులు దాడులు నిర్వహించారు. పొనుగోడు, నేరేడుచర్ల తో పాటు కల్వకుర్తిలో ఆయన పనిచేస్తున్న ఆఫీస్ తో పాటు గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలోని ఆయన అత్తగారింట్లో, అనంతగిరి మండలంలోని అమీనాబాద్, అలాగే సూర్యాపేటలోని ఆయన నివాసం ఉంటున్న కిరాయి ఇంట్లో, రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని కిరాయి ఇంట్లో సోదాలు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీలు చేస్తోన్న సమయంలో కిరణ్ కుమార్ పొనుగోడులోనే ఉన్నారు.దర్యాప్తు కోసం ఏసీబీ అధికారులు ఏడిఏ కిరణ్ కుమార్ను వెంట తీసుకువెళ్లారు. దర్యాప్తు పూర్తి అయ్యాక వివరాలన్నీ మీడియాకు వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణతెలిపారు.

# టీకా కార్యక్రమంపై డీఎంహెచ్వో ఆకస్మిక తనిఖీలు

- వైద్య సిబ్బంది సమయపాలన, రికార్డులు-డ్యూ లిస్టుల ఖచ్చితత్వంపై ప్రత్యేక దృష్టి
- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా రవి కుమార్ నాయక్



కొల్లాపూర్ (జనంసాక్షి) : జిల్లాలో జరుగుతున్న రోగ నిరోధక టీకాల కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో సమర్థంగా అమలు చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. రవికుమార్ నాయక్ సూచించారు. కొల్లాపూర్ మండలం కుడికిళ్ళ సబ్ సెంటర్ పరిధిలోని అంకిరావుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న టీకా సెషన్ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్ వినియోగ రికార్డులు, డ్యూ లిస్టులు, లబ్ధిదారుల నమోదు వివరాలను పరిశీలించి ఆన్లైన్ నమోదు చేయాలని, అవసరమైన సూచనలు చేశారు. అనంతరం చుక్కయ్యపల్లి సబ్ సెంటర్లో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని కూడా పరిశీలించారు. ప్రతి అర్హుడైన శిశువు, గర్భిణి టీకా పొందేలా డ్యూ లిస్టులను సమగ్రంగా నిర్వహించాలని, రికార్డుల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులలో నిర్లక్ష్యం వయిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో స్థానిక వైద్య అధికారి డా. జయప్రకాశ్, జిల్లా ఉప మాస్ మీడియా అధికారి రాజాగోపాల చారి, జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ డి.కుమార్, ఫార్మసీ ఆఫీసర్ జి.కె. వెంకటేష్ పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్ను ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి

కరీంగనర్, ఫిబ్రవరి21 (జనంసాక్షి) : కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి రాజీవ్ రహదారిపై బైక్ ను కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై వెళ్తోన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. హుస్నాబాద్ నుంచి తోటపల్లికి వెళ్తుండగా కొత్తపల్లి దగ్గర ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో కాసేపు హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. స్తానికుల సమాచారంతో ఘటనా స్తలానికి వచ్చిన పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులు అవదూత శ్రీనివాస్, శ్రీరామ రామచంద్రంగా గుర్తించారు. వీరిద్దరూ బొమ్మనపల్లి మండలం చిరుగుమామిడి గ్రామస్తులుగా గుర్తించారు.

## ప్రపంచ తెలుగు కవుల మహాసభల్లో పాల్గొన్న భుజేందర్



పాలకుర్తి ఫిబ్రవరి 21 (జనంసాక్షి) : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ తెలుగు కవుల మహాసభలకు జనగామ జిల్లా, పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన సామాజిక కవి, శ్రీ పోతన సాహిత్య కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యపు భుజేందర్ పాల్గొన్నారు. భుజేందర్ ను ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, పొట్లూరి హరికృష్ణ ,లేనిన్ శ్రీనివాస్, ప్రపంచ తెలుగు కవుల సంఘం, త్రివర్ణ ఫౌండేషన్ అభినందిస్తూ శాలువా ప్రశంస పత్రం జ్ఞాపికతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని భుజేందర్ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

# మొబైల్ షాపులో షార్ట్ సర్క్యూట్

- అగ్నిప్రమాదంలో పది లక్షల ఆస్తి బుగ్గి



నల్లగొండ, ఫిబ్రవరి21 (జనంసాక్షి) : నల్గొండ జిల్లాలో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో భారీ ఆస్తి నష్టం సంభవించింది. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని సాయి విఘ్నేశ్వర ఆటోమొబైల్ షాప్లో ఈ అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. స్థానికులు.. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాప్లో నుంచి ఒక్కసారిగా పొగ వ్యాపించింది. కాసేపటికే మంటలు వేగంగా వ్యాపించడంతో షాపులో ఉన్న స్పేర్ పార్ట్స్, వాహనాలకు సంబంధించిన సామగ్రి అగ్నికి ఆహుతైంది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే షాప్లో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయినట్లు తెలుస్తోంది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. విద్యుత్ వైర్లలో లోపం వల్ల మంటలు చెలరేగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఘటనతో స్థానిక వ్యాపారులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ పరికరాలు, వైరింగ్ వ్యవస్థలను తరచూ తనిఖీ చేయించుకోవాలని ఫైర్ సేఫ్టీ అధికారులు సూచించారు.

# అమెరికా సామ్రాజ్యవాద కుట్రలను తిప్పికొడదాం

- 'రెడ్ బుక్ డే'లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ




హైదరాబాద్ (జనంసాక్షి) : 1848 ఫిబ్రవరి 21న కార్ల్ మార్క్స్, ఫ్రెడ్రిచ్ ఏంగెల్స్ రచించిన అజరామర గ్రంథం 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' ప్రచురితమైన రోజును పురస్కరించుకుని, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 'రెడ్ బుక్ డే' వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ రాష్ట్ర కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జాన్వెస్లీ మాట్లాడుతూ, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటానికి, ప్రపంచ ప్రజల విముక్తికి కమ్యూనిస్ట్ మేనిఫెస్టో నేటికీ దిక్సూచిలా నిలుస్తోందని, సోషలిజమే ప్రపంచానికి ఏకైక మార్గమని పేర్కొన్నారు. వెనిజులా తన చమురు సంపదను కార్పొరేట్లకు అప్పగించకుండా, జాతీయం చేసి ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తుండటంతో అమెరికా చమురు క్షేత్రాల స్వాధీనానికి పాల్పడుతోందని విమర్శించారు. 'ఆర్థిక ఆంక్షలు' అనే ఆయుధంతో వివిధ దేశాల ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. తన ఆయుధ వ్యాపారాన్ని పెంచుకోవడానికి, డాలర్ విలువను కాపాడుకోవడానికి అమెరికా మధ్యప్రాచ్య దేశాల్లో అశాంతిని రేపుతోందని, అణ్వాయుధాల పేరుతో ఇరాన్ సార్వభౌమాధికారంపై దాడికి సిద్ధమవ్వడం అంతర్జాతీయ శాంతికి విఘాతమని హెచ్చరించారు. గతంలో లాగా అమెరికా చెప్పిందే వేదం అన్నట్లుగా ఇప్పుడు ప్రపంచం లేదని, రష్యా, చైనా వంటి దేశాలు అమెరికా ఆధిపత్యాన్ని గట్టిగా ప్రతిఘటిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది చిన్న దేశాల స్వతంత్రతకు శుభపరిణామమని తెలిపారు. బ్రిటిష్ వారిని తరిమికొట్టిన ఘన చరిత్ర కలిగిన భారతదేశం, నేడు ప్రధాని మోదీ నాయకత్వంలో అమెరికాకు ఒక జూనియర్ పార్ట్నర్ గా మారిపోవడం సిగ్గుచేటని విమర్శించారు. విదేశాంగ విధానం స్వయంప్రతిపత్తిని కోల్పోవడం వల్ల దేశ ప్రతిష్ట మసకబారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 'రెడ్ బుక్ డే' సందర్భంగా ప్రతి ఒక్కరూ అభ్యుదయ సాహిత్య పఠనం ద్వారా చైతన్యాన్ని పెంపొందించుకోవాలని, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగుతున్న అంతర్జాతీయ పోరాటాలకు మద్దతు తెలపాలని జాన్వెస్లీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. జ్యోతి, టి. సాగర్, ఎండి అబ్బాస్ మరియు రాష్ట్ర కేంద్రంలోని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రియల్ ప్రాజెక్టు ప్రకటనల్లో రెరా రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- నిబంధనలు ఉల్లంఘించిన అమేయ, వర్టెక్స్, గోద్రేజ్ ప్రాజెక్టులు
- ఆయా సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ




హైదరాబాద్, ఫిబ్రవరి21 (జనంసాక్షి) : ఇల్లు/ప్లాట్/యూనిట్ అమ్మకాలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ రిజిస్ట్రేషన్ లేకుండా కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ముందస్తు ప్రకటనలు ఇచ్చి మోసం చేయద్దని ప్రమోటర్లు/డెవలపర్లు, ఏజెంట్లు మరియు ప్రచార మాధ్యమాలను తెలంగాణ రెరా అథారిటీ గట్టిగా హెచ్చరించింది.రెరా చట్టం ప్రకారం, 500 చదరపు మీటర్లు దాటితే మరియు8 కంటే ఎక్కువ యూనిట్లు కలిగి ఉన్న ప్రతి ప్రాజెక్టును ముందుగా తెలంగాణ రెరాలో రిజిస్టర్ చేయాలని, రెరా అథారిటీ ప్రాజెక్టు వివరాలను పరిశీలించి, రిజిస్ట్రేషన్ నంబరును మంజూరు చేసిన తర్వాతే ఆ నంబరు ద్వారా అమ్మకాలపై ప్రకటనలు చేయాలని మోటర్లు/డెవలపర్లు, ఏజెంట్లు మరియు ప్రచార మాధ్యమాలను సూచించింది. ఇందులో భాగంగా ఇటీవల రిజిస్ట్రేషన్ నంబరు పొందుపరచని చట్టవిరుద్ధమైన ప్రకటనలు రెరా దృష్టికి రావడంతో ఆయా ప్రాజెక్టు సంస్థలకు రెరా అథారిటీ షోకాజ్ నోటీసులను జారీ చేసింది. గోద్రెజ్ ప్రాపర్టీస్, నవనామి ఎలివేట్ ప్రాజెక్టు, వర్టెక్స్ విరాట్ ప్రాజెక్టు, స్వర్గసీమ అమేయ ప్రాజెక్టు, తిరుమల హిల్స్ మొదలగు రియల్ ఎస్టేట్ కన్ స్ట్రక్షన్ కంపెనీలు ఇందులో ఉన్నాయి. కొన్ని కన్ స్ట్రక్షన్ కంపెనీలు రెరా రిజిస్ట్రేషన్ నంబరును పొందుపరిచినప్పటికీ, ఆ ప్రకటన రెరా నిబంధనల మేరకు లేనట్టు గా అథారిటీ గుర్తించింది. స్వర్గసీమ కన్ స్ట్రక్షన్ వారి అమేయ ప్రాజెక్టు ప్రకటనలో అక్షరాల సైజు, ప్రాజెక్టు పూర్తిపేరు, లేఅవుట్ గా రిజిస్టర్ చేసి, ప్రకటన మాత్రం పూర్తి రెసిడెన్షియల్ ప్రాజెక్టుగా చూపిస్తూ కొనుగోలుదారులను తప్పు దోవ పట్టించడం లాంటి ఉల్లంఘనలను గమనించిన రెరా, ఆ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

# మృతుడిపై చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

- నిందితులను చాకచక్యంగా పట్టుకున్న షాద్నగర్ పోలీసులు
- రెండు తులాల బంగాలు గొలుసు స్వాధీనం




షాద్నగర్ (జనంసాక్షి) : శవం మీద నుండి బంగారం దొంగలించిన ఇద్దరు నేరస్తులను షాద్నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి దొంగలించబడిన రెండు తులాల బంగారం చైన్ను స్వాధీన పరుచుకుని నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ విజయ్ కుమార్ తెలిపారు. వివరాల్లోకెళ్తే.. తుర్క యాంజల్ కు చెందిన పుల్లగుర్రం పురుషోత్తం రెడ్డి, తన స్నేహితులతో కలిసి తీర్థయాత్రకు పోయి తిరుగు ప్రయాణమయ్యాడు. బూర్గుల శివారులోని ఎస్ఎస్ దాబా వద్ద ఈ నెల 17న రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. ఆయన మృతదేహాన్ని సోదరుడు విజయానంద్ రెడ్డి ఇంటికి తీసుకెళ్లి న పరిశీలించగా మెడలో చైన్ కనిపించలేదు. వెంటనే షాద్నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన అనంతరం పోలీసులు విచారణ ప్రారంభించగా.. శనివారం నమ్మదగిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు నిఘా పెంచారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాలో లేబర్గా పనిచేస్తున్న కడియాలకుంట తండాకు చెందిన మూడవత్ లోక్య నాయక్, డ్రైవర్గా పనిచేస్తున్న అడ్డాకుల మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన గోదా రవికుమార్ గౌడ్లను అరెస్టు చేశారు. వారిని విచారించగా మృతుడి మెడలోంచి చైన్ అమ్ముకుని డబ్బులు తీసుకుందామని అనుకున్నట్టు అంగీకరించారు. నిందితుల వద్ద నుండి రెండు తులాల బంగారు చైన్ స్వాధీన పరచుకున్నట్లు పోలీసులు తెలిపారు. షాద్నగర్ డీసీపీ సిహెచ్ శిరీష, షాద్నగర్ ఏసీపీ ఎస్ లక్ష్మి నారాయణ పర్యవేక్షణలో, పట్టణ సీఐ విజయ్ కుమార్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేసు విచారణాధికారి క్రైమ్ డిటెక్టివ్ సబ్ ఇన్స్పెక్టర్ జి శివ రెడ్డి, క్రైమ్ టీం హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ రవీందర్, మోహన్, కర్ణాకర్, జాకీర్, రాజు కేసును ఛేదించడంలో కీలక పాత్ర వహించారు. వారికి తగిన రివార్డులను ఉన్నతాధికారుల ద్వారా ఇప్పించనున్నట్టు సీఐ విజయ్ కుమార్ తెలిపారు.

# లకాస విల్లా ప్రాజెక్టులో అక్రమంగా మట్టి తరలింపు

## ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21(జనం సాక్షి) : ఆదిభట్ల సర్కిల్ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని లకాస విల్లా ప్రాజెక్టులోని సర్వేనెంబర్. 297 నుండి ఎలాంటి ప్రభుత్వ మైనింగ్ శాఖ అనుమతులు లేకుండా ఆద్య అపార్ట్మెంట్ పక్కన సర్వే నంబర్ 300 లోకి గత కొన్ని రోజులుగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. తరలించిన మట్టిని జెసిబిల సహాయంతో చదును చేస్తున్నారు. దీనిపై స్థానికులు ప్రభుత్వ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయగా మైనింగ్ ఆర్ఐ జ్యోతిని చరవాణి ద్వారా సంప్రదించగా, ఆమె మైనింగ్ డిపార్టుమెంటు నుండి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తెలిపారు. కాగా ఎలాంటి అనుమతులు లేకుండా యాథేచ్ఛగా మట్టిని తరలిస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నరని స్థానికులు వాపోయారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న లాకసా విల్లాస్ ప్రాజెక్టు పై చట్టరీత్యా వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆరోపిస్తున్నారు.



### ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు

# మౌలానా అబుల్ కలాం ఆజాద్



మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ తల్లి ఆలియా, తండ్రి మౌలానా ఖైరుద్దీన్. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో మక్కా వెళ్ళి స్థిరపడిన మౌల్వీ ఖైరుద్దీన్ 1890 లో తిరిగి బెంగాల్ వచ్చారు. మౌలానా ఆజాద్ తల్లితండ్రులు మక్కాలో ఉన్నప్పుడు 1888 నవంబరు 11న మక్కాలో అబుల్ కలాం ఆజాద్ జన్మించారు. ఆజాద్ అసలు పేరు అబుల్ కలాం మొహిద్దీన్ ఖైరుద్దీన్. చిన్ననాటనే అరబిక్, పర్షియన్, టర్కిష్, ఉర్దూ భాషలలో ఆజాద్ మంచి పాండిత్యం సంపాదించారు. ఆయన తన 12వ ఏట 'నైరంగ్–ఎ–ఆలం' పత్రికను వెలువరించారు. ఆయన 13వ ఏటన అద్భుత సాహిత్య విమర్శను సృజియించి 'విద్యాగని, సలక్షణ శోభితుడు, మహాకవి, సాటిలేని విద్వాంసుడు'గా ప్రశంసలను అందుకున్నారు. 1904లో జరిగిన అఖిల భారత ముస్లిం విద్యాసదస్సులో, అఖిల భారత ముస్లిం పత్రికా సంపాదకుల సమావేశాల్లో పాల్గొనటంతో మౌలానా ఆజాద్ ప్రజా జీవితంలో ప్రవేశించారు. తొలుత ముస్లిం లీగ్ ఆలోచనలతో బయలుదేరిన ఆయన పరాయి పాలనకు స్వస్తి పలకాలంటే సాయుధ పోరాటమే శరణ్యమని భావించి పలు విప్లవ సంఘాలను ఏర్పాటు చేశారు. 1920 జనవరిలో మహాత్మాగాంధీని కలుసుకున్నాక తన విప్లవ బాటను వీడి అహింసా మార్గం చేపట్టారు. ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనటం ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశించారు. అబుల్ కలాం పలు గ్రంథాలను రాసి ప్రచురించి మహాకవిగా, పండితునిగా, అద్భుత మేథాశక్తిగల ధార్మికవేత్తగా ఎనలేని ఖ్యాతిని ఆర్జించారు. జాతీయోద్యమం దిశగా ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు 'అల్ హిలాల్', 'అల్ బలాగ్' లాంటి ఉర్దూ పత్రికలను వెలువరించారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని కలవరపెట్టిన ఈ పత్రికలు పలుమార్లు నిషేధానికి గురయ్యాయి. ఈ ఉద్యమాల సందర్భంగా ఆరంభమైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జైలు శిక్షల జీవితం పదేండ్ల ఏడు మాసాల పాటు దేశంలోని వివిధ జైళ్ళలో సాగింది. 1923లో ఢల్లీలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు 35 సంవత్సరాల వయస్సులో మౌలానా ఆజాద్ అధ్యక్షత చేపట్టారు. 1927లో కాంగ్రెస్–ముస్లిం లీగ్‌ల మధ్య ఏర్పడిన సయోధ్యకు మౌలానా తోడ్పడ్డారు. 1939లో మరోసారి కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టి 1948లో స్వాతంత్ర్యం లభించేంత వరకు ఆ పదవిని నిర్వహించిన మౌలానా ఆజాద్ చరిత్ర సృష్టించారు. చివరివరకు ఆయన వేర్పాటువాదాన్ని వ్యతిరేకించారు. హిందూ–ముస్లింల మధ్య ఐక్యత కోసం తీవ్రంగా కృషి చేస్తున్న మౌలానా 'స్వరాజ్యం' సాధన కంటే ఈ దేశంలోని హిందూ–ముస్లింల ఐక్యతను సాధించడం అత్యంత ప్రధానమని ప్రకటించారు. స్వతంత్ర భారతదేశంలో గాంధీజీ ఒత్తిడి మీద 1947 జనవరి 15న ఆయన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. విద్యాశాఖ మంత్రిగా విలక్షణమైన విద్యా ప్రణాళికలను అమలుచేశారు. ఈనాడు అగ్రగామిగా వెలుగొందుతున్న అకడమిక్–సాంకేతిక విద్యా సంస్థలకు మౌలానా ఆజాద్ పునాదులు వేశారు. అటు స్వాతంత్ర్యోద్యమంలో, ఇటు స్వతంత్ర భారతదేశంలో విశిష్ట పాత్రలను నిర్వహించి, జీవిత చరమాంకం వరకు హిందూ–ముస్లింల ఐక్యతను ప్రగాఢంగా వాంఛిస్తూ సాగిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1958 ఫిబ్రవరి 22న కన్నుమూశారు.

**( సయ్యద్ నశీర్ అహమ్మద్ 2014లో వెలువరించిన "చరితార్థులు" గ్రంథం నుండి)**

# భారతీయ ఆహార కల్తీ- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు

భారతీయ ఆహార కల్తీ వ్యాకూలత పై సమగ్ర పరిశోధన భారతదేశ ఆహార పద్ధతుల్లో గత కొన్ని దశాబ్దాలుగా మార్పు తీవ్రంగా కనిపిస్తోంది. పాత ఎన్నారై సంవత్సరాల క్రితం ప్రధానంగా ఇంట్లో వండించిన తాజా ఆహారం వినియోగంలో ఉండేదాంట్లో, నేడు ప్రాసెస్డ్ ఆహారం, రోడ్లకిరువైపుల బండ్లలో ఆహారం కోసం జనాభా పెద్దగా దగ్గరగా చేరి పెట్టుబడులు పెడుతుంది. ఈ అభివృద్ధి కారణంగా ఆరోగ్యపరమైన సమస్యలు వేగంగా పెరిగిపోతున్నాయి. టీసెనెల్ అధ్యయనాలు సూచిస్తున్నాయి, ప్రాసెస్డ్ ఆహారపు వినియోగం భారతీయ సమాజంలో పెరుగుతుండగా, అధిక కొవ్వు, అధిక ఉప్పు, అధిక చక్కెర కలిగిన శక్తిసాధనాలు ఎక్కువగా తీసుకో వడం ఆరోగ్య సమస్యలకు మార్గం ఏర్పరుస్తుంది.

దేశంలో కొంతకాలం క్రితం జరిపిన సర్వే ప్రకారం పట్టణ ప్రాంతాల్లో సుమారు 70 శాతం మంది ప్రతి ఒక వారం కనీసం ఒకసారి రోడ్లకిరువైపుల బండ్లలో ఆహారం తీసుకుంటున్నారు. మరో సర్వే ప్రకారం, పూర్వపు మూడు నెలల్లో సుమారు 50 శాతం మందికి ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల్లో భోజనం చేసిన కనీసం ఒక సందర్భం ఉంది. ఉపయోగించే ఆహారపు విధానంలో ఈ మార్పు సరిగ్గా కనిపిస్తుండగా, దాని ప్రభావం ఆరోగ్య రంగంలో స్పష్టంగా కనిపిస్తోంది. 2019 నుండి 2021 వరకు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఆధారంగా భారతీయ మహిళల్లో సుమారు 24 శాతం, పురుషుల్లో సుమారు 23 శాతం మందిలో అధిక బరువు లేదా అతివర్తనం సమస్య ఉందని నమోదైంది. చిన్నపిల్లల్లో కూడా తిరుగులేని త్రైమాసికాలలో ఆరోగ్య ఆంక్షలు పెరిగి, అయిదు ఏళ్ళ కింద ఉన్న పిల్లల్లో అధిక బరువు ఉన్న కారణంగా శాతం 2.1 నుండి 3.4 కు చేరింది. ఈ విధంగా ఆరోగ్యపరమైన రుగ్మతలు మాత్రమే కాదు, ఆర్థికపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒక విస్తృత అధ్యయనం ప్రకారం భారత్‌లో అధిక బరువు కారణంగా ఆరోగ్య ఖర్చులు 2035 లోప్పటికి సుమారు 8.43 బిలియన్ యునైటెడ్ కరెన్సీ యూనిట్‌ల మేరకు చేరుతాయని అంచనా. ప్రారంభ కాలంలోనే వేల కోట్ల రూపాయల పేలవ ఆరోగ్య నష్టాలు, పని దినాల కోల్పోవటం వంటి అంశాలు దేశ ఆర్థిక రంగాన్ని కిందకు తీయబోతున్నాయి. ప్రాసెస్డ్ ఆహారపు విస్తృత విక్రయాల్లో చాలా పెరుగుదల కనిపిస్తోంది. 2006 నుండి 2019 వరకు ప్రాసెస్డ్ ఆహారపు అమ్మకాలు సుమారు 40 రెట్లు పెరిగినట్లు కనిపించింది, అదే సమయంలో అధిక బరువు సమస్య ఆర్థిక సర్వే ప్రకారం ద్విగుణితం అయింది.

ఆహార అలవాట్ల మార్పునకు ముఖ్య కారణం నగర పెరుగుదల, ఆఫీస్ పనములు, బహిరంగ బండ్ల భోజనం అందుబాటు, సమయ పగిలిన జీవనశైలి. ఇంట్లో సన్నగా తయారుచేసిన ఆహారం స్థానం కోల్పోతున్నదనేది ప్రధాన అంశం. ప్రాసెస్డ్ ఆహారం అధిక కొవ్వు, చక్కెర కలిగినప్పటికీ, దాని పోషక విలువ తక్కువగా ఉంటుంది. ఎక్కువ మంది వినియోగదారులు సులభత, తక్కువ సమయంలో భోజనం పొందే అవకాశం కోసం దీనిని ఎంచుకుంటున్నారు.

పిల్లల పరిస్థితి మరింత చింతాజనకంగా మారింది. ఒక మున్సిపల్ అధ్యయనంలో సూచించినట్లు, యువతలో సుమారు 36 శాతం రోజూ ఫాస్ట్ ఫుడ్ తీసుకుంటున్నట్లు కనిపించింది. ది వల్ల శారీరక ఆరోగ్య సమస్యలతోపాటు పాఠశాలల్లో పాఠ్య సామర్థ్యం కూడా ప్రభావితమవుతుంది. ఆరోగ్య సమస్యలు అధిక బరువు, రక్తపోటు, మధుమేహం వంటి రుగ్మతలకు దారితీస్తున్నాయి. ఇటీవల ఒక పెద్ద పరిశోధనలో 101 మిలియన్ మంది భారతీయులు మధుమేహ సమస్యతో బాధపడుతున్నట్లు నమోదు కాగా, సుమారు 15 శాతం మందికి ముందస్తు మధుమేహ పరిస్థితి ఉందని తెలిపింది. అదేపల్లి, సుమారు 28 శాతం మందికి అధిక బరువు సమస్య ఉందని కూడా గుర్తించారు. ప్రభుత్వం ఈ సమస్యలపై చర్యలు చేస్తున్నప్పటికీ, పర్యవేక్షణలో విపరీత లోపం ఉంది. బండ్లలో అమ్మే ఆహారంపై తక్షణ తనిఖీలు, ప్రమాణాల అమలులో అస్తవ్యస్త పరిస్థితి ఉనుంది. దీని వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడి, దీర్ఘకాల వైద్య వ్యయం పెద్ద విషయం లోకి మారింది. చట్ట ప్రమాణాలు అందుబాటులో ఉన్నా కూడా, వేగంగా పెరిగే ప్రాసెస్డ్ ఆహారపు వినియోగం ప్రజల ఆరోగ్య పరిణామాలను పెంచుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చడానికి సమగ్ర చర్యలు అవసరం.ఆహార నాణ్యత ప్రమాణాలను నిరంతర దీక్ష, శిక్షణ ద్వారా అమలు చేయా లి. భారతీయ సమాజం ఈ ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ఒక సమగ్ర వ్యవస్థాపక విధానాన్ని ఏర్పరిచేలా చర్యలు వేగంగా తీసుకోవాలి. ప్రజల ఆరోగ్యం, సామాజిక శ్రేయస్సు, దేశ ఆర్థిక స్థితిని కాపాడాలి. అప్పుడే ఆహార కల్తీ పతనాన్ని అరికట్టగలుగుతాం. భారతీయ సమాజంలో ఆహార అలవాట్లు గత కొన్ని సంవత్సరాలలో వేగంగా మారిపోయాయి. పాత సాంప్రదాయ దైనందిన ఆహారం స్థానంలో కొత్త తరహా తయారీ ఆహారాలు వేగంగా వాడుకలోకి వచ్చాయి. పెద్దపెద్ద హోటళ్లలో పాత పద్ధతితో వండే ఆహారాల కన్నా త్వరితపాకాల, ప్యాకేజ్ చేసిన ఆహారాలు అధికంగా వినియోగంలోకి వచ్చాయి. ఇవి తక్కువ సమయంతో సులభమైన భోజనంగా కనబడినప్పటికీ, దీని వల్ల ప్రజల ఆరోగ్యం అత్యధిక స్థాయిలో ప్రభావితమవుతోంది.


ప్రపంచ ఆరోగ్య సంస్థ నాసియోన్ జరిపిన అధ్యయనాల ప్రకారం అనియత ఆహారపు అలవాట్లు, ప్యాకేజ్ చేసిన ఆహారాలు విస్తృతంగా పడుతున్నాయి. ఇవి సొంతంగా తయారుచేసిన, తాజా ఆహారం కంటే ఎక్కువగా వినియోగంలోకి వచ్చాయి. పలు విశ్లేషణల ఆధారంగా, అల్ట్రా–ప్రాసెస్డ్ ఆహారాలు ఎక్కువగా తీసుకుంటే శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా పెరిగిపోతాయి, శరీర బరువు పెరుగుతుంది, శరీరం తక్కువ పోషకాలు పొందుతుంది, అంతే కాకుండా శస్త్ర చికిత్సలు, రక్తపోటు, గుండె సమస్యలతో పీడితుల సంఖ్య ఎక్కువగా పెరుగుతోంది. పలు గ్లోబల్ సర్వేల ప్రకారం ఈ తరహా ఆహారాలు తీసే పద్ధతులు ఉపాధి పని, చదువుకు ఇబ్బందులు, మానసిక స్థితిలో పడిపోయే మార్పులు వంటి అనేక సమస్యలకు దారితీస్తున్నాయి. భారతదేశ పరిస్థితిని పరిశీలిస్తే, ప్యాకేజ్ చేసిన, తక్కువ సమయంలో అందుబాటులోకి వచ్చే ఆహారాలు పెద్ద నగరాల్లో ప్రత్యేకంగా వినియోగంలో ఉన్నాయి. ఈ పద్ధతుల వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు, ముఖ్యంగా ఊబకాయం, మధుమేహం వంటి రుగ్మతలు వేగంగా పెరిగిపోతున్నాయి. అనేక దేశీయ సర్వేల ద్వారా, పది సంవత్సరాలలో ప్రాసెస్డ్ ఆహారపు అమ్మకాలు మూడు వేల శాతం పెరిగినట్లు నమోదు అయ్యింది, ఇది ఆరోగ్య సమస్యలు విస్తృతమయ్యేలా ప్రేరేపించింది. ఈ ఫలితంగా ఆరోగ్య సేవలపై భారమైన వ్యయాలు ఏర్పడతాయి.

పెట్రోలు, టిఫిన్ కేంద్రాలు, పెద్దపెద్ద హోటళ్లు వినియోగదారుల ఆకర్షణకు నాణ్యత ప్రశ్నార్థకం అయిన ఆహారాలు పేస్తున్నాయని పలు పరిశోధనలు గుర్తించాయి. ఈ ఆహారాలలో అదనపు ఉప్పు, చక్కెర, పత్తడి పదార్థాలు ఎక్కువగా ఉండటం వల్ల శరీరంలో మంచిపోషణ పొందడం కాదు, శరీరానికి హానికరమైన ప్రభావాలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ సమస్యను నివారించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతిపాదించిన మార్గాల్లో ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహారాలు పంపిణీ, పాఠశాలలలో పోషక విలువ ఉన్న ఆహారాలు అందించడం, పెద్దపెద్ద హోటళ్లు, సాధారణ ఉపాధి ప్రాంతాలలో అనారోగ్యకరమైన ఆహారాల అమ్మకంపై నియంత్రణ విధించడం సామాన్యంగా ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన సూచనల ప్రకారం ప్రభుత్వాలు పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యం ఇచ్చి, అనారోగ్యకరమైన ఆహారపు ప్రకటనపై నియంత్రణ విధించి, ప్రజలకి తక్కువ సమయంతో తయారయ్యే ప్యాకేజ్ చేసిన ఆహారాల ఆరోగ్య ప్రభావాలను తెలియజేయాలి. ఇది పిల్లలు, యువత ప్రత్యక్షంగా ప్రభావితమయ్యే సమయంలో ఆరోగ్య నియంత్రణను మెరుగుపరుస్తుంది.ప్రపంచ ఆరోగ్య సంస్థ యొక్క హెచ్చరికలు, ప్రభుత్వ చర్యలు, ప్రజల పోషక విలువను పెంచే మార్గాలు బాగా సంక్లిష్టమైన విశ్లేషణతో సమాజంలో ఉన్న పరిస్థితిని మార్చే శక్తివంతమైన మార్గాలను సూచిస్తున్నాయి. వీటి ద్వారా అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ప్రభావాన్ని తగ్గించగలము, ప్రజలకు క్షేమమైన ఆరోగ్య పర్యావరణాన్ని అందించగలము.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

## మిరుమిట్లు రేపొచ్చు..



ఏకముగా ఇజ్జత్నే
ఇడిసేసి బుద్ధుడ్నీ
భగత్ సింగ్‌లనూ
అంబేద్కర్‌లనూ
మను మూర్తులనీ
మాజాతి శూరులనీ
కలిపేసుకున్నోళ్ళు
శివాజీని వొదిలేరా!
కాండ్రించి ముఖాన
ఉమ్మేసి నోళ్లనెల్లా
విగ్రహాలు జేసేసి
నోర్లు నొక్కేసి నోళ్లు
అవతార పురుషుల
కాషాయ కండువాల్
మెడల కేసేసి బిగదీసి
చరిత్రల్లా జైజై గొట్టిరి
బైబిలూ ఖురానూ
మనుధర్మపాయలే
మార్చ్బు ఓ రుషనీ
కూసినా వింతగాదు!
ప్రమాణాల కందని
కొలువ వీలైన లేని
వింతవాదన తోడి
వినుతి కెక్కెరీ రీతి!!
మింటి కెగియదల్చి
మిరుమిట్లు రేపొచ్చు
మంట్ల గలిసే పొద్దు
బహు దగ్గరిద్ది కద్దు!!!

**- డా. ఇక్బాల్ పాషా**
**9440775732**

# "చరిత్ర, తత్వం, నాగరికత: విల్ డురాంట్ దర్శనం"

ప్రపంచ చరిత్రను, తత్వశాస్త్రాన్ని, నాగరికతల ప్రయాణాన్ని సాధారణ పాఠకుడికి అందుబాటులోకి తీసుకువచ్చిన అరుదైన చరిత్రకారుడు ఔఱశ్రీశ్రీ ఇబటిఝట్. ఆయన రచనలు కేవలం చరిత్ర వివరాల సమాహారం కాదు; అవి మానవజాతి ఆలోచనా వికాసాన్ని అర్థం చేసుకునే సమగ్ర ప్రయత్నాలు. ముఖ్యంగా The Story of Philosophy, The Story of Civilization, The Lessons of History వంటి గ్రంథాలు మానవ అనుభవాన్ని విశ్లేషించే మహత్తర కృషిగా నిలిచాయి. "ది స్టోరీ ఆఫ్ ఫిలాసఫీ"లో డురాంట్ చెప్పిన ప్రధాన భావన ఏమిటంటే – తత్వశాస్త్రం అనేది జీవితానికి దూరంగా ఉన్న సిద్ధాంతాల సమాహారం కాదు; అది జీవన అనుభవాల నుంచి పుట్టిన ఆలోచనల ప్రవాహం. ఆయన Plato, Aristotle, Immanuel Kant, Friedrich Nietzsche వంటి తత్వవేత్తల ఆలోచనలను సులభంగా వివరించాడు. ప్రతి తత్వవేత్త తన కాలపు సామాజిక, రాజకీయ పరిస్థితు లకు ప్రతిస్పందనగా తన సిద్ధాంతాన్ని నిర్మిస్తాడని ఆయన చూపించాడు. ప్లేటోలో కనిపించే ఆదర్శ రాజ్యం భావన అతని కాలపు రాజకీయ అశాంతికి ప్రతిబింబం; నిట్షే ఆలోచనలు యూరప్‌లోని విలువల సంక్షోభానికి ప్రతిస్పందన.

డురాంట్ దృష్టిలో శాస్త్రం మరియు తత్వం పరస్పర విరోధాలు కావు. శాస్త్రం "ఎలా?" అనే ప్రశ్నకు సమాధానం ఇస్తే, తత్వం "ఎందుకు?" అని అడుగుతుంది. ఈ రెండు కలిసినప్పుడే మానవ జీవితం సమగ్రంగా అవుతుంది. జ్ఞానం కేవలం సమాచారం కాదు; అది విలువలతో కూడిన అవగాహన కావాలి.

"ది స్టోరీ ఆఫ్ సివిలైజేషన్"లో ఆయన నాగరికతల ఉద్భవం, వికాసం, పతనం గురించి విశ్లేషించాడు. నాగరికత అనేది కేవలం రాజ్యాల చరిత్ర కాదు; అది కళ, సాహిత్యం, మతం, ఆర్థిక వ్యవస్థల సమన్వయం. ఒక నాగరికత నిలబడటానికి ఆర్థిక స్థిరత్వం, రాజకీయ క్రమం, నైతిక విలువలు, విద్యా సంపద అవసరమని ఆయన అభిప్రాయపడ్డాడు. ఈ నాలుగింటిలో ఏదైనా బలహీనమైతే క్షీణత ప్రారంభమవుతుంది. చరిత్రలో ఒక నిరంతర చక్రం పనిచేస్తుందని డురాంట్ విశ్లేషించాడు. సంపద కొంతమందికి కేంద్రీకృతమవుతుంది; అసమానతలు పెరుగుతాయి; తిరుగుబాట్లు వస్తాయి; విప్లవాలు జరుగుతాయి. కానీ విప్లవం తరువాత కూడా సమానత్వం శాశ్వతంగా నిలవదు. మళ్లీ కొత్త వర్గాలు ఏర్పడతాయి. స్వేచ్ఛ మరియు నియంత్రణ మధ్య పోరాటం ప్రతి సమాజంలో కనిపించే శాశ్వత అంశం.

"ది లెసన్స్ ఆఫ్ హిస్టరీ"లో డురాంట్ చరిత్ర నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను సంక్షిప్తంగా వివరించాడు. టెక్నాలజీ మారినా, మానవ స్వభావం పెద్దగా మారదని ఆయన అభిప్రాయం. అధికారం, ధనం, భయం, ఆశలు – ఇవి కాలానుగుణంగా రూపం మార్చుకున్నా మూల స్వభావం మారదు. అందువల్ల గతాన్ని విస్మరిస్తే తప్పిదాలు మళ్లీ పునరావృతమవుతాయి.

ఆర్థిక పురోగతి నైతిక విలువలతో సమతుల్యం కావాలని డురాంట్ హెచ్చరిస్తాడు. సంపద పెరిగినా సంస్కృతి బలహీనమైతే సమాజం లోపలే పతనం ప్రారంభమవుతుంది. అనేక సామ్రాజ్యాలు బాహ్య శత్రువుల వల్ల కాకుండా అంతర్గత అవినీతి, నైతిక పతనం వల్ల కూలిపోయాయని ఆయన సూచించాడు.

మతం సమాజంలో నైతిక క్రమాన్ని నిలబెట్టడంలో పాత్ర పోషించిందని ఆయన అంగీకరించినా, మత అసహనం అభివృద్ధికి అడ్డంకి అవుతుందని హెచ్చరించాడు. శాస్త్రం, తత్వం, మతం – ఇవి పరస్పరం సమతుల్యంలో ఉన్నప్పుడే నాగరికత స్థిరంగా ఉంటుంది. డురాంట్ చరిత్రను నిరాశతో చూడలేదు. యుద్ధాలు, విపత్తులు వచ్చినా మానవ సృజనాత్మకత నిలకడగా కొనసాగుతుందని ఆయన విశ్వసించాడు. కళలు, విజ్ఞానం, ప్రేమ, సహకారం- ఇవే మానవజాతి నిజమైన సంపద. నాగరికతలు కూలినా జ్ఞానం తరతరాలకు సంక్రమిస్తుందని ఆయన పేర్కొన్నాడు. విద్యపై కూడా ఆయన స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేశాడు. విద్య కేవలం ఉపాధి కోసం కాకుండా, బాధ్యతగల పౌరులను తీర్చిదిద్దాలి. కుటుంబం, విద్యాసంస్థలు, సాంస్కృతిక వ్యవస్థలు సమాజ స్థిరత్వానికి పునాదులు.

మొత్తంగా చూస్తే, విల్ డురాంట్ రచనలు మనిషి గతాన్ని అర్థం చేసుకోవడానికి ఒక విశాల దర్పణం. తత్వం జీవన అనుభవాల నుంచి పుట్టిందని, నాగరికత విలువల మీద నిలబడుతుందని, చరిత్ర పాఠాలను నిర్లక్ష్యం చేస్తే పతనం తప్పదని ఆయన సందేశం. శాస్త్రం, నైతికత, సంస్కృతి సమన్వయంతోనే స్థిరమైన ప్రగతి సాధ్యమని ఆయన స్పష్టం చేశాడు. చరిత్రను చదవడం అంటే తేదీలను గుర్తుపెట్టుకోవడం కాదు; మానవ అనుభవాల నుంచి జ్ఞానం సంపాదించడం.

అదే ఆయన రచనల శాశ్వత ప్రాముఖ్యత.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# సంఘ్ పరివార్‌కు సరిజోడీ గల్గోటియా!

**ఈ వారం పత్రికలలో, ఛానళ్లలో, సామాజిక మాధ్యమాలలో మార్మోగిపోయిన పేరు గల్గోటియా. బహుశా ఇంత తక్కువ సమయంలో ఇంత ఎక్కువ వార్తలు, వ్యాఖ్యలు, విశ్లేషణలు, వ్యంగ్యాలు, పరిహాసాలు, వెటకారాలు సృష్టించడా నికి కారణమైన వ్యక్తి, సంస్థ, ఉదంతం మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు.**

గల్గోటియా పేరు ఎందుకు మోగిపోయిందో తెలుసుకునే ముందు అస లు సందర్భం గురించి తెలుసుకోవాలి. అది ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 అనే ఆరు రోజుల అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశం, ప్రదర్శన. ఎఐ అంటే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ – కృత్రిమ మేధ. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సాధించిన కొత్త విజయం ఎఐ. మానవ మేధతో సమానమైన శక్తి, సృజనాత్మకత సాధించే ప్రయత్నంలో ఒక అడుగు అది. నిజంగా ఎఐ చేయగలిగిన పనులకు హద్దు లేదు. ఇప్పటికే ఎఐ వ్యక్తిగతంగా సహకరించే పనుల దగ్గరి నుంచి భారీ పరిశ్రమల దాకా, ప్రమాదకరమైన పనుల నుంచి, సంగీత, సాహిత్యాలను సృష్టించడం దాకా అనేక పనులు చేస్తున్నది. ఇలా అది అన్ని పనులూ చేయగలిగితే, మరి మానవ శ్రమకు ఏమవుతుంది, మానవ సృజనాత్మకతకు అర్థం ఉందా లేదా అనే రాజకీయార్థిక, నైతిక ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

అత్యంత వేగంగా జరుగుతున్న ఎఐ పరిణామాల గురించి చర్చించుకోవడానికీ, అది సాధించిన విజయాలను ప్రదర్శనకు పెట్టి అందరికీ చూపడానికి, శాస్త్ర, సాంకేతిక నిపుణుల మధ్య, కంపెనీల మధ్య ఆదాన ప్రదానాలు సాధించడానికి అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశాలు ఏర్పాటు చేయడం 2023లో ప్రారంభమయింది. ఇంగ్లండ్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్ తర్వాత, భారతదేశంలో ఈ సమ్మిట్ జరిగింది. ఈ సమ్మిట్ లో వందకు పైగా దేశాల నుంచి మూడు లక్షల మంది ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్ తో సహా మొత్తం 30 దేశాలకు చెందిన 300 ప్రదర్శనశాలల్లో 600 కంపెనీలు, స్టార్టప్ లు తాము కనిపెట్టిన, తయారు చేసిన ఎఐ ఉత్పత్తులను ప్రదర్శనకు పెట్టాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఇది అత్యంత ప్రతిష్ఠాత్మకమైన శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన. ఒకరకంగా భారత శాస్త్ర, సాంకేతిక రంగ సంస్థలకు, నిపుణులకు కొత్త విషయాలు తెలుసుకోవడానికి, అంతర్జాతీయ స్థాయి సంస్థలతో, నిపుణులతో సంబంధాలు పెట్టుకోవడానికి అరుదైన అవకాశం. అటువంటి చోట చౌకబారు రాజకీయ ఎత్తుగడలకు, ఆశ్రిత పక్షపాతాలకు, అహంకారాల ఆర్భాట ప్రదర్శనకు, అవినీతికి ఎంతమాత్రం అవకాశం ఉండగూడదు. కాని సంఘ్ పరివార్ నాయకత్వంలోని భారత ప్రభుత్వానికి తెలిసినవే అవి. అంతర్జాతీయ స్థాయి శాస్త్ర, సాంకేతిక ప్రమాణాలు ఏమిటో, వాటికి ఎలా కట్టుబడి ఉండాలో, ఒకటికి రెండు సార్లు పరిశీలించుకుని ఎటువంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలో తెలియదు. అందువల్ల ఇంత గొప్ప, అరుదైన అవకాశాన్ని చేజేతులా ధ్వంసం చేశారు. సదస్సు ముగిసే సరికి, సదస్సు హాస్యాస్పద ఉదంతంగా




మిగిలిపోయేలా చేశారు. దాదాపుగా సదస్సు ప్రతి రోజూ ఏదో ఒక గందరగోళం జరిగింది. మొదటి రోజున ప్రధాన మంత్రి రాక కోసం సందర్శకులను మాత్రమే కాక, ప్రదర్శనశాలల నిర్వాహకులను, సిఈవోలను, సాంకేతిక నిపుణులను బైటికి పంపారని, ప్రధానిక రాకకు రెండు గంటల ముందు నుంచి లోపల ఆయన కార్యక్రమం, షూటింగ్ జరిగిన నాలుగు గంటల పాటు అందరూ బైట ఎండలో వేచి చూడవలసి వచ్చిందని వార్తలు వచ్చాయి. వారిని బైటికి పంపుతున్నప్పుడు, వారి ప్రదర్శన సామగ్రి అక్కడే వదిలి వెళ్లాలని ఆదేశించారని, తిరిగి వచ్చేసరికి ఆ సామగ్రిలో కొన్ని వస్తువులు మాయమయ్యాయని వార్తలు వచ్చాయి. చివరి రోజున కాంగ్రెస్ కార్యకర్తలు అవమానకరమైన భారత–అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా ప్రదర్శన జరపడానికి ఆ స్థలాన్నే ఎంచుకున్నారు. అన్నిటికన్నా ముఖ్యమైన ఘటన గల్గోటియాకు సంబంధించినది. ప్రపంచవ్యాప్తంగా భారత విజ్ఞాన సంస్థల పరువు, దేశపు పరువు తీసిన ఘటన అది.

భారత్ మండపం అని పేరు పెట్టిన ప్రదర్శన శాలలో ఆరో నంబర్ హాలులో గల్గోటియా యూనివర్సిటీకి చాలా పెద్ద ప్రదర్శన పావిలియన్ ఇచ్చారు. ఐఐటీ బొంబాయి 35 చ.మీ., ఐఐటీ చెన్నై 35 చ.మీ., ఐఐటీ ఖరగ్ పూర్ 24 చ.మీ., ఐఐటీ గాంధీనగర్ 18 చ.మీ., ఐఐటీ కాన్పూర్ కు చెందిన ఐరావత్ రీసర్చ్ ఫౌండేషన్ 18 చ. మీ. అంటే మొత్తం ఐదు ఐఐటీలకు కలిపి 130 చ.మీ. కాగా, గల్గోటియా యూనివర్సిటీకి 155 చ.మీ. స్థలం దక్కింది. ఈ యూనివర్సిటీ ఏమైనా ఐఐటీలను మించిన శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా సంస్థనా అంటే అదేమీ లేదు. గత పదిహేను సంవత్సరాలుగా ఉనికిలో ఉన్న ఈ ప్రైవేట్ యూనివర్సిటీ 2,297 పేటెంట్ల కోసం దరఖాస్తు చేసి, కేవలం 24 పేటెంట్లు మాత్రమే సాధించింది. ఇది ఒక్క శాతం విజయం. అదే సమయంలో ఐఐటీ లు సాధించిన పేటెంట్లు 63 శాతం.

అసలు ఇన్ని పేటెంట్ల దరఖాస్తులు పెట్టడం కూడా ఒక కుంభకోణం. ప్రతి పేటెంట్ దరఖాస్తుకూ ఆయా సంస్థలు 1600 రూపాయలు చెల్లించాలి. కాగా వచ్చిన ప్రతి దరఖాస్తుకూ ప్రభుత్వం 2 లక్షల రూపాయల వరకు ఖర్చులు చెల్లిస్తుంది. అంటే అది పనికి వచ్చేది అయినా కాకున్నా, ఒక పేటెంట్ దరఖాస్తు చేసి, ఖర్చులు దొంగలెక్కలు చూపితే, రు. 1,98,400 సంపాదించవచ్చు. గల్గోటియా యూనివర్సిటీ, కేవలం పేటెంట్ దరఖాస్తుల మీదనే ప్రభుత్వం నుంచి 45 కోట్ల రూపాయల ప్రజాధనం అప్పనంగా కొట్టేసి ఉంటుంది.

సరే, అది అట్లా ఉంచి, సదస్సు రెండో రోజు ఉదయానికల్లా ఢిల్లీలో అన్ని దినపత్రికల మొదటి పేజీ నిండా గల్గోటియా యూని వర్సిటీ ప్రకటనలు వెలువడ్డాయి. 'గల్గోటియా యూనివర్సిటీ రైజింగ్ గ్లోబల్లీ పవర్డ్ బై ఎఐ, డ్రివెన్ బై ఇన్నోవేషన్' అనే ఆ ప్రకటనలో ఎఐ అనే పెద్ద అక్షరాల మీద ఒక రోబో కుక్క బొమ్మ ఉంది. అంతకు ముందే కేంద్ర ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విన్ వైష్ణవ్ తన ట్విట్టర్ అకౌంట్‌లో ఆ కుక్క బొమ్మ వేసి 'భారతదేశపు సార్వభౌమాధికార నమూనాలు అంతర్జాతీయ ప్రమాణాల తో పోటీ పడుతున్నాయి. మన ఇంజనీర్ల, అన్వేషకుల గణనీయమైన విజయానికి ఇది ఒక నిదర్శనం' అని రాశాడు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మీద గల్గోటి యా 350 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిందని ఆ యూనివర్సిటీ పెద్దలు పత్రికలలో గొప్పలు చెప్పుకున్నారు. అంటే ఆ రోబో కుక్క ఆ రోజు వార్తల్లో ప్రముఖ అంశంగా ఉండబోతుందని ఎవరైనా ఊహించగలరు. సహజంగానే డీడీ న్యూస్ (దూరదర్శన్) విలేఖరి తపస్ భట్టాచార్య గల్గోటియా పావిలియన్ దగ్గరికి వెళ్లి ఆ రోబో కుక్క విన్యాసాలు చిత్రీకరించాడు. అక్కడ సందర్శకులకు వివరణ ఇవ్వడానికి ఉన్న గల్గోటియా యూనివర్సిటీ కమ్యూనికేషన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ నేహా సింగ్ తో మాట్లాడాడు. ఆమె చాలా మామూలుగానే, "ఇది పూర్తిగా మా యూనివర్సిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తయారు చేశాం. దీని పేరు ఒరాయ న్" అని గొప్పలు చెప్పుకుంది. ఈ వార్త ట్విట్టర్ మీద బైటికి రాగానే, అటువం టి రోబో కుక్కనే యూనిట్రీ అనే చైనా కంపెనీ ఎప్పుడో వాణిజ్యపరంగా తయారు చేసి, మార్కెట్లలో అమ్ముతున్నదనీ, దాని ధర ఫలానా అనీ ఎవరో స్పందించారు. దొంగతనం బహిరంగమయింది. ఇక అక్కడి నుంచి ప్రళయం ప్రారంభమయింది. అప్పటిదాకా గల్గోటియా యూనివర్సిటీ మీద ప్రశంసలు కురిపించిన కేంద్ర ప్రభుత్వ మంత్రులూ, అధికారులూ తమ బాధ్యత నుంచి తప్పించుకోవడం మొదలు పెట్టారు. వెంటనే గల్గోటియా యూనివర్సిటీని పావిలియన్ ఖాళీ చేసి పొమ్మన్నారు. ఆ రోబో కుక్కను తాము తయారు చేశామని చెప్పలేదని, విలేఖరులు పొరపాటుగా అర్థం చేసుకున్నారని నేహా సింగ్ మరొక ఇంటర్వ్యూ ఇచ్చారు. గల్గోటియా యూనివర్సిటీ మొదట తమ మీద ఉద్దేశపూర్వకంగా ఎవరో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఒక ప్రకటన ఇచ్చింది. ఆ తర్వాత తాము విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి అమెరికా నుంచీ, చైనా నుంచీ ఎఐ ఉత్పత్తులు కొంటామని, ఈ రోబో కుక్క కూడా అటువంటిదని, అక్కడ ఇంటర్వ్యూ ఇచ్చిన వ్యక్తికి తెలియక ఏదో చెప్పారని, అసలు ఆమెకు అక్కడ యూనివర్సిటీ తరఫున మాట్లాడే బాధ్యత కూడా ఇవ్వలేదని ప్రకటన ఇచ్చింది. ఈలోగా ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారని సామాజిక మాధ్యమాలలో వార్తలు వచ్చాయి. ఆమెను తొలగించలేదని, ఈ పొరపాటు ఎలా జరిగిందో విచారణ జరపడానికైనా ఆమె తమ ఉద్యోగిగా ఉంటారని యూనివర్సిటీ మరొక ప్రకటన ఇచ్చింది. ఈ వ్యవహారం మాత్రమే కాదు, గల్గోటియా యూనివర్సిటీకి ఘనమైన చరిత్ర ఉంది. ఉత్తరప్రదేశ్ కు చెందిన సునీల్ గల్గోటియా 2010–2012 మధ్యనే యూనివర్సిటీ, ఇతర విద్యా సంస్థలు పెట్టడానికి 120 కోట్ల రుణం కోసం డాక్యుమెంట్లు ఫోర్జరీ చేశాడని కేసు నమోదయింది. 2014 ఆగస్ట్ లో సునీల్ గల్గోటియా భార్య పద్మిని గల్గోటియాను, కొడుకు ధృవ్ గల్గోటియాను ఫోర్జరీ, మోసం, అప్పు ఎగ్గొట్టడం నేరాల మీద అరెస్టు చేశారు. అప్పుడు అలహాబాద్ హైకోర్ట్ నుంచి స్టే తెచ్చుకుని సునీల్ గల్గోటియా అరెస్టు తప్పించుకున్నాడు. ఆ కేసును 2015 సెప్టెంబర్ లో అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది.

ఆ తర్వాత విద్యార్థుల నుంచి ఎక్కువ ఫీ వసూలు, కోవిడ్ కాలానికి కూడా ఫీ వసూలు వంటి అనేక ఆరోపణలు వచ్చాయి గాని ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి చర్యలు జరగలేదు. ఈలోగా సునీల్ గల్గోటియా బహిరంగంగా నరేంద్ర మోడీకి తన మద్దతు ప్రకటించడమూ, కేంద్ర ప్రభుత్వం గల్గోటియా యూనివర్సిటీ మీద వరాలు కురిపించడమూ జరిగిపోయింది. ప్రస్తుత ప్రహసనం లాంటిదే, 2024 ఎన్నికలకు ముందు గల్గోటియా యాజమాన్యం విద్యార్థులతో చేయించింది. కొందరు విద్యార్థులు రాహుల్ గాంధీకీ, కాంగ్రెస్ కూ వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని రాహుల్ గాంధీ నివాసం ముందర ప్రదర్శనకు వచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్వయంగా గోడీ మీడియా విలేఖరులే వెళ్లి ఆ విద్యార్థులను ఎందుకు వచ్చారు, డిమాండ్ ఏమిటి వంటి ప్రశ్నలు అడిగితే ఆకుకు అందని పోకకు పొందని జవాబులు ఇచ్చారు. వారిని వారి యూనివర్సిటీ యాజమాన్యం తోలిందని అక్షరాలా బైటపడింది. దానికి కొనసాగింపుగానే ఇప్పుడు మొత్తం మీద ఒక అంతర్జాతీయ స్థాయి శాస్త్ర, సాంకే తిక సదస్సును గల్గోటియా నవ్వుల పాలు చేసింది. భారతదేశంలో శాస్త్ర, సాంకేతిక శక్తి సామర్థ్యాల మీద, ప్రభుత్వ పర్యవేక్షణా సామర్థ్యం మీద, అవినీతి మీద కొన్ని వేల లేదా లక్షల వ్యంగ్య వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సంఘ్ పరివార్ తయారు చేసిన, విపరీతమైన అప్రతిష్ఠ మూటగట్టుకుంటున్న వాట్సప్ యూనివర్సిటీకి, అదే సంఘ్ పరివార్ కు సన్నిహితమైన గల్గోటియా యూనివర్సిటీ గట్టి పోటీ ఇస్తున్నది.



**ఎన్ వేణుగోపాల్**
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

# పార్టీలకతీతంగా పని చేసి అభివృద్ధి సాధించాలి

- గ్రామాల్లో సర్వోత్తముఖాభివృద్ధి సాధిద్దాం
- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** గ్రామాలలోని ప్రజలందరూ మనకు సమానమేనని, పార్టీలకతీతంగా పనిచేసి గ్రామాలలో సర్వోతో ముఖాభివృద్ధి సాధించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. గత ఐదు రోజులుగా వనపర్తి నియోజకవర్గ పరిధిలోని వనపర్తి, పెబ్బేరు, శ్రీరంగాపురం, ఏదుల, రేవల్లి, పానగల్ , వీపన్ గండ్ల, చిన్నంబావి మండలాల్లోని గ్రామాలకు సంబంధించిన సర్పంచులకు, వనపర్తి శివారులోనీ వై టి సి యూత్ ట్రైనింగ్ సెంటర్లో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి శనివారం ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. శిక్షణ తరగతులకు వచ్చిన సర్పంచులందరికీ ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. గ్రామాల్లో నెలకొనే పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సమస్య, వీధి దీపాల ఏర్పాట్లు, మురికి కాలువలో ఏర్పాటు పరిశుభ్రత, కరెంటు ట్రాన్స్ఫార్మర్లు, లాంటిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో చేపట్టే ప్రతి పనిలో వార్డు సభ్యులను భాగస్వాములు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. నిర్వహించే గ్రామ సభల్లో సంబంధిత అధికారులందరినీ హాజరయ్యాలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామ వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామస్థాయిలోని ఆరోగ్య కేంద్రాల్లో అన్ని మందులు నిల్వ ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత సర్పంచులు లేదని ఆయన పేర్కొన్నారు. రైతులకు సంబంధించి భీమాకు కావలసిన వివరాలను ప్రతి ఒక్కరి పొందుపరచాలని వ్యక్తికి ఏదైనా జరిగినప్పుడు మాత్రమే మనం హడావిడిగా అన్ని పత్రాలను జమ చేసేందుకు ఇబ్బంది పడకుండా ముందుగానే భీమాకు సంబంధించిన వివరాలన్నింటినీ సంబంధిత శాఖ అధికారులతో పొందుపరిచేలా చూడాలన్నారు. భూ వివరాలకు సంబంధించి ఏదైనా మార్పిడి జరిగినప్పుడు వెంటనే వారి వివరాలను అప్డేట్ చేసేలా చూడాలన్నారు లేదంటే రైతు భరోసా లాంటి పథకాలలో ఇబ్బందులు పడతారని ఆయన పేర్కొన్నారు. సర్పంచులకు గౌరవ వేతనం పెంపు విషయంలోనూ మీ అభ్యర్థనను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు.
గ్రామస్థాయిలో కావలి కార్ వ్యవస్థను సైతం పటిష్ట పరుస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఒక్కసారి సర్పంచులుగా గెలుపొందిన మీరు చేసే సేవ జీవితంలో ప్రతి ఒక్కరు అభినందించేలా ఉండాలని గుర్తుండిపోయేలా ఉండాలని సూచించారు. అనంతరం శిక్షణను పొందిన సర్పంచులందరికీ ఎమ్మెల్యే ద్రౌపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, స్థానిక సంస్థల కలెక్టర్ యాదయ్య, డి ఎల్ పి ఓ,రఘునాథ్ రెడ్డి, డిపిఓ,చక్రవర్తి, డిఆర్డిఓ రాజు ఆయా మండలాల ఎంపీడీవోలు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఖిల్లా ఘనపురం మండలం సోలిపురం గ్రామంలో శనివారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో సోలిపూర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరికీ వైద్య సేవలు అందించేందుకు సులభతరమవుతుందని దంతో నూతనంగా ఈ అతనికి ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఖిల్లా గణపురం మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉందని దానికి అనుబంధం గానే ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాయినాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సింధు శేఖర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల పేరుతో హాల్ టికెట్ ఇవ్వని ప్రైవేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి



**చేవెళ్ల, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** ఫీజుల పేరుతో హాల్ టికెట్ ఇవ్వని ప్రైవేట్ కాలేజీల పైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి బేగారి అరుణ్ కుమార్ హాజరైనారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ...చేవెళ్ల డివిజన్లో ఉన్నటువంటి నాలుగు మండలాలు చేవెళ్ల, షాబాద్, శంకర్పల్లి, మొయినాబాద్ ఉన్నటువంటి ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజు కట్టని పేరుతో హాల్ టికెట్ ఇవ్వకపోతే, లేదా స్కాలర్షిప్ పడలేదు అని వేధింపులకు గురి చేస్తే నిరంతరం విద్యార్థులకు ఉన్నటువంటి సమస్యల పైన పోరాటాలు చేసేటువంటి విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ నాయకులకు తెలియజేయగలరని సూచించడం జరిగింది. అదేవిధంగా సమాచారం అందిన వెంటనే స్పందించి ఖచ్చితంగా ప్రవేట్ కాలేజీల యజమాన్యంతో మాట్లాడి హాల్ టికెట్ ఇప్పించడం కూడా జరుగుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, చేవెళ్ల మండల సహాయ కార్యదర్శి మణికంత, సోషల్ మీడియా ఇంచార్జి వినోద్, తరుణ్, సంతోష్, వేణు రిశికిరణ్ తదితరులు ఉన్నారు.


## గిరిజన రైతులకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్‌కు వినతి



**శంకర్‌పల్లి, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** శంకర్పల్లి మండల పరిధిలోని మోకిలా గ్రామ శివారులోని పొన్నగుట్ట తాండ గిరిజన రైతులు తమకు ప్రభుత్వం నుండి వచ్చిన అసైన్డ్ భూముల ను ఈ మధ్యకాలంలో ప్రభుత్వం తీసుకొని ఎకరాకు 800 గజాల చొప్పున రైతులకు ఇస్తున్నది ఒరిజినల్ పట్టాదారులను ప్రభుత్వం వదిలేసి ఎలాంటి సంబంధం లేని వారిని చేర్చి వేరే ఇద్దరినీ చేర్చి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఒరిజినల్ పట్టా పాస్ బుక్కులు పొందిన గిరిజన రైతులకు న్యాయం చేయాలని శనివారం సిపిఐ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు ఎం ప్రభు లింగం, శంకరపల్లి మండల కార్యదర్శి పి సుధీర్, నాయకులు రాజేందర్ గౌడ్,బద్దం శివారెడ్డి, రవి శంకర్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ...గిరిజన రైతులను మోసం చేయాలని చూస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకొని గిరిజన రైతులకు న్యాయం చేయకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో పాటు దేశభక్తి అలవర్చుకోవాలి

- పది ఫలితాల్లో తమ ఫలితాలు సాధించాలి




**తాండూరు, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం పరిధిలోని జడ్.పి.హెచ్.ఎస్ మంబాపూర్ పాఠశాలలో ఎస్ఎస్సి విద్యార్థుల తల్లిదండ్రుల తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని "మిషన్ ఎస్.ఎస్.సి 100శాతం ఫలితాలు లక్ష్యంగా పేరెంట్స్ - టీచర్స్ మీట్ ఏర్పాటు చేయగా, భారీ ఎత్తున11 గ్రామాల తల్లిదండ్రులు హాజరయ్యారు. ప్రపంచ మాతృభాష దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి కవయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షులు కేవిఎం వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషపై మమకారం పెంచుకొని ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాల సర్వతోముఖ అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని, ఈసారి ఎస్ఎస్సి ఫలితాల్లో మండల స్థాయిలో టాప్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు రాజకీయ నాయకులుగా ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్మీలో ఉపాధ్యాయులుగా పోలీస్ కానిస్టేబుల్ గా ఉద్యోగాలు సాధించారు. వారిని ఆదర్శంగా తీసుకొని ఎదగాలని సమాజానికి ఉపయోగపడాలన్నారు. మంబాపూర్ గ్రామ సర్పంచ్ భార్గవి శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ పాఠశాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలలో క్రమశిక్షణ దేశభక్తి పెంపొందించాలని పరీక్షల వరకు సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తయారుచేసిన టిఎల్ఎంని పరిశీలించారు. జనగామ గ్రామ సర్పంచ్ అరుణ ఎస్ ఎస్ సి లో 500 పైగా మార్కులు వచ్చిన వారికి 11000 నగదు అందజేస్తానన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు సబ్జెక్ట్‌వైస్ రివ్యూ నిర్వహించారు. పాఠశాల జిహెచ్ఎం శ్రీనివాస్ టీచర్స్ ,నూతనంగా ఎన్నికైన సర్పంచులను సన్మానించారు. అనంతరం వికారాబాద్ జిల్లా పాలిటెక్నిక్ కళాశాల బృందం చేత పాలిటెక్నిక్ అడ్మిషన్ పోస్టర్ని ఆవిష్కరించారు. జనగాం అరుణ, రుక్మాపూర్ బాలరాజు, రేగొండి అశోక్ కుమార్, మారేపల్లి తండా సర్పంచ్‌లు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ పావని, 11 గ్రామాల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మోహన్ ,ఆనందం ,సుధాకర్, శేఖర్, ఆంజనేయులు, నిర్మల ఎన్ నిర్మల యాదమ్మ మమత స్వరూప విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, ఎస్ఎస్సి ఫలితాల్లో 100% విజయాన్ని సాధించాలని అందరూ సంకల్పించారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలేవి

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ
- కుంటను మాయం చేస్తున్న పట్టించుకోని అధికారులు



**అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని హత్తిగూడా రెవెన్యూ సర్వే నంబర్ 19 మరియు హయత్ నగర్ మండల పరిధిలోని సర్వే నంబర్ 98లో కలిపి సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చిన్న కుంటను అక్రమంగా పూడ్చి, ఆయకట్టుకు వెళ్లే నాలాను మూసివేసి, ప్రభుత్వ భూమిలో వెంచర్ వేసి విల్లాల నిర్మాణం చేపడుతున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ డిమాండ్ చేశారు. శనివారం రోజున సిపిఐ నాయకులు హత్తిగూడా చిన్న కుంట మరియు దాని నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారీ మాట్లాడుతూ, తక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రైవేట్ భూమిని సాకుగా చూపించి, కుంట మరియు దాని నాలాను పూడ్చి, కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని ఆక్రమించి విల్లాల నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. సంబంధిత రియల్ ఎస్టేట్ వ్యాపారి రెవెన్యూ అధికారులను తప్పుదారి పట్టిస్తూ భారీగా లాభాలు పొందుతున్నాడని పేర్కొన్నారు. ఇదే విషయంపై 2023లో అధికారులకు ఫిర్యాదు చేయగా కొంతకాలం పనులు నిలిపివేయబడ్డాయని, అయితే తిరిగి నిర్మాణాలు ప్రారంభమవడంతో ఈ నెల 16న హైడ్రా కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే వెంటనే అడ్డుకునే అధికారులు, కోట్ల రూపాయల విలువైన భూమి మరియు నాలా కబ్జాకు గురవుతున్నా నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శించారు. హత్తిగూడా చిన్న కుంట ఎంతో పురాతనమైందని, ఎల్‌బి నగర్ సర్కిల్ పరిధిలోని అనేక కాలనీల వర్షపు నీరు ఈ కుంటలో చేరుతుందని తెలిపారు. కుంట నుండి అలుగు పోయే నాలా పూర్తిగా కనుమరుగై, దాని స్థానంలో వెంచర్ చేసి నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల రెవెన్యూ మరియు నీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే స్పందించి సర్వే నిర్వహించి, కబ్జాకు గురైన సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమి మరియు ఆయకట్టు నాలాను రక్షించి కుంటకు పూర్వ వైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్ మెట్ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, బిఓసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, సిపిఐ నాయకులు వడ్త్యా రమేష్ నాయక్, పేరాల గోపి, నిరంజన్, ఉప్పలయ్య, అశోక్, పాండు, ప్రియా, అన్నపూర్ణ, రాజు, విరమల్లు, మాల్సూర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల హామీలను అమలు చేయాలి


- తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం



**హయత్‌నగర్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం లను తెలంగాణ రాష్ట్రాన్ని రాజ్యసభలో ప్రకటించిన రోజు సందర్భంగా శుక్రవారం కామారెడ్డిలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలంగాణ ఉద్యమకారుల గురించి ప్రస్తావించిన సందర్భంగా వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్చం అందజేసి, వారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామన్న హామీని అమలు చెయ్యాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం పదివేల కోట్ల రూపాయలతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులకు ప్రతినెల 25 వేల పెన్షన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, బస్సు, ట్రైన్ పాస్ లను ఇవ్వాలని, ఉద్యమకారుల పిల్లలకు విద్యాలయాల లో ఫీజు రాయితీ కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఉద్యమకారులకు 25 శాతం అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల పోరం నాయకులు ఓరుగంటి ఆనంద్, జెనిగె విష్ణువర్ధన్, కారింగుల నరేందర్ గౌడ్, కొంతం యాదిరెడ్డి, నక్క జంగయ్య గౌడ్, జొరక రాము ముదిరాజ్, జానకి రెడ్డి, మాదాసు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం

- ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి



**ఖిల్లా ఘనపురం, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** ఖిల్లా ఘనపురం అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం అందిస్తుంది అని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు శనివారం మండల కేంద్రం లోని సోలిపురం గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల గృహప్రవేశం ప్రవేశం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి లబ్ధిదారులు షాపూర్ గౌరమ్మ, కోళ్ల నాగమ్మ, జెనిగే లక్ష్మమ్మ, వారు ప్రభుత్వం చే నూతనగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం నాకి వచ్చిన ఎమ్మెల్యే వారి గృహంలో లబ్ధిదారులకు పట్టు పంచె చీరలను అందించారు వారి కుటుంబ సభ్యులతో కలసి బంతి భోజనం చేశారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని ఇల్లు లేని పేదవారికి ఇళ్లను మంజూరు చేయిస్తామని దశల వారిగా అర్హులైన ప్రతి ఒక్కరికి సహాయం చేస్తామని అన్నారు, అనంతరం నూతనగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే మండల నాయకులతో కలసి ప్రారంభించారు, సోలిపూర్, చుట్టూ గ్రామాల తాండల ప్రజలు ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్య అధికారి సాయి నాథ్ రెడ్డి, తహసీల్దార్ బి. సుగుణ, స్థానిక సర్పంచ్ సింధు తినేటి, రవీందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఎంపి డి ఓ విజయ్ సింహ, రవి నాయక్, శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అంచనాలకు అనుగుణంగా గ్రామ పరిపాలన అందించాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఏర్పాటు చేసిన ఓరియంటేష న్ శిక్షణ కార్యక్రమాన్ని సర్పం చులు సద్వినియోగం చేసు కుని ప్రజల అంచనాలకు అనుగుణంగా తమ తమ గ్రామాలలో మంచి పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించా రు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఆదేశానుసారం గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో శనివారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో నూతనంగా ఎన్ని కైన సర్పంచుల 3వ , 4వ బ్యాచ్ శిక్షణా కార్యక్రమం ముగింపులో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరయ్యా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది డిసెం బర్ 17 వరకు జిల్లాలో మూడు విడతలలో సర్పం చుల ఎన్నికలను పూర్తి చేశామని తెలిపారు. అదే నెల 24 న స్వయాన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలోని కోస్గి పట్టణంలో కొత్తగా ఎన్నికై న నారాయణ పేటజిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని సర్పంచులను సన్మానించా రు. కొత్తగా ఎన్నికైన సర్పం చులకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఓరియంటే షన్ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగానే మన జిల్లా కేంద్రంలోనూ ఓరియం టేషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించుకున్నాం అని ఆమె చెప్పారు. 5 రోజుల పాటు నిర్వహించినా ఈ శిక్ష ణా కార్యక్రమంలో సీనియర్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు 2018 పంచాయతీ రాజ్ చట్టంపై పూర్తి స్థాయిలో అవ గాహన కల్పించి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు, అధికా రాలు గురించి వివరించారని తెలిపారు. మున్ముందు మరి న్ని శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహించుకుందాం అని ఆమె తెలిపారు. వేసవి కాలంలో వర్షాకాలంలో తీసు కోవాల్సిన జాగ్రత్తలు తాగు నీరు తదితర అంశాల గురించి సర్పంచుల అవగాహన కలిగి ఉండాలన్నారు. తడి పొడి చెత్త వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ లో తరలించాలని గ్రామాలు పారిశు భ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులకు ఎంతమంది లేబర్ వస్తున్నారో పరిశీలించాలని గ్రామాలలో సిసి రోడ్లు డ్రెయి న్లు 100శాతం నిర్మించేలా బాల్య వివాహాలు అరికట్టాలి సర్పంచులు చొరవ తీసుకోవా లని అన్నారు. గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణలో సర్పంచుల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. దేశ అభిరుద్ధి గ్రామం నుంచే ప్రారంభమవు తుంది కాబట్టి గ్రామాలు అభి వృధి చెందాలంటే సర్పంచూ ల పాత్ర ముఖ్యమని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సర్పంచు లకు తెలిపారు. కుల మత పార్టీ లకు అతి తంగా గ్రామా లను అభివృధి పరుచుకో వాలని సూచించారు. భారత దేశం లో ఇద్దరికీ మాత్రమే పార్టీ లకు సంబంధం లేకుండా ఎన్నుకుంటారని ఒక్కటి రాష్ట్రపతి ని ఇంకొకరు సర్పం చని తెలిపారు. పిల్లలకు చెడు వేసినాలకు దూరంగా ఉండేట ట్లు చూడాలని, అలాగే కేంద్ర రాష్ట్ర ప్రాభుత్వాలు విద్యార్థి విద్యార్థినులకు ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చాయని సూచించారు. భేటీ బచ్చవు భేటీ పాడావ్ అనే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. త్వరలో ఒక మంచి కార్యక్ర మం ద్వారా గ్రామానికి పోలీ సు వస్తారని, ప్రతి గ్రామం లో ఓ ఫిర్యాదుల బాక్స్ ను ఏర్పా టు చేస్తామని అలాగే ఊర్లలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చినచో పోలీసు లకు సమాచారం ఇవ్వాలని,బాల్య వివాహలను అరికట లని బాల్యవివాహాన్ని సమ ర్థించారాదు అని సూచించా రు. అనంతరం సర్పంచ్‌లకు సర్టిఫికెట్ లు అందజేసి నారు. ఈ సమావేశంలో డి .పి.ఓ.సుధాకర్రెడ్డి, సర్పంచ్‌లు, సి.ఐ.ఎస్.ఐ.లు ఎంపీడీ వో శ్రీధర్ రమేష్ ,సుదర్శన్, ఎంపిఓ ధన్వాడ వెంకటేశ్వర్ రెడ్డి ,ఏపీవోమొగులప్ప ,ఎంపీవో పావని ఉదయ్ ప్రసన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఒక వరం

- అంబత్రాయ స్వామి ఆదిపరాశ్రీ బస్సు కేటాయింపు ఆదర్శం
- బిజ్వార్ జెడ్పీ పాఠశాలలో ఉచిత పాఠశాల బస్సును ప్రారంభించిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాల విద్యార్థు లు పాఠశాలకు సురక్షితంగా సకాలంలో చేరుకునే రవాణా సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత పాఠ శాల బస్సు ఒక వరం అని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. నారాయణ పేట జిల్లా ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన అంబా త్రయ క్షేత్రం వ్యవస్థాపకులు శ్రీ శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ రూ.40 లక్షల వ్యయం గల పాఠశాల బస్సును ఉచితంగా అందజేశారు. శనివారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదిత్య పరాశ్రీ స్వామీజీతో కలిసి ఉచిత పాఠశాల బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూదూర ప్రాంత గ్రామాల నుంచి పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. ఈ సేవను బిజ్వార్‌కు చెందిన శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ దాతృత్వంతో ఏర్పాటు చేశారని, ఆయన ఏర్పాటు చేసిన ఈ రవాణా సౌకర్యం ద్వారా మండలంలోని కొత్తపల్లి, పాతపల్లి, మొగ్దుంపూర్ గ్రామాలకు చెందిన మొత్తం 63 మంది విద్యార్థులు ప్రత్యక్ష లబ్ధి పొందనున్నట్లు ఆమె తెలిపారు. ఈ బస్సు సేవ వల్ల విద్యార్థులు సురక్షితంగా, సమయానికి పాఠశాలకు చేరుకొని నిరంతర విద్యా భ్యాసం కొనసాగించేందుకు అవకాశం ఉందని చెప్పారు. గ్రామీణ వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు విద్య అందు బాటులో ఉండేందుకు రవాణా సౌకర్యం కీలకమని తెలిపారు. శ్రీ శ్రీఆదిత్య పరాశ్రీ స్వామీజీ మాట్లాడుతూ తాను చిన్న ప్పుడు ఇదే పాఠశాలలో చదువుకున్నానని తెలిపారు. ఆ పాఠశాల పట్ల ఉన్న కృతజ్ఞతాభావంతోనే ఈ రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేశానన్నారు. కార్యక్రమంలో తన చిన్ననాటి ఉపాధ్యాయు రాలు సంజన ని దర్శించగానే స్వామీజీ భావోద్వేగానికి లోనయ్యారు. గురువుల పట్ల తనకు ఉన్న గౌరవాన్ని వ్యక్తం చేస్తూ, జీవితంలో ఎదుగుదలకు గురువుల మార్గదర్శక త్వమే అసలు పునాది అని పేర్కొన్నారు. తనకు పాఠశాలలో రెండుసార్లు 50, 50 రూపాయల పరీక్ష ఫీజు చెల్లిం చిన హిందీ టీచర్ సంజనకు తాను 100 రూపాయలు బాకీ ఉన్నానని, వాళ్ళ ఇంటికి వెళ్ళి 100 రూపాయలు ఇస్తా నని నవ్వుతూ చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ అధికారి గోవింద రాజులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిన జిల్లాల పరంగా రాష్ట్రంలో మన జిల్లా రెండవ జిల్లాగా నిలవడం గర్వకారణమని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదం డ్రులు గ్రామ ప్రజలు ఈ సేవ ను అభినందిస్తూ, ఇది విద్యార్థుల ప్రయాణ కష్టాలను తగ్గించి పాఠశాల హాజరును మెరుగుపరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మేఘా గాంధీ, తహాసిల్దార్ చింత రవి, ఎంపీడీవో కిషోర్ కుమార్, బిజ్వర్ గ్రామ సర్పంచ్ అంజయ్య, కొత్తపల్లి సర్పంచ్ నర్సిములు, పాత పల్లి సర్పంచ్ తెరప్ప, మొగ్దుం పూర్ సర్పంచ్ తిరుమలేష్, పాఠశాల హెచ్‌ఎం కిషోర్ కుమార్, విద్యాశాఖ అధికారు లు రాజేంద్ర కుమార్, విద్యా సాగర్, నాగార్జున రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహ, నాయకులు శేర్ కృష్ణ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమి టీ చైర్మన్ పద్మమ్మ, గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రణాళిక బద్ధంగా పరీక్షలు కొనసాగించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** జిల్లాలో జరిగే పదవ తరగతి పరీక్షలు పకడ్బందీ ప్రణాళికతో నిర్వహించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించే చీఫ్ సూపరిడెంట్, డిపార్మెంటల్ అధికారులకు శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్టోరేజ్ పాయింట్ నుండి పరీక్ష కేంద్రానికి ప్రశ్న పత్రాలు తీసుకుపోయే సమయంలో జాగ్రత్తలు వహించి పరీక్ష కేంద్రానికి చేరవేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ సమయంలో ప్రతి విద్యార్థిని తనిఖీ నిర్వహించిన అనంతరం పరీక్ష కేంద్రంలోనికి పంపించాలని తెలిపారు. ప్రతి పరీక్ష పరీక్షకు సమయం ఎక్కువగా ఉన్నందున మరుసటి రోజు వచ్చే పరీక్షకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సంసిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, పరీక్షల విభాగం అధికారి కరుణాకర్, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి, మండల విద్యాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ భీమ్ భరత్‌ను అభినందించిన తెలంగాణ గవర్నర్



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** 26 జనవరి 2026న 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీ ఎర్రకోట దగ్గర నిర్వహించే పరేడ్ పాల్గొన్న నాగర్ కర్నూల్ జిల్లా, బిజినపల్లి మండలం, పాలెం గ్రామానికి చెందిన అడ్వకేట్ బోనాసి రామ్ చందర్ తనయుడు ఆర్వీఎమ్ మెడికల్ కాలేజీ (ములుగు) లో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి డాక్టర్ భీమ్ భరత్ ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ అభినందించారు. తెలంగాణ రాష్ట్రం నుండి పరేడ్ కు ఎంపికైన ఏకైక విద్యార్థి భీమ్ భరత్ కు గవర్నర్ ద్వారా సన్మానం చేయడం పట్ల కుటుంబ సభ్యులు మరియు పాలెం గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కలకొండ రవీందర్ రెడ్డి



**కోహెడ, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** విద్యార్థులందరూ ఇష్టంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీ కలకొండ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కోహెడ వార్షికోత్సవం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే వార్షిక పరీక్షల్లో మీరంతా ఇష్టంగా చదివి మంచి ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని, అలాగే తల్లిదండ్రులు మీపై పెట్టుకున్నా ఆశలు నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బందెల సుజాత – కిషన్ హాజరై మాట్లాడుతూ ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమైనదని,మీ లక్ష్యాలు సాధించడం ఈ దశ నుండే ప్రారంభించాలని, ముఖ్యంగా బాలికలు అన్ని రంగాలలో రాణించాలని, రాబోయే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. కళాశాలలో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కోతి యాదగిరి, అధ్యాపకులు రాజమౌళి, రాజేశ్వర్ రెడ్డి, వెంకటరెడ్డి,నీరజ, రజిత, నరేష్,సీతారామయ్య, శ్రీనివాస్,సుజాత విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా నుండి నాలుగు ప్రాజెక్టులు ఎంపిక

- అభినందించిన జిల్లా కలెక్టర్

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** జనవరి 7 నుండి 9 వరకు మూడు రోజులపాటు కామారెడ్డి విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా విద్యార్థులు ప్రతిభను చాటారు. సీనియర్ విభాగంలో పాల్గొన్న నాలుగు ప్రాజెక్టులను జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు రాష్ట్రం నుండి జాతీయస్థాయికి 21 ప్రాజెక్టులు ఎంపిక చేయగా అత్యధికంగా మెదక్ జిల్లా నుండి నాలుగు ప్రాజెక్టులు ఎంపిక, ఎంపికైన విద్యార్థులను గైడ్ టీచర్ లను కలెక్టర్ రాహుల్ రాజ్ మరియు అదనపు కలెక్టర్ నగేష్ అభినందించారు.

**ఎంపికైన ప్రాజెక్టుల వివరాలు**



బి.మహతి గీతా హైస్కూల్ తూప్రాన్ వ్యర్థాల నిర్వహణ మరియు ప్లాస్టిక్ లకు ప్రత్యామ్నయం అనే అంశం, అక్షయ్ సిద్ధార్థ రూరల్ హై స్కూల్ మాచవరం ఎమర్జింగ్ టెక్నాలజీ అనే అంశం, గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చికోడ్ లింగాయపల్లి నీటి సంరక్షణ మరియు నిర్వహణ అంశం, సరస్వతీ కాన్వెంట్ హై స్కూల్ మెదక్ వినోద భరిత గణితం జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులు ఇదే స్ఫూర్తి తో జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. వీరితో పాటు సౌత్ ఇండియా సైన్స్ ఎగ్జిబిషన్ లో టీచర్ విభాగంలో ప్రథమ స్థానం పొందిన జడ్పీ హైస్కూల్ కొడుపాక ఉపాధ్యాయుడు వెంకట రమణ ను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఎస్ఓ నవీన్ మరియు గైడ్ టీచర్ లు పాల్గొన్నారు.

# సర్పంచులు పారదర్శక పాలన అందించాలి

- ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి
- సర్పంచుల 5 రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి , ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్పంచులు గ్రామాలలో పారదర్శక పాలన అందించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... శిక్షణలో పొందిన అవగాహనను గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శక పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అన్ని వర్గాల సమన్వయంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి స్పందించాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీలను ఆదర్శవంతమైన స్థానిక సంస్థలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మరియు ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి జానకి రెడ్డి, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు మరియు ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**తెలకపల్లి, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు సైదులు అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు శనివారం ఎంపీ ఓ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌కు గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు, కార్మికుల పర్మనెంట్, కొత్త పాలకవర్గం ఏర్పడ్డ సర్పంచులు కార్మికుల ఎవరిని తీసివేయకూడదని కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లనున్నట్లు వారు తెలిపారు



ఈ నెల 23న ఉదయం 9 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి అధిక సంఖ్యలో గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొనాలని వారు తెలిపారు. మండల అధ్యక్షులు సైదులుతోపాటు మండల సహాయ కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షులు వీరస్వామి, సహాయ కార్యదర్శి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి ఈ నెల 23న అలంపూర్ ఆలయాలకు వస్తున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అలంపూర్ లోని హెలిపాడ్ నుంచి ఆలయానికి వెళ్లే రహదారిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, తీగలు ఏమైనా ప్రమాదకరంగా ఉంటే వాటిని సరి చేయించాలని సూచించారు. అలంపూర్ పట్టణ ప్రధాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పురపాలక సంఘం అధికారులకు తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం అతిథి మర్యాదలు చేయాలని,ఇతర అవసరమైన ఏర్పాట్లన్నీ సజావుగా పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తును నియమిస్తున్నామన్నారు. పోలీసుల గౌరవ వందనం, తమ శాఖ నుంచి చేయాల్సిన ఇతర అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

- మల్కాపూర్ ఆదర్శ గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్



**తూప్రాన్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు. గతంలో గ్రామస్తుల ఐక్యతతో పారిశుధ్య విభాగంలో గ్రామానికి జాతీయ స్థాయి అవార్డు లభించిందని గుర్తుచేశారు. ఇదే ఐక్యతతో గ్రామాభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, దేశ ప్రధాని దృష్టిలో పడేలా ప్రభుత్వ పథకాలను విజయవంతం చేయడానికి గ్రామస్తులు పంచాయతీ పాలకవర్గానికి సహకరించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఉప సర్పంచ్ స్వామి, పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# క్రీడల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం

- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు.వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 'సి.ఎం. కప్ 2వ ఎడిషన్ రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా' టోర్నమెంట్‌ను శని వారం అట్టహాసంగా ప్రారంభించారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి హాజరయ్యారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి, రాష్ట్ర ,క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. టోర్నమెంట్ ప్రారంభానికి ముందు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులు క్రమశిక్షణతో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్ అందరినీ ఆకట్టుకుంది.ఈ టోర్నమెంట్‌లో హన్మకొండ, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, ఖమ్మం, మంచిర్యాల, ములుగు, మేడ్చల్, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, వరంగల్ మరియు ఆతిథ్య వనపర్తి సహా పలు జిల్లాల జట్లు పాల్గొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 200 మందికి పైగా మహిళా మరియు పురుష క్రీడాకారులు ఈ పోటీల్లో తమ ప్రతిభను చాటుకోనున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీయడమే ఈ సి.ఎం. కప్ క్రీడల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, సెపక్తక్రా రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు.శనివారం వనపర్తి పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీలో భాగంగా 40 ఉచిత త్రిచక్ర స్కూటీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి హాజరై లబ్ధిదారులకు స్కూటీలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి, విద్య, ఉపాధి అవకాశాల



కోసం రవాణా సౌకర్యం చాలా అవసరమని, ఈ త్రిచక్ర స్కూటీలు వారికి రోజువారీ జీవనంలో పెద్ద ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ వాహనాలను జాగ్రత్తగా వినియోగించుకొని స్వావలంబన సాధించాలని సూచించారు. ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలో ముందంజలో ఉందని తెలిపారు. అందులో భాగంగానే ఈరోజు అర్హులైన దివ్యాంగులకు 40 త్రి చక్ర స్కూటీలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ప్రజాప్రతినిధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సిబ్బంది మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కొడవటంచ ఆలయ అభివృద్ధిలో సత్తన్న కృషి మరువలేనిది

- ఆలయ పునః ప్రతిష్టకు 12.15 కోట్లు మంజూరు చేశాం
- మరో 28 కోట్లు మంజూరుకు సహకరిస్తా
- ఆలయ పునః ప్రతిష్టాపనలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్





**రేగొండ,ఫిబ్రవరి 21( జనం సాక్షి):** మంచి చేసే వారికి ఎల్లప్పుడూ భగవంతుని ఆశీస్సులు ఉంటాయ ని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. శనివారం కొడవటంచ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సభాపతి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కృషి మరువలేనిదన్నారు. భక్తుల కొంగుబంగారంగా కొలిచే నరసింహ స్వామి వారు మానసిక రుగ్మతలను ప్రాలధోలే ప్రత్యేక దైవంగా విరాజిల్లుతున్నారని అన్నారు. దేవాలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 12.15 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు స్థానిక శాసనసభ్యులు కోరిన విధంగా అదనపు నిధులు మరో 28 కోట్ల మంజూరుకు సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సంకీర్త్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాలయ చైర్మన్ సంపత్ రావు, ఈఓ మహేష్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే రేవూరికి వినతి పత్రం అందజేసిన రైతు రక్షణ సమితి



**హనుమకొండ ప్రతినిధి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** పరకాల డివిజన్ లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు డిమాండ్ చేశారు. శనివారం రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో హనుమకొండ ఎమ్మెల్యే స్వగృహం నందు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి రైతు రక్షణ సమితి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ పరకాల డివిజన్ పరిధిలోని నడికూడ తదితర మండలాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందన్నారు. హనంకొండ జిల్లాకు కేటాయించిన కృషి విజ్ఞాన కేంద్రాన్ని పరకాల డివిజన్‌లోనే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వినతిపత్రం అందజేతలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# మల్లాపూర్‌లో భూ సర్వే ప్రారంభం



**లక్షణ చందా, ఫిబ్రవరి 21, (జనం సాక్షి) :** మండలంలో భూ సర్వే కార్యక్రమాన్ని మల్లాపూర్ గ్రామంలో ఎమ్మార్వో సరిత ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మ్యాపింగ్ లేని భూముల విషయంలో భూభారతి భూముల రీ సర్వే చేయించడం జరుగుతుందనీ ఇందులో భాగంగా శనివారం రోజున లక్ష్మణ్ చందా మండలంలోని మల్లాపూర్ గ్రామపంచాయతీని ఎంపిక చేసుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శనివారం మల్లాపూర్ గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్చాందా ఆర్ ఐ నరేందర్ రెడ్డి, మండల సర్వేయర్ రమ్య, మల్లాపూర్ గ్రామ జిపిఓ రవి మనోహర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి , గ్రామ సర్పంచ్ ఉడుత స్వప్న , ఉప సర్పంచ్ ముత్యం గ్రామ పెద్దలు రైతులు ప్రజలు పాల్గొన్నారు.

# చెత్తను బల్దియా ట్రాక్టర్‌లకు అందజేయాలి

- వార్త ఆఫీస్ గల్లి, బీట్ బజార్ లో శానిటేషన్ తనిఖీలు చేసిన నగర మేయర్..



**వరంగల్ ఎంజీఎం, ఫిబ్రవరి 21(జనంసాక్షి):** దుకాణదారులు చెత్త ను బల్దియా కు చెందిన చెత్త తరలింపు ట్రాక్టర్ లకు అందజేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. వరంగల్ పరిధి ఎం జీ ఏం సమీపంలో గల వార్త ఆఫీస్ గల్లి, బీట్ బజార్ ప్రాంతాలలో శనివారం మేయర్ క్షేత్రస్థాయిలో డ్రైన్ క్లీనింగ్‌ను పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ స్థానిక వ్యాపారులతో మాట్లాడుతూ దుకాణ దారులు చెత్తను డ్రైన్ లలో వేయకుండా అక్కడకు వచ్చే బల్దియా చెత్త తరలింపు ట్రాక్టర్లకు మాత్రమే అందజేయాలని ఇందుకోసం ప్రతి దుకాణదారుడు ప్రత్యేకంగా చెత్త డబ్బాను ఏర్పాటు చేసుకొని అందులో వేసి తమ వద్దకు వచ్చే ట్రాక్టర్లకు అందజేయాలని యాజమాన్యాలకు అవగాహన కలిగించారు. అనంతరం బీట్ బజార్ ప్రాంతంలో క్షేత్ర స్థాయిలో సందర్శించి ఈ ప్రాంతం లో డ్రైన్ సమీపం లో నీరు నిలిచి ఉండడాన్ని గమనించిన మేయర్ డ్రైన్ ను పరిశీలించి మురికి నీరు నిలిచి ఉండకుండా క్లియర్ చేయాలని, జవాన్ లకు అందజేసిన రిజిస్టర్ లో సూచించిన అంశాల అనుగుణం గా చేపట్టిన చర్యలను నమోదు చేయాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డా.రాజేష్, సానిటరీ సూపర్వైజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిబుల్ ఐటీ విద్యార్థుల కష్టానికి విలువ లేదా?

**బాసర, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా బాసర ట్రిబుల్ ఐటీ విద్యార్థుల కష్టానికి విలువ లేకుండా పోయింది. గ్యాస్ సెన్సెస్ లో 1,90,000 ఫారాలు నమోదు చేసిన విద్యార్థులకు ఇప్పటికీ పారితోషకం లభించలేదనీ విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. 2024 నవంబర్లో నిర్మల్ కలెక్టరేట్ ఆధ్వర్యంలో కులగణన జరిగింది. దీనికి బాసర ట్రిబుల్ ఐటీకి చెందిన 1589 మంది విద్యార్థులు ఆపరేటర్లుగా పనిచేశారు. ఇందులో మొత్తం 1,91387 ఫారాల డేటా నమోదు చేశారు. అయితే ప్రతి ఫారానికి విద్యార్థులకు రూ.30 పారితోషికం ఇవ్వడం జరుగుతుందని, ఇచ్చిన హామీతో వారందరూ పని చేశారు. కానీ ఇప్పటికీ 16 నెలలు అవుతున్నప్పటికీ వారు డబ్బులు మాత్రం విద్యార్థులకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం గురించి జిల్లా యంత్రాంగాన్నీ పలుమార్లు సంప్రదించిన సిపిఓ ఆఫీస్ నుంచి స్పష్టమైన స్పందన రావడం లేదనీ, అర్ధరాత్రి వరకు మేము పనిచేసి ప్రభుత్వానికి సహకరించిన, ఇప్పటికి న్యాయం జరగకపోవడం బాధాకరమైన విషయమని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు చేసిన పనికి పారితోషికంగా ఇవ్వాల్సిన హామీని మర్చిపోయారని అంటున్నారు.

# రెండేళ్ల ప్రగతిపై వాడవాడకు ఎమ్మెల్యే నాయిని

- రెండేళ్లలో చేసిన అభివృద్ధి ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం
- జరగాల్సిన అభివృద్ధి పనులను నేరుగా పరిశీలించనున్నాం
- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం
- డివిజన్ పర్యటనలో ఎమ్మెల్యే నాయిని.. మేయర్ గుండు సుధారాణి



**హనుమకొండ ప్రతినిధి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 26 డివిజన్ లలో డివిజన్ పర్యటన ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే తొలుత 4 వ డివిజన్ లో రెండేళ్ల ప్రగతిపై మన వాడకు మన నాయిని కార్యక్రమం నిర్వహించారు. బల్దియా మేయర్ గుండు సుధారాణి, అన్ని శాఖల అధికారులతో కలిసి నేరుగా 4 వ డివిజన్ పెద్దమ్మగడ్డ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమల వేసి నివాళులు అర్పించారు. అనంతరం దత్తక్షేత్రం ఆలయ అభివృద్ధి నిర్మాణం కోసం రూ 1 కోటితో శంకుస్థాపన చేశారు. అనంతరం పెద్దమ్మగడ్డ ప్రధాన కెనాల్ వెంట ఉన్న రోడ్డు,బొల్లం టవర్స్, అక్షర కాలనీ, యాదవ నగర్ కాలనీలలో పర్యటించారు. అంతర్గత రోడ్లు,స్వచ్ఛత, పరిశుభ్రత, డ్రైనేజీ వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ డివిజన్‌ల వారీగా సమస్యలను పరిష్కరించడానికి ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. గడిచిన రెండేళ్లలో జరిగిన అభివృద్ధికి ప్రజలే సాక్ష్యం. ప్రజలకు అభివృద్ధి పట్ల సానుకూల స్పందన, ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న ఆదరణకు కొందరు నాయకులు ఓర్వలేక పోతున్నారు. గతంలో ఎమ్మెల్యే గా ఉన్న వినయ్ భాస్కర్ ఆనాడు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన గుడిసెలు తొలగించాలని తీర్మానం చేశారు.

**రా .. చౌరస్తాలో కూర్చుందాం..**

అభివృద్ధి చేసేది ఎవరో- అభివృద్ధి నిరోధకులు ఎవరి ప్రజలే చెప్తారు. ఎంతో వెనుకబడిన నియోజవర్గాన్ని అన్నిరంగాల్లో ఎటువంటి కబ్జాలు,అల్లర్లు లేకుండా అభివృద్ధి చేస్తుంటే అభినందించాల్సిన బాధ్యత మరిచిపోయి తమ స్వలాభ రాజకీయాల కోసం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మీరు ఇప్పటికైనా పద్దతి మార్చుకుని సలహాలు సూచనలు ఇవ్వాలని తెలిపారు. రానున్న మూడేళ్ళలో పశ్చిమ నియోజవర్గానికి అభివృద్ధిలో ముందుకు ఉంచకపోతే ఓటు కూడా అడగనని అన్నారు. పర్యటన అనంతరం యాదవనగర్ కమ్యూనిటీ హాల్లో 4 వ డివిజన్ కి సంబంధించిన బూత్ కమిటీ సభ్యులు, ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

# డేంజర్ జోన్ల నివాస గృహాలను సేకరించాలి

- తాడిచెర్ల ఓసీపీ పనులు అడ్డుకున్న భూ నిర్వాసితులు



**మల్హర్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన తాడిచెర్ల లోని ఓసిపి వెదజల్లె దుమ్ము దూలీతో రోగాల బారిన పడుతున్నామని ఓసిపి కి 500 మిటర్ల డేంజర్ జోన్లో ఉన్న నివాస గృహాలను సేకరించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని శనివారం తాడిచెర్ల నిర్వాసితులు ఓసిపి మైన్ ఆవరణలోకి దూసుకెళ్లి పనులు అడ్డుకున్నారు. గత పదేళ్లుగా తమ గృహాలను సేకరిస్తామని మభ్యపెడుతూ ఓసిపి దుమ్ము దూలీలో నెట్టుతూ రోగాల బారిన పడేలా జెన్కో అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లుగా సర్వేలు, నోటిఫికేషన్ల పేరుతో కాలం వెల్లదీస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక తమ ఇళ్ల సేకరణకు కాలయాపన చేస్తే ఊరుకోబోమని చావో రేవో తేల్చుకుంటామని మహిళలు ఓసిపి మైన్ లోకి దూసుకెళ్లారు. సుమారు 5 గంటలకు పైగా ఓసిపి పనులు సాగనివ్వకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కాటారం సిఐ నాగార్జున రావు, కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్,ఎస్ఐ 2రాజన్ కుమార్ లు సంఘటన స్థలానికి చేరుకొని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ బండి స్వామి, ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు గౌడ్ లు నిర్వాసితులకు నచ్చచెప్పి ఈ నెల 23 న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జెన్కో సిఎండి తో సమావేశం ఏర్పాటు చేపించి మనం పడుతున్న ఇబ్బందులు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అందుకు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సైతం సానుకులంగా స్పందించినట్లుగా సర్పంచ్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో డేంజర్ జోన్ నిర్వాసితులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి
- హనుమకొండ కలెక్టరేట్ లో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం..



**హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** బాలల హక్కుల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం రోజున హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ , విద్యా, వైద్యారోగ్య, కార్మిక, పోలీస్ శాఖల అధికారులు, బాలల న్యాయ మండలి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తో నిర్వహించిన సమీక్షా సమావేశాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం కమిషన్ సందర్శనలో అనేక సమస్యలు గుర్తించామని ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని, హనుమకొండ, వరంగల్ డీఈవోలు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో గర్భిణీలు, బాలింతలు, ఇమ్యూనైజేషన్ స్టేటస్ వివరాలను అందించాలని హనుమకొండ డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్యను ఆదేశించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో బాలల కోసం ప్రత్యేకంగా స్టూడెంట్ వెల్నెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీని ద్వారా వారి మానసిక వికాస స్థాయిలను గుర్తించి అవసరమైన వారికి ఆత్మస్థైర్యాన్ని కల్పించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బాలల పరిరక్షణ కమిటీ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ జ్ఞాపికను అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో కమిషన్ సభ్యులు మరిపల్లి చందన, బండి అపర్ణ, కంచర్ల వందన గౌడ్, వచన్ కుమార్, ప్రేమలత అగర్వాల్, డీఆర్వో వైవీ గణేష్, ఆర్జేడీ ఝాన్సీ లక్ష్మీ బాయి , జిల్లా సంక్షేమ అధికారులు విశ్వజ, మల్లీశ్వరి, డిఎంహెచ్వోలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, అడిషనల్ డీసీపీ ఎన్ రవి, భూపాలపల్లి ఆడిషనల్ ఎస్పీ నరేష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ లు అనిల్ చందర్ రావు, వసుధ, బాలల న్యాయ మండలి సభ్యులు డాక్టర్ కే గోపికా రాణి, ఎం సుభాష్, ఇంచార్జి డిసిపివోలు ఎస్ ప్రవీణ్ కుమార్, ఉమ, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, జి తిరుపతి, కార్మిక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు

- ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బి.ఎం వినోద్ కుమార్




**నిర్మల్ రూరల్,ఫిబ్రవరి21(జనం సాక్షి) :** గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు తిసుకుంటున్నట్లు ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బి.ఎం వినోద్ కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ, గల్ఫ్ ఎన్ఆర్ఐ పాలసీ రూపకల్పనకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం నుంచి వివిధ గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికుల సంక్షేమం కొరకు ప్రభుత్వం సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీని రూపొందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే కమిటీ నిర్మల్ జిల్లాలో పర్యటించిందని తెలిపారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులకు ఏ విధమైన పాలసీలు పాలసీలు రూపొందించాలన్న విషయంపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా తెలుసుకునేందుకు గల్ఫ్ వలస కార్మికులు,వారి కుటుంబాలతో వివరాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు అధికంగా ఉన్నాయని, గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికులకు ఆయా దేశాల చట్టాలు,కార్మిక చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. లైసెన్సులు కలిగిన ఏజెన్సీల ద్వారానే కార్మికులు విదేశాలకు వెళ్లేలా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున 'టామ్ కామ్' ద్వారా కార్మికులకు విదేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని, దీనిపై గ్రామీణ స్థాయిలో విస్తృత అవగాహన అవసరమని అభిప్రాయపడ్డారు. గల్ఫ్ దేశాలలో సమస్యల్లో చిక్కుకున్న కార్మికులకు సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. జిల్లాలో వినూత్నంగా గల్ఫ్ కార్మికుల కొరకు ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ సమావేశంలో భాగంగాజిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గల్ఫ్ కార్మికుల సహాయార్థం హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ గల్ఫ్ దేశాలలో చిక్కుకున్న పలువురు కార్మికులను కలెక్టర్ చొరవతో సురక్షితంగా స్వదేశానికి రప్పించగలిగినట్టు వివరించారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు, సంబంధించిన వివిధ శాఖలు సమన్వయంతో పని చేస్తూ కృషి చేస్తున్నాయని తెలిపారు. ఎన్ఆర్ఐ అడ్వైజరి కమిటీ బృందాన్ని,అధికారులని పలువురు శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాసరావు, సింగిరెడ్డి నరేష్ రెడ్డి,స్వదేశ్ పరికిపండ్ల,ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పత్తి కొనుగోలును మార్చి15కు పొడిగించాలి

**కౌటాల ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** పత్తి కొనుగోలు గడువును మార్చి 15 వరకు పొడిగించాలని కౌటాల మండలంలోని బీఆర్ఎస్ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో పత్తి చేనులోనే ఉండిపోయిందని, మరికొన్ని చోట్ల కార్మికుల కొరత వల్ల కోత పనులు నెమ్మదిగా సాగుతున్నాయని అన్నారు. ఇప్పటికే కోత తీసిన పత్తిని నిల్వ ఉంచుకున్న రైతులు మార్కెట్‌కు తరలించేందుకు తగిన సమయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో కొనుగోలు గడువు ముగిస్తే రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు పత్తి విక్రయించే అవకాశం కల్పించాలంటే సిసిఐ అధికారులు తక్షణమే స్పందించి కొనుగోలు గడువును మార్చి 15 వరకు పొడిగించాలని వారు విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం, సంబంధిత అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు అదే వసంత్ రావు డోంగ్రి మధుకర్ సర్పంచ్ లు సంతోష్ , మంగక్క, చందు మాజీ సర్పంచ్ లు అదే శ్రీనివాస్, పెద్దపల్లి హనుమంతు, పున్నయ్య, లంచు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం యధాతథం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23వ తేదీ నుండి జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో యధాతథంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలని, తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు.

# తెలంగాణ గల్ఫ్ ఎన్నారై పాలసీ రూపకల్పన ప్రజాభిప్రాయ సేకరణ

**సారంగాపూర్, ఫిబ్రవరి21 (జనంసాక్షి) :** సారంగాపూర్ మండలం లో ఉన్న గ్రామాలలో విదేశాలలో ఉన్న వాళ్లకు తిరిగి వచ్చిన వారికి వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి రైతు వేదికలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించారు. అభిప్రాయాలను తెలుసుకోవడానికి ప్రత్యేక బృందం వచ్చింది కార్యక్రమంలో గౌరవ చైర్మెన్ శ్రీ బీఎం వినోద్ గ, వైస్ చైర్మన్ శ్రీ మంద భీంరెడ్డి కమిటీ సభ్యులు శ్రీ పరికిపండ్ల స్వదేశీ , ఇతర సభ్యులు శ్రీ నరేష్ రెడ్డి, శ్రీనివాస రావు పాల్గొని బాధితులకు అవగాహన కల్పించారు. మ వారి సాధక బాధకాలు విని ప్రభుత్వంనకు తెలుపుటకు నివేదిక రూపొందించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోనేరు భూమన్న సర్పంచ్, సారంగాపూర్ తహసీల్దార్ సంధ్య రాణి, ఎంపిడిఓ లక్ష్మీ కాంతారావు , మండలాల నుండి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..



## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రూరల్ తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్ ఆక్రమణదారులను హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం రెవెన్యూ సర్వేనంబర్ 101లో గల సీలింగ్ భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు శనివారం సంఘటనా స్థలానికి చేరుకుని, పోలీసుల సహాయంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. కొందరు అక్రమార్కులు మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ ప్రభుత్వ భూమి ఉన్నా వాటిని కబ్జా చేసి పేదలకు అమ్ముతూ వారిని మోసంచేసి అక్రమ వసూళ్లు చేస్తున్నారని తహశీల్దార్ తెలిపారు. విషయం తెలియని నిరుపేదలు ప్రభుత్వ భూములను కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. ఈ సీలింగ్ భూమి విలువ దాదాపు 2 కోట్ల రూపాయలు వరకు ఉంటుందని రెవిన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు ప్రసాద్, క్రాంతి కుమార్, జీపీవో లు పాల్గొన్నారు.

## పరుశురాం పరివార్ హిందూ సంస్థ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక కు చెందిన దేవులపల్లి సాయికిరణ్ శర్మ పరశురాం పరివార్ హిందూ సంస్థ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా పరశురాం పరివార్ హిందూ సంస్థ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షునిగా ఉన్నానని, సంస్థలో మంచి పేరు ప్రఖ్యాతలు వచ్చాయని, సంస్థ తరఫున అనేక కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేసామని, కానీ ఇటీవల కాలంలో కొన్ని వ్యక్తిగత కారణాల వలన పదవికి రాజీనామా చేశానన్నారు. నా రాజీనామా పత్రాన్ని పరుశురాం పరివార్ హిందూ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్ కి అందజేయగా వారు నా రాజీనామా పత్రాన్ని అంగీకరించారని తెలియజేశారు.

## అంజనాపురం పాఠశాలకు రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డు

- జాతీయస్థాయి అవార్డుకు ప్రతిపాదన



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని అంజనాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డుకు ఎంపికకావడంతో విద్యాశాఖ ఏఎంవో నాగరాజు శేఖర్, ఎంఈవో యదుసింహరాజు లు ప్రత్యేకంగా చరవాణిలో హెచ్ఎం కిషన్ ను అభినందించారు. కేంద్రం ప్రారంభించిన స్వచ్ఛ ఎవమ్ హరిత్ విద్యాలయ రేటింగ్ (ఎస్హెచ్వీఆర్)లో భాగంగా పాఠశాలలో పచ్చదనం, పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, శౌచాలయాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ తదితర ఆరు ప్రధాన కొలమానాలపై 60 సూచికల ఆధారంగా రేటింగ్లు కేటాయించగా ఈ ప్రమాణాల్లో జిల్లా నుంచి అంజనాపురం ప్రాథమిక పాఠశాల ఒక్కటే ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డుకు ఎంపికైంది. ఇదిలా ఉండగా రాష్ట్రం మొత్తంలో 2000 పాఠశాలలు ఈ అవార్డుకు పోటీపడగా 20 పాఠశాలల్లో ఈ పాఠశాల కూడా ఎంపికైందని, అంతేకాకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొత్తంలో అంజనాపురం ప్రాథమిక పాఠశాల ఒక్కటే ఎంపిక కావడం పట్ల విద్యాశాఖ పాఠశాల యాజమాన్యాన్ని ఇటీవల పాఠశాల పరిశీలనకు వచ్చిన సమయంలో ప్రత్యేకంగా అభినందించింది. అయితే జాతీయ స్థాయి పురస్కారానికి సైతం ఈ పాఠశాలను ప్రతిపాదించామని త్వరలోనే జాతీయ స్థాయి బృందం పాఠశాల పరిశీలనకు రానున్నట్లు హెచ్ఎం కిషన్ తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా ఈ పాఠశాల ఎంపికైతే జిల్లాకు మరింత గౌరవం దక్కుతుందని, పాఠశాల హెచ్ఎం కిషన్ తో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామస్థుల సమిష్టి కృషే ఇందుకు కారణం కావడం అభినందనీయమన్నారు.

## భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లాలో నిర్మించతలపెట్టిన వివిధ ప్రాజెక్టులకు కావాల్సిన భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లో ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, టీజీ ఐఐసి, రైల్వే శాఖ, పంచాయతీరాజ్ అధికారులతో భూ సేకరణ పనులపై వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇరిగేషన్ ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ ప్రాజెక్టులు, వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ, పెండింగ్ లో ఉన్న భూసేకరణ పనులు త్వరితగతిన నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్, సూపరింటెండెంట్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# విజె సాయి పరిశ్రమ ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలి

- భద్రతా లోపాలే ప్రమాదానికి కారణమని ఆరోపణ
- ప్రమాద వివరాలు బహిర్గతం చేయాలి
- నష్టపరిహారం హామీతో ధర్నా విరమణ
- భవిష్యత్తులో కఠిన భద్రతా చర్యలు తీసుకోవాలి
- సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం



**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** మండలంలోని దోతిగూడెంలో ఉన్న విజె సాయి పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో కార్మికుడు పవన్ మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి పరిశ్రమ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల్లో తగిన భద్రతా చర్యలు లేకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సేఫ్టీ ప్రమాణాలు పాటించకపోవడం, ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణలో విఫలమవడం వల్లే పవన్ ప్రాణాలు కోల్పోయాడని విమర్శించారు. ఇటీవల చౌటుప్పల్లోని బృందావన్ ఫార్మా పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగిన ఘటన మరువకముందే, మరోసారి ఇలాంటి ప్రమాదం జరగడం ఆందోళనకరమని అన్నారు. ప్రమాదంలో ఒక్కరే మృతి చెందారని యాజమాన్యం చెబుతున్నప్పటికీ పూర్తి వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఆ రోజు విధుల్లో ఉన్న వారి వివరాలు, విధులు ముగించుకుని వెళ్లిన వారి వివరాలను మీడియా ద్వారా వెల్లడించాలని కోరారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం అందించాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. అనంతరం యాజమాన్యం పవన్ కుటుంబానికి రూ. 80 లక్షల నష్టపరిహారం, అలాగే ప్రతి నెల రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా అధికారుల ద్వారా క్రమం తప్పని తనిఖీలు నిర్వహించాలని, తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాదం విష్ణు, సిఐటియు మండల కన్వీనర్ మంచాల మధు, పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి, మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అత్యవసర వైద్య సేవలు సమర్థవంతంగా నిర్వహించాలి



**మణుగూరు, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉన్న108 అంబులెన్స్ వాహనాలపై జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సమగ్ర తనిఖీ ఆడిట్ నిర్వహించారు. జిల్లాలో నడుస్తున్న ప్రజలకు అత్యవసర వైద్య సేవలు సమర్థవంతంగా, వేగవంతంగా అందుతున్నాయా అనే దానిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అత్యవసర సేవలను ఉపయోగించుకొనే ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యాలు కలగ కుండా ఉండాలంటే అంబులెన్స్ సమగ్రంగా ఉండాలి. ఈ క్రమంలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సందర్భంగా వాహనాల బయటి లోపలి పరిస్థితి, టైర్లు (స్టెప్నీ సహా), హెడ్లైట్లు, ఇండికేటర్లు, సైరన్ పీఏ సిస్టమ్ పనితీరు, జీపీఎస్ వ్యవస్థ పని స్థితి, ఇంధన స్థాయి, లాగ్బుక్ నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ల చెల్లుబాటు స్థితిని ధృవీకరించారు. వైద్య పరికరాలలో ఆక్సిజన్ సిలిండర్ ప్రెషర్ స్థాయి, బీవీఎం (వయోజనులు పిల్లల కోసం), సక్షన్ యంత్రం, బీపీ యంత్రం, స్టెతస్కోప్, గ్లూకోమీటర్, పల్స్ ఆక్సీమీటర్, స్ట్రెచర్, స్పైన్ బోర్డ్, సర్వైకల్ కాలర్లు, డెలివరీ కిట్ ఇతర అత్యవసర పరికరాలను తనిఖీ చేశారు. అలాగే ఔషధ కిట్లో అడ్రినలిన్, అట్రోపిన్, డెక్స్ట్రోస్, ఐవీ ద్రావణాలు తదితర అత్యవసర మందుల లభ్యత గడువు తేదీలను పరిశీలించారు. అంబులెన్స్ల శుభ్రత, లీనెన్ పరిస్థితి, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ విధానం, పీపీఈ కిట్లు హ్యాండ్ శానిటైజర్ల లభ్యతను కూడా ధృవీకరించారు. ప్రజలకు అత్యవసర సేవలు ఎటువంటి లోపాలు లేకుండా అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు.

## రాష్ట్రస్థాయి చెస్లో ప్రతిభ చూపిన కోదాడ విద్యార్థిని



**కోదాడ, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** కోదాడ తేజ విద్యాలయ లో 7వ తరగతి చదువుతున్న అనంతలక్ష్మి ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్ లో గచ్చిబౌలి క్రీడా మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ చదరంగం పోటీలలో తృతీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా తెలంగాణ చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు కె. యస్. ప్రసాద్ చేతుల మీదుగా 10,000 రూపాయల నగదు బహుమతి , కాంస్య పతకం మరియు ధృవీకరణ పత్రం అందజేశారు.

# సూర్యాపేటకు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

- స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన అధికారులు



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** ఈ నెల 25 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు శనివారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ కు చేరాయి. సూర్యాపేట డిస్టిక్ బల్క్ నుంచి ఇన్చార్జి పెరుమాళ్ళ యాదయ్య ఆధ్వర్యంలో మూడు రూట్ల ద్వారా ప్రశ్నాపత్రాలను తరలించారు. మొదటి రూటులో సూర్యాపేట టౌన్, రెండో రూట్ లో నెమ్మికల్, తుంగతుర్తి, తిరుమలగిరి, మూడో రూట్ కోదాడ, నడిగూడెం, హుజూర్ నగర్, మట్టపల్లి, నేరేడుచర్ల పరీక్ష కేంద్రాలకు సెట్ ఏ ప్రశ్నపత్రాలను పోలీస్ బందోబస్తుతో వాహనాలలో తరలించారు. సూర్యాపేట పట్టణంలోని 12 పరీక్షా కేంద్రాలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను సూర్యాపేట పోలీస్ స్టేషన్ లో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఆయా పరీక్ష కేంద్రాలకు సంబంధించిన చీఫ్ సూరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు తమ ప్రశ్నా పత్రాల బండిల్స్ ను సరి చూసుకొని స్ట్రాంగ్ రూమ్ లో ఉంచారు. సూర్యాపేట పోలీస్ స్టేషన్ లోని స్ట్రాంగ్ రూమును డీఈసీ కన్వీనర్, డిఐఈఓ భాను నాయక్, డిఈసి సభ్యులు రాజమోహన్, దుర్గాప్రసాద్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐఈఓ భాను నాయక్ మాట్లాడుతూ సెట్ బి, సెట్ సీ ప్రశ్నపత్రాలు నేడు తరలిస్తామని చెప్పారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులందరూ అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటిస్తూ ప్రశ్నాపత్రాలు బండిల్స్ ను సరిచూసుకొని పరీక్షా కేంద్రాల వారిగా భద్రపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కస్టోడియన్స్ బాల్తు శ్రీనివాస్, జి. సైదులు, కర్ణాటి శ్రీనివాసులు, డిఐఈఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, ఆయా పరీక్ష కేంద్రాల సిఎస్, డివోలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు పేదలకు వరం



**నూతనకల్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు పేదలకు వరమని ఎంపీడీవో సునీత అన్నారు. శనివారం బక్కహేమ్లతండా ఆవాస ప్రాంతం బోటి కింది తండా గ్రామంలో లబ్ధిదారులు పాతులోత్ మధు మౌనిక ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న నర్సరీ పనులను పరిశీలించడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు కృష్ణా నాయక్, పంచాయతీ కార్యదర్శి గడ్డమీద శ్రీనాథ్, ఉప సర్పంచ్ గూగులోతు సురేందర్ నాయక్, మన్యా నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**చేర్యాల, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడిచేల్మి అయోధ్య అన్నారు. శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు, గ్రామపంచాయతీ పాలకవర్గం ఉపాధ్యాయ బృందం కలిసి వంట గదులు, మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులను మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో త్రాగునీరు, మౌలిక వసతులు సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగడానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, పాఠశాల చైర్మన్ తోట్ల రాజేశ్వరి, ఏఏపీసీ సభ్యులు అందె అశోక్, సూర సంపత్, సూర రాజు, ఉడుత బాలరాజు, అనుముల రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



**అమీన్పూర్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** అమీన్పూర్ లో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యక్తితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. రామచంద్రపురం ఏసిపి శ్రీనివాస్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం రాజస్థాన్ కు చెందిన హేతరామ్ రాజస్థాన్ నుంచి హైదరాబాద్ కు అక్రమంగా ఓపియం డ్రగ్ ను తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు. అందులో భాగంగా అమిన్ పూర్ లో విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో శేర్లింగంపల్లి ఎస్వోటీ పోలీసులు అక్కడికి చేరుకొని డ్రగ్ విక్రయిస్తున్న హేతారాం తో పాటు కొనుగోలు చేసిన వాగ్దారాం, మరో వ్యక్తి సుభాష్ లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 50 వేలు నగదు తో పాటు 2.70 కిలోల ఓపియం డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్ కు తరలించారు. ఈ విలేకరుల సమావేశంలో అమీన్పూర్ ఇన్స్పెక్టర్ నరేష్ ఎస్ఐ ప్రభాకర్ పోలీసులు ఉన్నారు.

# పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్


**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** పదవతరగతి వార్షిక పరీక్షలను సక్రమంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులకు శనివారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమగ్ర అవగాహన ఓరియంటేషన్ సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల భద్రత, రవాణా, సీలింగ్ అన్సీలింగ్ విధానం, పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షణ, ఫ్లయింగ్ స్క్వాడ్ల సమన్వయం వంటి అంశాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలను ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో మొత్తం 12403 మంది విద్యార్థులు, 69 పరీక్షా కేంద్రాలలో పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, ఫస్ట్ ఎయిడ్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించబడుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం స్క్రైబ్ సౌకర్యం, అవసరమైన చోట వీల్చైర్లు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. పరీక్షలను నిబంధనల ప్రకారం, ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్ష విభాగం సీనయ్య, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# పుంజుకున్న సూచీలు

- నిఫ్టీ 25,550 పాయింట్ల ఎగువకు
- బ్యాంకింగ్, లోహ షేర్లలో కొనుగోళ్లు
- ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.934.61 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు.. రూ.2637.15 కోట్లు



గురువారం నాటి భారీ నష్టాల నుంచి స్టాక్ మార్కెట్ పుంజుకుంది. బ్యాంకింగ్, లోహ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు లాభాల్లో ముగిశాయి. ఏఐ సాంకేతికత, సెమీ కండక్టర్లు, కీలక ఖనిజాల సరఫరా విషయంలో సహకారం నిమిత్తం ఏర్పాటు చేసిన పాక్స్ సిలికా కూటమిలో భారత్ చేరనుండటం, భారత్– అమెరికా వాణిజ్య ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి రావొచ్చని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించడంతో మార్కెట్ సెంటిమెంటు బలపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 26 పైసలు తగ్గి 90.94 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.35% తగ్గి 71.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో సింగపూర్, దక్షిణ కొరియా మినహా మిగతా దేశాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు లాభాల్లో ప్రారంభమయ్యాయి. మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.89 లక్షల కోట్లు పెరిగి రూ.467.11 లక్షల కోట్లకు (5.14 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. నష్టాల్లోనే మొదలైనా..: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 82,272.49 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 82,498.14) ప్రారంభమైంది. ఆ తర్వాత కాసేపటికే లాభాల్లోకి వచ్చిన సూచీ ఒకానొక దశలో 83,132.08 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 316.57 పాయింట్ల లాభంతో 82,814.71 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 116.90 పాయింట్ల లాభంతో 25,571.25 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,379.75 వద్ద కనిష్ఠాన్ని, 25,663.55 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 187.95 పాయింట్లు, నిఫ్టీ 100.15 పాయింట్లు చొప్పున పెరిగాయి. ఎనిమిదే డీలా..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 8 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. ఎన్టీపీసీ అత్యధికంగా 2.73 శాతం లాభపడగా.. ఎల్అండ్‌టీ 2.37%, హిందుస్థాన్ యునిలీవర్ 1.56%, బజాజ్ ఫైనాన్స్ 1.47%, పవర్‌గ్రిడ్ 1.44%, టాటా స్టీల్ 1.36%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 1.29% పెరిగాయి. మరోవైపు టెక్ మహీంద్రా 1.61%, ఇన్ఫోసిస్ 1.23%, ఎటెర్నల్ 1.10%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.92%, మహీంద్రా అండ్ మహీంద్రా 0.53% నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో విద్యుత్, పీఎస్‌యూ బ్యాంక్, భారీ యంత్రపరికరాలు, ఇండస్ట్రియల్స్, లోహ రంగాలు రాణించగా.. ఐటీ సూచీ డీలాపడింది.

## ఆంథ్రోపిక్ పోస్ట్.. 10 బిలియన్ డాలర్లు ఆవిరి..!




అమెరికాకు చెందిన ఏఐ స్టార్టప్ ఆంథ్రోపిక్ వరుస సంచలనాలు సృష్టిస్తోంది. కొన్నిగంటల క్రితం ఆ సంస్థ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన పోస్ట్‌తో సైబర్ సెక్యూరిటీ షేర్లు కుప్పకూలాయి. అమెరికా మార్కెట్‌లో ఆయా కంపెనీల స్టాక్స్ భారీగా కుదేలయ్యాయి. ఆంథ్రోపిక్ క్లాడ్.. సైబర్ సెక్యూరిటీ కోసం కొత్త ఫీచర్ 'క్లాడ్ కోడ్ సెక్యూరిటీ'ని ప్రకటించింది. అది సాఫ్ట్‌వేర్ కోడ్‌బేస్‌లను స్కాన్ చేస్తుంది. అందులోని లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు పరిష్కారాలను సిఫార్సు చేస్తుంది. దాంతో కోడింగ్ ప్రాసెస్‌లోనే డెవలపర్లు భద్రతాపరమైన లోపాలను గుర్తించి, పరిష్కరించుకోవడానికి వీలుకలుగుతుంది. సంప్రదాయ పద్ధతుల్లో గుర్తించని లోపాలను కనుగొనేందుకు ఈ టూల్ సహాయపడనుందని కంపెనీ వెల్లడించింది. ఈ ఏఐ ఆధారిత ఫీచర్ ప్రస్తుతం పరిశీలన దశలో ఉంది. ఈ పోస్ట్‌తో సైబర్ సెక్యూరిటీ సంస్థలు క్రౌడ్‌స్ట్రైక్, క్లౌడ్‌ఫ్లేర్, స్కేలార్, సెయిల్‌పాయింట్, ఒక్టా షేర్లు 5 శాతం నుంచి 9 శాతం మేర కుంగాయి సైబర్‌సెక్యూరిటీతో సంబంధం ఉన్న సాఫ్ట్‌వేర్ సంస్థలు గిట్‌ల్యాబ్, జెఫ్రాగ్ షేర్లు పడిపోయాయి. గ్లోబల్ ఎక్స్ సైబర్ సెక్యూరిటీ ఈటీఎఫ్ 5 శాతం పడిపోయింది. మొత్తంగా మదుపర్ల సంపద 10 బిలియన్ డాలర్లమేర ఆవిరయ్యిందని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

## మైక్రోసాఫ్ట్ గేమింగ్ సీఈఓగా ఆశా శర్మ

**న్యూఢిల్లీ:** టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగంలో భారత సంతతి టెకీకి ఉన్నత పదవి లభించింది. కొత్త సీఈవోగా ఆశా శర్మ ను సంస్థ నియమిం చింది. ఇప్పటివరకు ఈ స్థానంలో ఉన్న ఫిల్ స్పెన్సర్ పదవీవిరమణ చేయడంతో.. ఆ స్థానంలో గేమింగ్ డివిజన్‌కు సీఈఓ, వైస్ ప్రెసిడెంట్‌గా ఆశా శర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. మైక్రోసాఫ్ట్ గేమింగ్ ఆదాయ వృద్ధి మందగించడం, గేమింగ్ కంటెంట్ కోసం ప్రపంచ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ వంటి సవాళ్లను ఆమె ఎదుర్కోనున్నారు. మైక్రోసాఫ్ట్‌లో చేరడానికి ముందు ఆశా శర్మ పలు అతిపెద్ద అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీలలో ఉన్నత పదవుల్లో పని చేశారు. గేమింగ్ సీఈఓగా బాధ్యతలు చేపట్టడానికి ముందు మైక్రోసాఫ్ట్‌లోని కృత్రిమ మేధ విభాగంలో సీనియర్ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఆశా శర్మతో పాటు ఇతర సీనియర్ అధికారుల స్థానాల్లోనూ మార్పులు చేసినట్లు టెక్ సంస్థ వెల్లడించింది. గేమ్ స్టూడియోలు, టైటిల్‌లను పర్యవేక్షించే చీఫ్ కంటెంట్ ఆఫీసర్‌గా సీనియర్ అధికారి మాట్ బూటీకి పదోన్నతి కల్పించినట్లు తెలిపింది. ఆశా శర్మ మిన్నెసోటా విశ్వవిద్యాలయంలోని కార్ల్‌సన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి బిజినెస్‌లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ చేశారు. తన కెరీర్ ప్రారంభంలో ఆశా మైక్రోసాఫ్ట్ మార్కెటింగ్‌లో పని చేసి.. 2013లో సంస్థ నుంచి బయటకు వెళ్లారు. అనంతరం వివిధ అంతర్జాతీయ టెక్ కంపెనీలలో ఉన్నత స్థానాల్లో విధులు నిర్వర్తించారు.

## డబ్బులు తిరిగిచ్చేయండి..


### ట్రంప్‌నకు చుక్కలు చూపించిన బొమ్మల కంపెనీ..!

**వాషింగ్టన్:** ప్రపంచ దేశాలపై విధించిన సుంకాల విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అమెరికా సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. సుప్రీం తీర్పు వెనక ఒక బొమ్మల కంపెనీ పోరాటం ఉంది. సుంకాల పిడుగుతో మనుగడే కోల్పోయే దశ నుంచి.. అది మళ్లీ ఊపిరి పోసుకుంది. లెర్నింగ్ రిసోర్సెస్ లిమిటెడ్.. అమెరికాలో ఇల్లినోయీ కేంద్రంగా వ్యాపారం చేస్తోన్న ఒక బొమ్మల కంపెనీ. తన దిగుమతుల్లో మెజార్టీ వాటా చైనాదే. అక్కడి నుంచి ఎడ్యుకేషన్ టాయ్స్‌ను కొనుగోలు చేస్తోంది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి మిత్ర దేశం, శత్రు దేశం అనే తేడా లేకుండా భారీస్థాయిలో సుంకాలు విధించారు. దాంతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటున్న కంపెనీలకు ఆ విధానాలు శరాఘాతమయ్యాయి. అలాంటి అయోమయ పరిస్థితు ల్లో అధ్యక్షుడి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. లెర్నింగ్ రిసోర్సె స్ యజమాని రిక్ వోల్డెన్‌బర్గ్ గత ఏప్రిల్‌లో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. మరికొందరు పిటిషనర్లతో కలిసి.. ఈ చిన్న సంస్థ విజయం సాధించేవరకు ఏమా త్రం వెనక్కితగ్గకుండా తన న్యాయపోరాటం కొనసాగించింది. ఇప్పుడు ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం చూపే కీలక తీర్పులో భాగమైంది. "ఇన్ని రోజుల ఉత్కంఠకు, ఇబ్బందికి ఈ తీర్పు ఊపిరినిచ్చింది. ఇక, ఈ ప్రభుత్వం నా దగ్గరి నుంచి తీసుకున్న దానికి రికార్డు ఉంది. నా డబ్బులు నాకు తిరిగిఇచ్చేయండి. నేను చేసింది రాజకీయపరమైన పోరాటం కాదు. ఇది పన్నుల గురించి చేసింది. పన్నుల రూపంలో చెల్లించాల్సిన దానికంటే అమెరికన్లు అదనంగా కట్టారు. ఒక దేశం తన ఆదాయాన్ని పెంచుకోవాలంటే.. దానిపై చట్టసభ సభ్యులు చర్చించుకోవాలి" అని తొలి పిటిషన్‌దారుల్లో ఒకరైన వోల్డెన్‌బర్గ్ వెల్లడించారు. యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ 2025 నివేదిక ప్రకారం.. యూఎస్ దిగుమతిదారుల్లో 97 శాతం మంది చిన్న వ్యాపారులే. వారు ఏటా సుమారు 868 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను అమెరికాకు తీసుకువస్తున్నారు. సుంకాలు వాటి మనుగడకు ముప్పు అని ఆ నివేదిక అప్పట్లో ఆందోళన వ్యక్తం చేసింది. కంపెనీలు తమ తయారీ కేంద్రాలను అమెరికాకు మార్చేందుకు ఈ టారిఫ్‌లు దోహదం చేస్తాయని ట్రంప్ ప్రభుత్వం వాదించింది. దీనిపై వోల్డెన్‌బర్గ్ స్పందిస్తూ.. వాస్తవాలను విస్మరించారని వ్యాఖ్యానించారు. "చైనాలో బొమ్మల తయారీ కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నిపుణులైన కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాంటి వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేయడానికి ఏళ్లు పట్టొచ్చు" అని వ్యాఖ్యానించారు

## సరికొత్త టాటా పంచ్ ఈవీ ప్రారంభ ధర రూ.9.69 లక్షలు


ముంబయి: టాటా మోటార్స్ తన పంచ్.ఈవీలో సరికొత్త వెర్షన్‌ను శుక్రవారం ఆవిష్కరించింది. దీని ధర రూ.9.69 లక్షల నుంచి (ఎక్స్‌షోరూం, ముంబయి) ప్రారంభం అవుతుంది. బీఏఏఎస్ (బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్) కింద ప్రారంభ ధర రూ.6.49 లక్షలు కాగా.. బ్యాటరీకి ఈఎంఐ కిలోమీటరుకు రూ.2.60. ఈ కొత్త వెర్షన్ 40 కిలోవాట్ అవర్ బ్యాటరీతో లభ్యమవుతుంది. ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉండటంతో కేవలం 26 నిమిషాల్లోనే 20% నుంచి 80 శాతానికి ఛార్జ్ చేయొచ్చు. ఈ కారు రియల్ వరల్డ్ సీ75 రేంజ్ 355 కి.మీ. కాగా.. ఏఆర్ఏఐ సర్టిఫైడ్ రేంజ్ 468 కి.మీ.గా ఉంది.




# భారతీయులకు రీఫండ్ వస్తుందా?

### ట్రంప్ టారిఫ్‌లు రద్దుతో ఊరట



**వాషింగ్టన్:** భారత్ సహా ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన టారి ఫ్‌లు చెల్లవని అమెరికా సుప్రీంకోర్టు తేల్చేసింది. మరి ఇప్పటివరకు చెల్లించిన సుంకాల మాటేంటీ? ఇప్పుడు అందరిలో మెదిలే ప్రశ్న ఇదే..! ఈ విషయాన్ని కోర్టు కూడా తన తీర్పులో స్పష్టం చేయకపోయేసరికి దీనిపై గందరగోళం నెలకొంది. మరి టారిఫ్‌ల పేరుతో గతేడా ది నుంచి అగ్రరాజ్యం వసూలుచేసిన సొమ్మును తిరిగిచ్చే స్తారా? ఒకవేళ అలా చేస్తే భారత ఎగుమతిదారులకు రీఫండ్ ఏమైనా వస్తుందా? ఈ తీర్పుతో భారతీయ కంపెనీలకు ఊరట లభించనుందా?

ఖజానాకు రూ.12లక్షల కోట్లు

గతేడాది ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ 2న ప్రపంచదేశాలపై ఈ ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. నాటినుంచి డిసెంబరు మధ్య వరకు దిగుమతిదారుల నుంచి అదనపు సుంకాలు వసూలుచేయడం ద్వారా అమెరికా (జూం) ఖజానాకు 13,300 కోట్ల డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.12 లక్షల కోట్లు) చేరాయని అంచనా. ఈ మొత్తాన్ని ఆయా కంపెనీలకు తిరిగి చెల్లించాలా, వద్దా అనే విషయాన్ని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేయలేదు. అయితే, ఇప్పటికే చాలా కంపెనీలు దీనిపై దిగువ కోర్టులను ఆశ్రయించాయి. కాస్ట్‌కో, రెవ్లాన్, బంబుల్ బీ ఫుడ్స్ వంటి కంపెనీలు రీఫండ్‌ల కోసం పిటిషన్లు దాఖలు చేశాయి.

చెల్లింపులు కంపెనీలకే..!

ట్రంప్ భారీ సుంకాలతో భారత ఎగుమతిదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా కొన్ని పరిశ్రమలకు అగ్రరాజ్యం నుంచి వచ్చే మార్కెట్ వాటా తగ్గింది. అయితే, తాజా తీర్పుతో భారత ఎగుమతిదారులకు ఎలాంటి రీఫండ్ దక్కే అవకాశాలు లేవు. ఎందుకంటే ఈ టారిఫ్‌లను చెల్లించింది అమెరికాలోని దిగుమతిదారులే. ఒకవేళ సొమ్ము వెనక్కిచ్చేస్తే అది ఆయా కంపెనీలకే వెళ్తుంది. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా భారత ఎగుమతిదారులకు జరిగిన నష్టానికి అమెరికా ఎలాంటి పరిహారం చెల్లించబోదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ తీర్పుతో అగ్రరాజ్య మార్కెట్‌లో మన ఉత్పత్తులకు మళ్లీ గిరాకీ పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ అమెరికాలో భారత కంపెనీలు ఏమైనా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంటే.. వారికి కొంతమేర లబ్ధి చేకూరనుంది. ఇక, అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని భారత్ పునఃసమీక్షించుకునేందుకు ఈ తీర్పు దోహదపడనుంది.

రీఫండ్లకు 12-18 నెలల పైనే..

అయితే, టారిఫ్‌ల సొమ్ము తిరిగి దిగుమతిదారులకు చెల్లించడం అనేది సులువైన ప్రక్రియ కాదు. దీనివల్ల గందరగోళ పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. రీఫండ్‌ల కోసం అమెరికా వద్ద ప్రత్యేక ఆటోమేటిక్ వ్యవస్థ అంటూ ఏదీ లేదు. కంపెనీలే చట్టబద్ధంగా దీనిపై దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని అగ్రరాజ్య మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ఒకవేళ అందుకు కోర్టులు అనుమతినిస్తే.. యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఏజెన్సీ వాటిని సమీక్షించి చెల్లింపులు చేపట్టే అవకాశం ఉంది. అయితే, అది చాలా సుదీర్ఘ ప్రక్రియ. దాదాపు 12-18 నెలలు పట్టొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 'రీఫండ్ వ్యాజ్యాలన్నీ పూర్తయ్యేసరికి రెండేళ్లు పట్టొచ్చు' అని ట్రంప్ కూడా విలేకరులతో అన్నారు. గతంలోనూ ట్రేడ్‌కు సంబంధించిన కేసుల్లో కంపెనీలకు అమెరికా సొమ్ము తిరిగి చెల్లించిన సందర్భాలు ఉన్నాయి. ఎగుమతులపై హార్బర్ మెయింటినెన్స్ ఫీజు రాజ్యాంగవిరుద్ధమని 1990ల్లో పలు కోర్టులు తీర్పునిచ్చాయి. ఆయా ఎగుమతిదారులు చెల్లించిన ఫీజులను రీఫండ్ చేసేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటుచేయాలని న్యాయస్థానాలను ఆదేశించాయి. దానికి అనుగుణంగా యూఎస్ కస్టమ్స్ అధికారులు రీఫండ్ ప్రక్రియ చేపట్టారు. అయితే, ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి ఎన్నడూ రిఫండ్ చేయలేదు. మరి ప్రస్తుత పరిస్థితుల్లో ఈ చెల్లింపులపై అమెరికా ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే..!

## ఎగుమతులకు ఊతమిచ్చేందుకు మరిన్ని చర్యలు

### ప్రకటించిన ప్రభుత్వం

దిల్లీ: దేశీయ ఎగుమతులకు ఊతమిచ్చేందుకు ఇ-కామర్స్ ఎగుమతిదార్లకు రుణ సహకారం సహా ఏడు చర్యలను ప్రకటించింది. రూ.25,060 కోట్ల ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌లో భాగంగానే ఈ చర్యలు ఉండనున్నాయి. కాగా... ఎగుమతి ప్రోత్సాహక మిషన్ కింద 10 అంశాలు ఉండగా, ఇప్పటికే మూడింటిని జనవరిలోనే ప్రభుత్వం అమలు చేసింది. డిజిటల్ మార్గాలను ఉపయోగించిన ఎగుమతిదార్లకు సహకారం అందించేందుకు.. వడ్డీ రాయితీలతో రుణ సదుపాయం, పాక్షిక రుణ గ్యారెంటీలను వాణిజ్య శాఖ ప్రకటించింది. డైరెక్ట్ ఇ-కామర్స్ క్రెడిట్ సదుపాయంలో 90 శాతం గ్యారెంటీతో రూ.50 లక్షల వరకు రుణ సహకారం అందివ్వనుంది. ఓవర్‌సీస్ ఇన్వెంటరీ క్రెడిట్ ఫెసిలిటీలో 75 శాతం గ్యారెంటీ కవరేజీతో రూ.5 కోట్ల వరకు రుణ సహకారం లభించనుంది. 2.75 శాతం వడ్డీ రాయితీ కూడా పొందొచ్చు. అయితే ఇందుకు ఒక్కో దరఖాస్తుదారుకు రూ.15 లక్షల వరకు వార్షిక పరిమితిని నిర్దేశించినట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎంఎస్ఎమ్ఈలకు కూడా 2.75 శాతం వడ్డీ రాయితీని అందివ్వనుంది. ఆర్బీఐ/ ఐఎఫ్ఎస్సీఏ గుర్తింపు సంస్థల ద్వారా జరిపిన లావాదేవీల వ్యయాలపై ఈ సౌలభ్యం ఉంటుంది. ఒక్కో ఎమ్ఎస్ఎమ్ఈకి రుణ సహకార పరిమితి రూ.50 లక్షలుగా ఉండనుంది. పారదర్శకత, సకాలంలో పంపిణీ నిమిత్తం పూర్తిగా డిజిటల్ రూపేణా ఈ రుణాన్ని మంజూరు చేస్తారు. అంతర్జాతీయంగా టెస్టింగ్, పరిశీలన, సర్టిఫికేషన్ సహా ఇతర వాణిజ్య నిబంధనలను పాటించే విషయంలో అక్రిడేషన్ అండ్ కాంప్లియెన్స్ ఎనేబుల్‌మెంట్ ద్వారా ఎగుమతిదార్లకు సహకారం అందివ్వనుంది. అలాగే ఫెసిలిటేటింగ్ లాజిస్టిక్స్, ఓవర్‌సీస్ వేర్‌హౌసింగ్ అండ్ ఫుల్‌ఫిల్‌మెంట్ ద్వారా శిఅంతర్జాతీయంగా గిడ్డంగులు, ఇ-కామర్స్ ఎక్స్‌పోర్ట్ హబ్స్‌కు అనుసంధానం లాంటి మౌలిక వసతుల సదుపాయాన్ని పొందే వీలు కల్పించనుంది.

## ఇంకో ఐదేళ్లు అవకాశం ఇవ్వండి

పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు' అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు. రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

## వికసిత భారతానికి.. 'మేడిన్ ఇండియా చిప్' ఎంతో ముఖ్యం

3,500 ఉద్యోగాలు సృష్టిస్తుందని అంచనా. ఈ ప్లాంట్ నెలకు 3.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

## అంతర్జాతీయ వృద్ధికి ఏఐ అండ

- వికసిత్ భారత్ లక్ష్యానికీ తోడ్పాటు
- ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉంది
- ఐఎంఎఫ్ ఎండీ క్రిస్టలీనా జార్జివా



దిల్లీ: అంతర్జాతీయ వృద్ధిని కృత్రిమ మేధ 0.8 శాతం మేర పెంచుతుందని, 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించడంలో భారత్‌కు సాయపడుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఎండీ క్రిస్టలీనా జార్జివా పేర్కొన్నారు. అయితే ఉద్యోగాలు, ఆర్థిక స్థిరత్వానికి ఏఐ నుంచి గణనీయమైన ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సాంకేతికతపై ఆశాభావం వ్యక్తం చేస్తూనే, ఏఐ ప్రభావాన్ని 'అతిగా ఊహించి చెప్పవద్దని' జార్జివా హెచ్చరించారు. ఏఐని ఒక 'మంచి లేదా చెడు శక్తి'గా మార్చకుండా, దాన్ని అభివృద్ధి చేయడం, నిర్వహించడం మధ్య సమతుల్యత పాటించాలని ఆమె సూచించారు. 'ప్రపంచ వృద్ధిని ఏఐ దాదాపు ఒక శాతం వరకు పెంచొచ్చు. మేము దాన్ని 0.8 శాతంగా అంచనా వేస్తున్నాం. మరిన్ని అవకాశాలు, ఉద్యోగాల సృష్టికి ఇది ఒక అద్భుతమైన అవకాశం. భారత్‌కు కూడా ఇదే స్థాయిలో అవకాశాలను అందిస్తుందని భావిస్తున్నామ'ని ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026లో వెల్లడించారు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు, ఏఐ వినియోగంలో వేగంగా ముందుకు వెళ్లే దేశాలకు ఏఐ గొప్ప అవకాశాలను కల్పిస్తుందని, వీటిని దేశాలు అందిపుచ్చుకోవాలని, అదే సమయంలో ముప్పులను దృష్టి ఉంచుకోవాలన్నారు.

అమెరికా– భారత్ భాగస్వామ్యం కీలకం: పిచాయ్

ప్రతి ఒక్కరికీ, ప్రతి చోటా ఏఐ ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకురావడంలో అమెరికా– భారత్ భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని, గూగుల్, మాతృసంస్థ ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ఆయన మాట్లాడుతూ, అమెరికా-భారత్ మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో రాబోయే సంవత్సరాల్లో ఇరుదేశాల మధ్య బలమైన టెక్ భాగస్వామ్యానికి గట్టి పునాది పడుతుందని వెల్లడించారు. ఇరు దేశాల మధ్య అనుసంధానంగా సేవలు అందిస్తున్నందుకు గూగుల్ గర్విస్తోందని పిచాయ్ పేర్కొన్నారు. 'సరఫరా వ్యవస్థలు సురక్షితంగా ఉన్నాయని నిర్ధారించుకోవడంపై పాక్స్ సిలికా దృష్టి పెడుతుంది. కీలక టెక్నాలజీల్లో వాణిజ్య భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తుంది. ఇరు దేశాల కార్యక్రమాలు, ఆవిష్కరణల కోసం మా బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి' అని పిచాయ్ వివరించారు.

ఆరోగ్య రంగంలో భారీ మార్పులు కిరణ్ మజుందార్ షా

బయోలాజికల్ ఇంటెలిజెన్స్, కృత్రిమ మేధలను కలిపితే వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా పేర్కొన్నారు. ముందస్తు ఆరోగ్య అంచనా, రీజెనరేటివ్ సైన్స్, లైఫ్‌స్పాన్ మేనేజ్‌మెంట్‌లో అద్భుతమైన ఆవిష్కరణలకు దారితీయొచ్చని అంచనా వేశారు. గిగావాట్ శక్తితో పనిచేసే ఏఐ వ్యవస్థలతో పోలిస్తే, డేటా కేంద్రాలు మాదిరిగా బయోలాజికల్ వ్యవస్థలు పనిచేస్తాయని, తక్కువ శక్తితో సమాచారాన్ని ప్రాసెస్ చేస్తాయని అన్నారు.

భారత్‌కు అద్భుతమైన అవకాశం

కృత్రిమ మేధ ఒక ప్రాథమికమైన మార్పును తీసుకొస్తుందని, కొత్త పరికరాలు, అనుభూతులు, సేవలను సృష్టిస్తూ.. భారీ అవకాశాలను అందిస్తుందని క్వాల్‌కామ్ అధ్యక్షుడు, సీఈఓ క్రిస్టియానో అమోన్ తెలిపారు. ఈ మార్పుల నుంచి ప్రయోజనం పొందడానికి భారత్‌కు ఇది ఒక 'అద్భుతమైన' అవకాశమని పేర్కొన్నారు. ఇంటర్నెట్ దశను దాటి నేరుగా మొబైల్ ఇంటర్నెట్ వైపు భారత్ దూసుకెళ్లిందని, ఏఐ విషయంలో ఇది మళ్లీ జరగొచ్చని అన్నారు. స్మార్ట్ సిటీల మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల విస్తృతి పెంచడం, విద్యా రంగంలో లెర్నింగ్ టూల్స్‌ను అందించడం, వ్యవసాయ రంగంలో మార్పులను ఏఐ తీసుకొస్తుందన్నారు.

డిజిటల్ కాలనీ ప్రమాదాన్ని నివారించాలి

విదేశీ వ్యవస్థలపై ఆధారపడే 'డిజిటల్ కాలనీ'గా మారకుండా ఉండాలంటే, భారత్ సొంతంగా ఫౌండేషనల్ ఏఐ టెక్నాలజీను నిర్మించుకోవాలని సర్వమ్ ఏఐ సహవ్యవస్థాపకుడు వివేక్ రాఘవన్ అన్నారు. 'జీవితంలో ప్రతి అంశాన్ని ప్రభావితం చేసే ప్రధాన సాంకేతిక ఏఐ. దీంతో మన దేశం తప్పనిసరిగా ఏఐని అభివృద్ధి చేయాలి' అని పేర్కొన్నారు.

మీడియా రంగంలో భారత్ వాటా రెట్టింపు

కృత్రిమ మేధను అందిపుచ్చుకోవడం ద్వారా అంతర్జాతీయ మీడియా మార్కెట్‌లో భారత్ తన వాటాను రెట్టింపు చేసుకునే అవకాశం ఉందని జియోస్టార్ వైస్ ఛైర్మన్ ఉదయ్ శంకర్ పేర్కొన్నారు. సాంకేతిక మార్పులను అడ్డుకోవడానికి ప్రయత్నించకుండా, వాటిని అందిపుచ్చుకోవాలని ఆయన పరిశ్రమ వర్గాలను కోరారు. ప్రపంచ మీడియా మార్కెట్ విలువ దాదాపు 3 లక్షల కోట్ల డాలర్లుగా ఉందని, 2029 నాటికి 3.5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేశారు.

# కదం తొక్కుతున్న హైడ్రా...

# కుప్పకూలుతున్న అక్రమాలు

- నిన్న 2 వేల కోట్లు.. నేడు 14 వందల కోట్ల కబ్జాభూమికి విముక్తి
- శేరిలింగంపల్లిలో సంచలనాలకు కేరాఫ్ గా నిలుస్తున్న వైనం
- ఆసేతు జననీరాజనం.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కృతజ్ఞత కృతజ్ఞతల వెల్లువ




**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** 'గతంలో' బిజినెస్ మాన్' అనే తెలుగు సినిమా డైలాగులపరంగా ఎంత సంచలనంగా మారిందో ప్రస్తుతం శేరిలింగంపల్లి ప్రాంతంలో స్వయం ప్రతిపత్తి కలిగిన హైడ్రా సంస్థకూడా అంతే స్థాయిలో ప్రాచుర్యం పొందుతోంది. ఆ సినిమా రీల్ లైఫ్ అయితే... హైడ్రా సంస్థది మాత్రం రియల్ లైఫ్ లో కబ్జాదారుల తో ఆడుతున్న 'చెడుగుడు' ఆటకు నిదర్శనం!

**టచ్ చేస్తే.. వందల కోట్లే.. నిన్న 2 వేలు.. నేడు 14 వందల కోట్లు**

శేరిలింగంపల్లి ప్రాంతంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా హైడ్రా పేరు మారుమ్రోగిపోతుంది. ఏ సంఘటన చూసినా... ఏ సందర్భం చూసినా... టచ్ చేస్తే చాలు అక్రమార్కుల గుండెల్లో గుణపాలు దింపుతూ కూసాలను ఏరేస్తున్నారు. మొన్నటికి మొన్న కొండాపూర్ లో 7 వందల కోట్ల ప్రభుత్వ భూమిని పరిరక్షిస్తే...నిన్నటికి నిన్న మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ కు అత్యంత సమీపంలో 2 వేల 2 వందల కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కబ్జా కోరలు పీకి కాపాడగా నేడు తాజాగా కొండాపూర్ పరిధి రాజరాజేశ్వరి కాలనీలో 7 ఎకరాలను కాపాడిన హైడ్రా 14 వందల కోట్ల రూపాయల విలువైన భూమిని భూ దళారుల చెరనుండి విడిపించడం విశేషం. గత దశాబ్దంన్నర క్రితం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ విలేజ్‌లోని సర్వే నంబరు 78 నుంచి 93 లో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 2059 ప్లాట్లతో 1993లో గ్రామపంచాయతీ లే ఔట్ ఏర్పాటు చేసిన విషయం విధితమే. కాగా ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు కేటాయించారు. పాఠశాలకు దాదాపు ఎకరం స్థలం, పార్కుల కోసం ఎకరానికి పైగా కేటాయించారు. పాఠశాలకు కేటాయించిన స్థలంలో 1000 గజాల మేర అపార్టుమెంట్స్ ను నిర్మించడం జరిగింది. కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాలను కేటాయించగా సదరు స్థలాలన్నీ ఆక్రమణలకు గురౌతున్నాయని గుర్తించిన రాజరాజేశ్వరి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నో సందర్భాలలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీవో, శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్, జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు సైతం వినతులు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో అక్రమ కట్టడాలు, భూ కబ్జాలపై ఉక్కు పాదం మోపుతున్న హైడ్రా సంస్థను ఆశ్రయించి రాజరాజేశ్వరి నగర్‌లో నివాసం ఉంటున్న 5 వేల కుటుంబాలకు ఉపయోగపడేలా చూడాలని కోరుతూ ప్రజావాణిలో కార్యక్రమంలో పూర్తి ఆధారాలతో కూడిన ఫిర్యాదులను అందజేయడం జరిగింది.

**రాజరాజేశ్వరి కాలనీ అసోసియేషన్‌ది 15 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం**

గత రెండు దశాబ్దాలకు పైగా ప్రస్థానం కలిగిన రాజరాజేశ్వరి కాలనీ ఏర్పడిన నాటినుండి ఎంతో ప్రత్యేకతను సంతరించుకొని ధర్మబద్ధమైన వెంచర్, ప్రజా ప్రయోజనాల ప్రాధాన్యత ఆక్రమంలో రూపుదిద్దుకోవడంతో ఇక్కడ వేలకొలది ప్లాట్లు అమ్ముడై ప్రస్తుతం శేరిలింగంపల్లిలోనే అతిపెద్ద కాలనీలలో ఒకటిగా విరాజిల్లుతోంది. ఇక్కడి భూములపై కన్నేసిన కొందరు అనేక సందర్భాలలో వివిధ మార్గాలను దాదాపు 7 ఎకరాల స్థలాన్ని అసోసియేషన్ నుండి తమ స్వాధీనం చేసుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో తమకు జరిగిన అన్యాయంపై అసోసియేషన్ గత 15 సంవత్సరాలుగా అవిశ్రాంత పోరాటం చేస్తూ న్యాయం జరిగే వరకూ వెనకడుగు వేసేది లేదు అన్న చందంగా భగీరథ ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే వస్తోంది. ఈ క్రమంలో కాగల కార్యము గంధర్వులు చేసినట్లు హైడ్రా రూపంలో వారి పోరాటానికి సరైన మద్దతు లభించి శనివారంతో సదరు ఏడెకరాల స్థలంలోని అక్రమ నిర్మాణాలను, ప్రహరీ గోడలను నేలమట్టం చేసే చుట్టూ కంచెను ఏర్పాటు చేసి అసోసియేషన్ కు అందజేయడంతో వారి సంతోషం కట్టలు


జనంసాక్షి www.janamsakshi.org హైదరాబాద్ - రంగారెడ్డి


బడి స్థలాన్ని వదలని బకాసురులు

కబ్జాకు కాదేది అనర్హం అంటున్న భూ బకాసురులు

తెంచుకొని హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ కు కృతజ్ఞతలు వెల్లువను కురిపించడం జరిగింది.

**ఇందులో మీడియా పాత్రకూడా తక్కువేం కాదు**

కొండాపూర్ రాజరాజేశ్వరి కాలనీ సమస్యలపై, ప్రత్యేకించి భూకబ్జాలపై మీడియాలో సైతం ఎన్నో కథనాలు రావడం జరిగింది. ఇందులో జనం సాక్షి దినపత్రిక ది మరింత క్రియాశీల పాత్ర. ప్రభుత్వ అధికారులకు కబ్జాల గురించి విన్నవించిన ప్రతిసారి జనం సాక్షి పత్రిక వారికి అండగా నిలబడి ఎన్నో విలువైన విశ్లేషణాత్మక కథనాలను ప్రచురించి ప్రభుత్వ అధికారుల ఉదాసీనతను ఎండగట్టడం జరిగింది. ఈ క్రమంలో రాజరాజేశ్వరి కాలనీ అక్రమ కూల్చివేతల సమయంలో పలువురు జనం సాక్షి దినపత్రిక గురించి చర్చించుకోవడం గమనార్హం.



## అన్నదాతలకు ఆధునిక సాగు పద్ధతులపై

# అవగాహన అభినందనీయం

**మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ**

**ముషీరాబాద్ ఫిబ్రవరి 21 (జనం సాక్షి):** అన్నదాతలకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించడం, వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక యంత్రాలను వారి దరికి చేర్చడం అభినందనీయమని, ఇది అత్యంత అవసరమైన అంశమని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు హైదరాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతుబడి వ్యవస్థాపకులు జూలకంటి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో 'రైతుబడి అగ్రిషో-3వ ఎడిషన్' కార్యక్రమం నిర్వహించబడుతున్న అగ్రి షో ను సందర్శించిన ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆధునిక యంత్రాలతో సాగు చేస్తే వ్యవసాయం మరింత లాభసాటిగా మారుతుందని, అధిక పెట్టుబడుల సమస్యను అధిగమించడం తో పాటు సమయం కూడా ఆదా అవుతుందని దత్తాత్రేయ గారు పేర్కొన్నారు. పంటల సాగు మాత్రమే కాకుండా పండ్ల తోటలు, ఉద్యానవనాలు, పాడి పోషణ, కోళ్ల పెంపకం వంటి అనుబంధ రంగాలలో వస్తున్న నూతన మార్పులపై రైతులకు అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో చేపట్టిన పలు సంస్కరణలు, సాంకేతిక ఆవిష్కరణలను దత్తాత్రయ ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వ్యవసాయ రంగంలో సాంకేతిక వినియోగానికి విశేష ప్రాధాన్యత ఇవ్వబడిందని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా రైతులకు పంట భీమా రక్షణ అలాగే, పిఎం కిసాన్ పథకం ద్వారా రైతుల ఖాతాల్లోకి నేరుగా ఆర్థిక సహాయం అందుతోందని, సాయిల్ హెల్త్ కార్డు స్కీమ్ ద్వారా నేల ఆరోగ్యంపై శాస్త్రీయ సమాచారం అందించబడుతోందని పేర్కొన్నారు. అలాగే అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా గ్రామీణ వ్యవసాయ మౌలిక సదుపాయాలకు ప్రోత్సాహం లభిస్తోందని, డ్రోన్ టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహించే 'కిసాన్ డ్రోన్' కార్యక్రమం రైతులకు ఆధునిక పద్ధతులను చేరువ చేస్తోందని తెలిపారు. డిజిటల్ వ్యవసాయ మిషన్, నేచురల్ ఫార్మింగ్ ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు వ్యవసాయ రంగాన్ని ఆధునికత వైపు తీసుకెళ్తున్నాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు అన్నదాతలకు దిశానిర్దేశం చేసి, వ్యవసాయ రంగాన్ని మరింత సుస్థిరంగా లాభదాయకంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రదర్శనలో భాగంగా పురుగుమందుల పిచికారీ కి ఉపయోగించే డ్రోన్లు, బోరు మోటార్లు, ట్రాక్టర్ వీల్స్, ఆధునిక ట్రాక్టర్లు, రొటేవేటర్లు, ట్రాన్స్‌ప్లాంటర్లు వంటి పరికరాలను రైతులకు పరిచయం చేయడం ద్వారా వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. ఈ అగ్రిషో లో 300కు పైగా స్టాళ్లలో సాగు యంత్రాలు, వ్యవసాయ అనుబంధ రంగాల పరికరాలు, సాంకేతిక ఉపకరణాలు, సేంద్రియ ఎరువులు, విత్తనాలు ప్రదర్శనకు ఉంచడం అభినందనీయమని తెలిపారు.

# చోరీ కేసు ఛేదించిన బేగంపేట పోలీసులు

*పాత నేరస్తులిద్దరు అరెస్టు.. 23.5 తులాల బంగారం, రూ.60 వేల నగదు స్వాధీనం*

- శివరాత్రి సందర్భంగా ఒంటరి మహిళ ఇంట్లో చోరీ
- జైలు స్నేహితులు కలిసి చోరీలకు పాల్పడుతున్నారు
- సీసీ కెమెరాలు లేని అపార్ట్‌మెంట్లు టార్గెట్
- ఏసీపీ గోపాలకృష్ణమూర్తి రివార్డులు అందజేశారు



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి):** బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన సంచలన గృహచోరీ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఈ చోరీకి పాల్పడిన ఇద్దరు పాత నేరస్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 23.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్స్పెక్టర్ సైదులు వివరాలు వెల్లడించారు. బేగంపేటలోని శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని సత్యకృష్ణ సిరిసంపద అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న ఎం. అనురాధ (60) ఒంటరిగా ఉంటున్నారు. శివరాత్రి పండుగ సందర్భంగా ఈ నెల 15న ఇంటికి తాళం వేసి గాంధీనగర్ కవాడిగూడలోని తన సోదరి కూతురు ఇంట్లో జరుగుతున్న పూజా కార్యక్రమానికి వెళ్లారు. 16న ఉదయం తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు పగులగొట్టి అల్మారా ధ్వంసం చేసి ఉంది. అందులోని సుమారు 40 తులాల విలువైన బంగారు చెవిపోగులు, ఉంగరాలు, గొలుసులు, వెండి ఆభరణాలు, రూ.60 వేల నగదు దొంగిలించారు. వెంటనే ఆమె బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.
కేసు నమోదు చేసిన బేగంపేట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సికింద్రాబాద్ రేతిఫైల్ బస్ స్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరాన్ని అంగీకరించారు. శ్రీకాకుళం జిల్లా బోరివంక ప్రాంతానికి చెందిన బి. సాయి ప్రదీప్ (25), ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం దన్నూర్ గ్రామానికి చెందిన ఎడ్ల ప్రవీణ్ కుమార్ (32) అని గుర్తించారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో స్నేహితులుగా మారిన వీరు విడుదల తర్వాత కలిసి చోరీలకు పాల్పడుతున్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరు పగలంతా కాలనీలలో రెక్కి చేసి సీసీ కెమెరాలు లేని అపార్ట్‌మెంట్లను టార్గెట్ చేసుకుంటున్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు చేస్తున్నారు. ఇదే క్రమంలో ఈ నెల 15న శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని సత్యకృష్ణ సిరిసంపద అపార్ట్‌మెంట్స్‌లోని 302 నంబర్ ఫ్లాట్‌లో తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించి ఉడాయించారు. ఈ నెల 21న రేతిఫైల్ బస్ స్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 23.5 తులాల బంగారు ఆభరణాలు, రెండు మొబైల్ ఫోన్లు, రూ.60 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రదీప్‌ను బేగంపేట పోలీసులు, ప్రవీణ్ కుమార్‌ను ఫిల్మ్ నగర్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవడంపై ఏసీపీ గోపాలకృష్ణమూర్తి బేగంపేట పోలీసుల చాకచక్యాన్ని ప్రశంసించి రివార్డులు అందజేశారు.

## క్రీడల ప్రోత్సాహంలో ప్రధాని ముందుండి నడిపిస్తున్నారు: కిషన్ రెడ్డి



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రధానమంత్రి సంసద్ ఖేల్-2 ముగింపు సందర్భంగా సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో క్రికెట్, ఖోఖో, కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేశారు. నెలరోజుల పాటు జరిగిన క్రీడోత్సవాల్లో 35 వేల మంది పాల్గొన్నారు. వచ్చే ఏడాది లక్ష మందికి పైగా భాగస్వామ్యం చేసేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో క్రీడలు నిర్వహించాలని ప్రధాని ఆదేశించారని, గ్రామీణ-పట్టణ యువతను క్రీడల వైపు ఆకర్షిస్తున్నారని చెప్పారు. దివ్యాంగులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం విశేషమన్నారు. భారత్ క్రీడల్లో అగ్రస్థానానికి చేరాలని, 2030లో ఒలింపిక్స్ భారత్‌లో నిర్వహించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మాజీ కేంద్రమంత్రి సీహెచ్ విద్యాసాగర్ రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు కూడా క్రీడలతో యువతలో ఆత్మవిశ్వాసం, నిగ్రహశక్తి పెరుగుతున్నట్లు పేర్కొన్నారు.

# హత్యకేసును ఛేధించిన చేవెళ్ల పోలీసులు

**మృతుడితో సహజీవనం చేస్తున్న మహిళనే అంతకురాలు : చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్**

**చేవెళ్ల, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** చేవెళ్ల పట్టణ కేంద్రంలోని పుష్కరిణి వద్ద జరిగిన హత్య కేసును చేవెళ్ల పోలీసులు అత్యంత వేగంగా ఛేధించారు. మృతుడితో సహజీవనం చేస్తున్న మహిళనే ఈ హత్యకు పాల్పడిందని పోలీసులు గుర్తించారు. హత్యకు పాల్పడిన బాలమణిని పోలీస్ లు అదుపులోకి తీసుకుని రిమాండ్ తరలించారు. పూర్తి వివరాలు చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన కరుణాకర్ (55) చేవెళ్ల మండలంలోని కందవాడ గ్రామానికి చెందిన బాలమణితో గత ఆరు సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాడు. అయితే శివరాత్రి జాతర సందర్భంగా ఇద్దరు కలిసి పుష్కరిణి వద్ద మద్యం సేవించారు. మద్యం సేవించిన సమయంలో డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కరుణాకర్ తన సోదరుడికి ఇచ్చిన రూ. 4 లక్షల 50 వేలు తనకు ఇవ్వాలని బాలమణి కోరగా అతను నిరాకరించాడు. దీంతో కొపానికి గురైన బాలమణి అక్కడే ఉన్న కర్రతో కరుణాకర్ తలపై బలంగా దాడి చేసింది. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన కరుణాకర్ అక్కడిక్కడే మృతి చెందాడు. అనంతరం అతన్ని పుష్కరిణిలోకి తోసేసింది. మరునాడు ఉదయం గమనించిన స్థానికులు చేవెళ్ల పోలీస్ లకు సమాచారం ఇవ్వడంతో పోలీస్ లు ఘటన స్థలానికి చెరుకుని ఘటనా స్థలంలో లభించిన రక్తం అంటిన కర్ర, సీసీ టీవీ ఫుటేజ్, క్లూస్ టీమ్ ఇచ్చిన ఆధారాల ద్వారా చేవెళ్ల పోలీస్ లు విచారణ జరిపి నిందితురాలు బాలమణి అదుపులోకి తీసుకుని కూపిలాగారు. దీంతో ఆమె తానే నేరం చేసినట్లు ఒప్పుకోవడంతో ఆమెను అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ స్పష్టం చేశారు.

## పరిగి మున్సిపాలిటీ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

**నూతన ఛైర్‌పర్సన్ రజిత, వైస్ ఛైర్మన్ హనుమంతు ప్రమాణ స్వీకారం**



**పరిగి, ఫిబ్రవరి 21 (జనం సాక్షి):** పరిగి మున్సిపాలిటీ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని నూతన మున్సిపల్ ఛైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ స్పష్టం చేశారు. నూతన పాలక వర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి (టీఆర్ఆర్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే టీఆర్ఆర్ సమక్షంలో నూతనంగా ఎన్నికైన ఛైర్‌పర్సన్ కుడుముల రజిత, వైస్ ఛైర్మన్ కె. హనుమంతు, కౌన్సిలర్లు తమ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ రజిత, వైస్ ఛైర్మన్ హనుమంతు మాట్లాడుతూ.. పరిగి మున్సిపాలిటీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తామని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా దగ్గరుండి పరిష్కరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే టీఆర్ఆర్ సహకారంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే టీఆర్ఆర్ మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన కౌన్సిలర్లు ప్రజల అభీష్టం మేరకు పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిగి పట్టణాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే లక్ష్యమని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి పట్టణాన్ని అభివృద్ధి పరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# కౌన్సిలర్‌పై కత్తుల దాడి

- బావమరిది దాడి అంటున్న ఈర్షాద్
- వరకట్న వేధింపులు అంటున్న భార్య
- పక్కటెముకలకు గాయాలు.. హైదరాబాద్‌కు తరలింపు

**తాండూరు, ఫిబ్రవరి 21 (జనం సాక్షి):** మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ ఈర్షాద్‌పై కత్తులతో దాడి ఘటన అనూహ్య మలుపు తిరిగింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ దాడిలో ఈర్షాద్ గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి 7వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందారు. బావమరిది అయాజ్, అతని మిత్రుడు కలిసి తనపై దాడి చేశారని ఈర్షాద్ కుటుంబీకులు తెలిపారు. దాడిలో ఈర్షాద్ పక్కటెముకలకు గాయాలు కావడంతో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. పోలీసులకు సమాచారం అందడంతో వారు ఈర్షాద్ నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. అయితే ఈ ఘటనలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. తనపై బావమరిది దాడి చేశారంటూ ఈర్షాద్ చేసిన ఆరోపణలను ఆయన భార్య తీవ్రంగా ఖండించారు. అసలు నిజం వేరే ఉందని ఆమె మీడియా ముందుకు వచ్చారు. పెళ్లైన నాటి నుంచి వరకట్నం కోసం ఈర్షాద్ తనను తీవ్రంగా వేధిస్తున్నారని, రోజూ నరకం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి కూడా తనపై దాడి చేయడంతో తట్టుకోలేక సోదరుడికి ఫోన్ చేశానని, తనను రక్షించుకోవడానికే సోదరుడు వచ్చాడని స్పష్టం చేశారు. తనను వదిలేసి వేరే పెళ్లి చేసుకునే ఆలోచనలో ఈర్షాద్ ఉన్నారని తెలిపారు. బాధితురాలిగా ఉన్న తననే దోషిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని వెల్లడించారు.

# కర్ల రాజేష్ లాకప్ డెత్‌పై ముఖ్యమంత్రి స్పందించాలి

- చిలుకూరి ఎస్ఐ సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయాలి : మందకృష్ణ మాదిగ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మంత్రివర్గం నుండి బర్తరఫ్
- కుటుంబానికి కోటి ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం కల్పించాలి
- రాజ్యసభలో మాదిగలకు ఒక సీటు కేటాయింపు డిమాండ్



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి):** కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ ఘటన జరిగి 95 రోజులు గడుస్తున్నా ముఖ్యమంత్రి స్పందన లేకపోవడం బాధాకరమని విమర్శించారు. శనివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ కమిషన్ స్పందించి లాకప్ డెత్‌కు కారకులైన ఎస్ఐని సస్పెండ్ చేసి రీపోస్ట్ మార్టం నిర్వహించాలని డీజీపీ, చీఫ్ సెక్రటరీకి ఆదేశాలిచ్చినా రెండు నెలలు గడిచినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజేష్ మృతికి కారకులైన చిలుకూరి ఎస్ఐ సురేష్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని, మృతుని కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా అందించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ సురేష్ రెడ్డిని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాపాడుతున్నారని మండిపడ్డారు. ఎస్ఐని సస్పెండ్ చేయకూడదని పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చారని, సూర్యాపేట ఎస్పీపై ఒత్తిడి చేశారని ఆరోపించారు. ఎస్సీ కమిషన్ మెంబర్లకు ఉత్తమ్ కుమార్ రెడ్డితో చనువుగా ఉండే ఎమ్మెల్యేల ద్వారా ఎస్ఐని కాపాడాలని చెప్పినట్లు ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు.
బీఆర్ఎస్ ప్రభుత్వంలో మరియమ్మ లాకప్ డెత్ ఘటనలో 10 రోజుల్లోనే కేసీఆర్ న్యాయం చేశారని గుర్తుచేశారు. ఆనాడు బీసీ బిడ్డెన ఎస్ఐని సస్పెండ్ చేయించడానికి రోడ్డెక్కిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. నేడు తన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎస్ఐని కాపాడుతున్నారని విమర్శించారు. బాధితుల పక్షాన కాకుండా నిందితుల పక్షాన నిలబడటం సిగ్గుచేటని, ఎస్సీ కమిషన్ సస్పెండ్ చేయాలన్నా నిందితుడిని కాపాడటం నేరమే అవుతుందని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డిని మంత్రివర్గం నుండి తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

రానున్న మార్చి మొదటి వారంలో తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ సీట్లలో ఒకటి మాదిగలకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీని కోరారు. తెలంగాణలో మూడు ఎస్సీ రిజర్వ్ లోక్‌సభ స్థానాల్లో ఒక్కటి కూడా మాదిగలకు ఇవ్వకపోవడం ద్రోహమని విమర్శించారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన సింగిల్ కాస్ట్ మాదిగలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకుండా పోయిందని, ఇప్పటికైనా రాజ్యసభలో ఒక సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఏడుగురు రెడ్లు ఉన్నారని, రాజ్యసభలో కూడా రెడ్డిలే పోటీపడతారని, రెండు సీట్లలో ఒకటి మాదిగలకు ఇచ్చి మిగిలినది ఎవరికైనా ఇవ్వవచ్చని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ సీట్లలో ఒకటి మాదిగలకు కేటాయించి వర్ల రామయ్యకు ఇవ్వాలని చంద్రబాబు నాయుడును కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తీక్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొమ్ము శేఖర్ మాదిగ, వేముల ఎల్లయ్య మాదిగ, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు మంద రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వ వైద్య సంస్థలకు తొలి ఘనత

**నిమ్స్‌కు 4 విభాగాల్లో సీట్లకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి**



**ఖైరతాబాద్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) కు నేష నల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నుండి నాలుగు సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఎం.సీహెచ్ (మాస్టర్స్ ఆఫ్ చిరుర్జీ-మాస్టర్ ఆఫ్ సర్జరీ సూపర్ స్పెషాలిటీ) డీఎం(డాక్టరేట్ ఆఫ్ మెడిసిన్) కోర్సులకు అనుమతి లభించిందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు.సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ-ఎం.సీహెచ్ 4 సీట్లు, వాస్క్యులర్ సర్జరీ-ఎం.హెచ్ 4 సీట్లు సర్జికల్ ఆంకాలజీ-ఎం.సీచ్ 4 సీట్లు, ఆంకో పాథాలజీ-డీఎం-4 సీట్లు మొత్తం 16 సీట్లు మంజూరు కావడం విశేషమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్య సంస్థలలో ఆంకో పాథాలజీ విభాగంలో డీఎం సూపర్ స్పెషాలిటీ కోర్సులకు అనుమతి పొందిన తొలి సంస్థగా నిమ్స్ నిలిచిందని అన్నారు. ఆంకో పాథాలజీ అనేది క్యాన్సర్ నిర్ధారణ, వర్గీకరణ, వ్యాధి ప్రగతి అంచనా, చికిత్స పర్యవేక్షణకు సం బంధించిన ప్రత్యేక వైద్య శాస్త్రం అన్నారు. ఇందు లో ఉపయోగించే ఆధునిక సాంకేతికతలు హిస్టో పాథాలజీ, సైటో పాథాలజీ, హీమటో పాథాలజీ, మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్, ఇమ్యునో హిస్టోకె మిస్ట్రీ, సైటోజెనెటిక్స్, జెనోమిక్ ప్రొఫైలింగ్ ఈ సాం కేతికతల సమన్వయంతో ఖచ్చితమైన, వ్యక్తిగతీక రించిన క్యాన్సర్ నిర్ధారణ సాధ్యమవుతుందని తెలిపారు. ప్రెసిషన్ ఆంకాలజీ యుగంలో లక్ష్యిత చికిత్సలు, ఇమ్యునోథెరపీ నిర్ణయాలు, మాలిక్యు లర్ ట్యూమర్ ప్రొఫైలింగ్‌లో ఆంకో పాథాలజిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నిమ్స్‌లో డీఎం ఆంకో పాథాలజీ కోర్సు ప్రారంభం రాష్ట్రంలో సమగ్ర క్యాన్సర్ చికిత్స, పరిశోధన, వైద్య విద్యా ప్రమాణా లను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ విభాగా లతో సమన్వయం పెంపొందిస్తూ బహుళశాఖా విధానంలో క్యాన్సర్ నిర్వహణకు ఇది దోహదం చేస్తుందని చెప్పారు. పెరుగుతున్న క్యాన్సర్ భారం నేపథ్యంలో, నిమ్స్ వంటి ప్రముఖ ప్రభుత్వ సంస్థ లో సూపర్ స్పెషాలిటీ శిక్షణ అందుబాటులోకి రావడం రాష్ట్రం, దేశానికి నైపుణ్యంతో కూడిన నిపుణులను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుం దని తెలిపారు. ఈ అనుమతి నిమ్స్ సంస్థ యొక్క విద్యా నైపుణ్యం, ఆధునిక మౌలిక వసతులు, ఉన్నత వైద్య విద్యలో ఉన్న కట్టుబాటును ప్రతిబిం బిస్తుందని ప్రొ.నగరి బీరప్ప వెల్లడించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
22 ఫిబ్రవరి 2026

# అమెరికా సామ్రాజ్యవాద కుట్రలను తిప్పికొడదాం

**సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**




**ముషీరాబాద్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి):** అమెరికా సామ్రాజ్యవాద కుట్రలను తిప్పికొడదాం అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్ల పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫ్రెడ్రిచ్ ఏంగెల్స్ రచించిన అజరామర గ్రంథం 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' ప్రచురితమైన రోజును పురస్కరించుకుని 'రెడ్ బుక్ డే' వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పాల్గొని ప్రసంగించారు. సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటానికి, ప్రపంచ ప్రజల విముక్తికి కమ్యూనిస్ట్ మేనిఫెస్టో నేటికీ దిక్సూచిలా నిలుస్తోందని, సోషలిజమే ప్రపంచానికి ఏకైక మార్గమని పేర్కొన్నారు. వెనిజులా తన చమురు సంపదను కార్పొరేట్లకు అప్పగించకుండా, జాతీయం చేసి ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తుండటంతో అమెరికా చమురు క్షేత్రాల స్వాధీనానికి పాల్పడుతోందని విమర్శించారు. 'ఆర్థిక ఆంక్షలు' అనే ఆయుధంతో వివిధ దేశాల ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బ తీస్తోందని మండిపడ్డారు. తన ఆయుధ వ్యాపారాన్ని పెంచుకోవడానికి, డాలర్ విలువను కాపాడుకోవడానికి అమెరికా మధ్యప్రాచ్య దేశాల్లో అశాంతిని రేపుతోందని, అణ్వాయుధాల పేరుతో ఇరాన్ సార్వభౌమాధికారం పై దాడికి సిద్ధమవ్వడం అంతర్జాతీయ శాంతికి విఘాతమని హెచ్చరించారు. గతంలో లాగా అమెరికా చెప్పిందే వేదం అన్నట్లుగా ఇప్పుడు ప్రపంచం లేదని, రష్యా, చైనా వంటి దేశాలు అమెరికా ఆధిపత్యాన్ని గట్టిగా ప్రతిఘటిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది చిన్న దేశాల స్వతంత్రతకు శుభపరిణామమని తెలిపారు. బ్రిటిష్ వారిని తరిమికొట్టిన ఘన చరిత్ర కలిగిన భారతదేశం, నేడు ప్రధాని మోదీ నాయకత్వంలో అమెరికాకు ఒక జూనియర్ పార్ట్నర్‌గా మారిపోవడం సిగ్గుచేటని విమర్శించారు. విదేశాంగ విధానం స్వయంప్రతిపత్తిని కోల్పోవడం వల్ల దేశ ప్రతిష్ట మసకబారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 'రెడ్ బుక్ డే' సందర్భంగా ప్రతి ఒక్కరూ అభ్యుదయ సాహిత్య పఠనం ద్వారా చైతన్యాన్ని పెంపొందించుకోవాలని, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగుతున్న అంతర్జాతీయ పోరాటాలకు మద్దతు తెలపాలని జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. జ్యోతి, టి. సాగర్, ఎండి అబ్బాస్, రాష్ట్ర కేంద్రంలోని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖాదీ అంటే కలెక్షన్లు కాదు సర్వీస్ : కామారెడ్డి ఎమ్మెల్యే



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** ఖాదీ అంటే కలెక్షన్లు కాదు సర్వీస్ అనే దిశగా పనిచేస్తున్నానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణా రెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. నేను లెటర్లు రాస్తే వచ్చిన నిధులను తానే తెచ్చానని చెప్పుకుంటూ ఇంచార్జీ మంత్రిని తీసుకువచ్చి షబ్బీర్ అలీ ప్రారంభోత్సవాలు చేస్తున్నారని ఆరోపించారు. గత రెండు ఏళ్లుగా కామారెడ్డి నియోజకవర్గంలో నేను ఏమి మాట్లాడకుండా ఉంటే ఈ నియోజకవర్గాన్ని షబ్బీర్ అలీ చెలాయిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ కళాశాలకు చెందిన భూములను లీజ్‌కు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ కళాశాలకు ఆ స్థలాల కిరాయిలు వస్తున్నాయని అన్నారు. కళాశాల భూములకు సంబంధించి ఓ కాంగ్రెస్ నాయకుడు చేసిన విమర్శలకు అతన్ని ప్రభుత్వ కళాశాల వద్దకు చర్చకు రమ్మంటే కాంగ్రెస్ నాయకులు వందల సంఖ్యలో వచ్చి నా క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించారని, నేను చేసిన సవాల్ కు ఉదయం ప్రభుత్వ కళాశాల వద్దకు వద్దామంటే కామారెడ్డి లో శాంతి భద్రతల దృష్ట్యా స్థానిక పోలీసులు నన్ను బయటకి రావద్దంటే వారికి సహకరించి నేను బయటకు రాలేదన్నారు. ఇప్పటి వరకు కామారెడ్డిలో ఏది జరిగిన భరించానని ఇక నుండి భరించే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వ కళాశాల ఆస్తుల విషయంలో నేను ఏమైనా అవినీతి చేసినట్టు డాక్యుమెట్స్ ప్రూఫ్స్ తో నిరూపిస్తే జిల్లా కలెక్టర్ సమక్షంలో శాసన సభ స్పీకర్ సలహాతో నేను నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఏర్పడ్డ తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డి ప్రభుత్వ కళాశాల స్థలంలో ఏర్పాటు చేయాలని నేను మా నాన్నతో అప్పటి ముఖ్యమంతి రాజశేఖర్ రెడ్డితో మాట్లాడానని అప్పుడు షబ్బీర్ అలీ మంత్రి హోదాలో ఉండి కూడా కామారెడ్డికి ఏమి చేయలేదన్నారు.

నేను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని. వచ్చే సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వస్తా మీరు అసలైన నాయకులైతే ఆ రోజు వచ్చి నా తప్పు నిరూపించి మొగోళ్ళు అనిపించుకోండి. మా కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో నా నిజాయితీ నిరూపించుకునేదాక ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రేపటి నుంచి గ్రామాలలో తిరుగుతా ఎవరొస్తారో రండని సవాల్ చేశారు, నేను ఏ తప్పు చేయలేదని, మున్సిపాలిటీలో తప్పు జరగకుండా చూస్తానని చెప్పాను అంతేనని, కాంగ్రెస్ టిఆర్ఎస్ కలిసి మున్సిపాలిటీ కైవసం చేసుకున్నారని విమర్శించారు. తప్పు జరగకుండా చూస్తానన్నందుకే అక్కస్సుతో నాపై విమర్శలు సంధిస్తున్నారని అన్నారు.

# బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

*కాంగ్రెస్ నాయకుడి నినాదాలు, కారు అద్దాలు ధ్వంసం, బోల్తా వేత*

- కాంగ్రెస్ నాయకుడి అకస్మాత్తు రాక
- పోలీసుల జోక్యం, అరెస్టులు, బందోబస్తు



**కామారెడ్డి, ఫిబ్రవరి 21 (జనం సాక్షి):** ప్రశాంతంగా ఉన్న కామారెడ్డి పట్టణంలో శనివారం ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీజేపీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకుడు అకస్మాత్తుగా వచ్చి నినాదాలు చేయడం, ఆ తర్వాత బీజేపీ కార్యకర్తలు కారును ధ్వంసం చేసి కారు అద్దాలు ధ్వంసం చేసి కారును బోల్తా వేశారు. రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి కారులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (బీజేపీ కార్యాలయం వద్ద) ముందుకు చేరుకుని గేటు దగ్గర కారును నిలిపివేశారు. ఆయన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి వ్యతిరేకంగా, షబ్బీర్ అలీకి అనుకూలంగా నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత మొదలైంది. పరిస్థితి విషమించడంతో పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని మహేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం ముందు నిలిపిన ఆయన కారును కొంతమంది బీజేపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. కారు అద్దాలు పగలగొట్టి బోల్తా వేశారు. ఆ తర్వాత కారుకు నిప్పు అంటించారని సమాచారం. ఈ ఘటనలో పోలీసులు తగిన విధంగా స్పందించలేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. కారును క్రేన్‌తో తీసుకెళ్లేందుకు పోలీసులు ప్రయత్నించగా బీజేపీ కార్యకర్తలు అడ్డుతగిలారు. "అతనే వచ్చి తీసుకెళ్లాలి" అని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు కొందరు కార్యకర్తలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచన మేరకు పోలీసులు కారుకు నిప్పు అంటించిన వ్యక్తిని క్యాంపు కార్యాలయానికి తీసుకొచ్చారు. బీజేపీ కార్యాలయం వద్ద ముందుగానే పోలీసు బందోబస్తు ఉన్నప్పటికీ ఇటువంటి ఘటన జరగడంపై పట్టణవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటన అనంతరం పట్టణంలో ఎక్కడికక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

# వివిధ ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయండి

- అధికారులకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశం
- ప్రాజెక్టుల భూసేకరణపై అధికారులతో సమీక్ష



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 21 (జనంసాక్షి):** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. భూసేకరణ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడ జాప్యం జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. శనివారం సాయంత్రం కరీంనగర్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు, భూసేకరణ, ఇరిగేషన్ అధికారులతో జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఇందిరమ్మ వరద కాలువ, మిడ్ మానేరు రిజర్వాయర్, మోతే ప్రాజెక్టు కెనాల్సు, గౌరవెల్లి రిజర్వాయర్ కెనాల్సు చొక్కా రావు ఎత్తిపోతల పథకం పనులు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అదనపు పనులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియపై పూర్తిస్థాయిలో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన పనుల పురోగతి భూ సేకరణ ఎంతవరకు పూర్తయిందన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ పనుల పురోగతి స్పీడ్ అప్ చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని వాటి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. భూ సేకరణ ప్రక్రియ త్వరగా చేపట్టి ప్రాజెక్టుల పనులు సజావుగా సాగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన అదనపు పనులు కెనాల్సు నిర్మాణం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని ఆ దిశగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తపెల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా భూసేకరణకు సంబంధించి 58 కోట్లు మంజూరు అయ్యాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తద్వారా కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు ముందుకు సాగుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్ ప్రకాష్ , కరీంనగర్ ఆర్డిఓ కె. మహేశ్వర్, హుజురాబాద్ ఆర్డిఓ రమేష్ బాబు, ఇరిగేషన్ శాఖ ఈఈలు రఫిక్, సంతు ప్రకాష్, డిఈ ప్రశాంత్ తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# బాల్యవివాహాలు చేయడం చట్టరిత్యా నేరం

**బోధన్, ఫిబ్రవరి 21 ( జనంసాక్షి ) :** బాల్య వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమని డిహెచ్‌ఈడబ్ల్యు జిల్లా కోఆర్డినేటర్ స్వప్న స్పష్టం చేశారు. శనివారం జిల్లా మహిళ శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖ ఐసిపిఎస్, ఐసిడిఎస్ సాలూర ఆధ్వర్యంలో సాలూర మండల స్థాయి గ్రామపంచాయతీ కార్యదర్శులకు బాల్య వివాహాల నిరోధక చట్టం 2006పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కోఆర్డినేటర్ స్వప్న మాట్లాడుతూ, బాల్యవివాహాల చేయడం మరియు ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. బాలికలకు 18సంవత్సరాలు బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. బేటి బచావో బేటి పడావో, గర్భస్త్ర శిశువులింగ నిర్ధారణ నిషేధ చట్టం, లైంగిక వేధింపులు, గృహహింసల పై అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, ఆపద సమయంలో ఎవరిని సంప్రదించాలని హెల్ప్ లైన్ నెంబర్స్ గురించి తదితర అంశాలపై వివరించారు. ఐసిపిఎస్ చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ బాబు మాట్లాడుతూ, బాలల హక్కుల గురించి అదే విధంగా టోల్ ఫ్రీ నెంబర్స్ గురించి వివరించడం జరిగింది. కార్యక్రమంలో సాలూర ఎంపీడీవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్వైజర్ గంగ వేణి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# శిశువు మృతిపై విచారణ చేపట్టిన అధికారులు

- మృతికి కారణమైన డాక్టరును వెంటనే సస్పెండ్ చేయాలి
- హాస్పిటల్ ముందు కుటుంబ సభ్యుల ఆందోళన
- 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలి: డిఎంహెచ్ఓ: లలితా దేవి



**యాచారం, ఫిబ్రవరి 21 ( జనం సాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రిలో మల్కీజుగూడకు చెందిన నాన్కంపేట కళ్యాణి ప్రసవం కోసం ఈనెల 19న ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన విషయం విధితమే కాగా వైద్యం వికటించి నవజాత శిశువు మృతిచెందిన ఘటనతో శనివారం డిఎంహెచ్ ఓ లలితాదేవి, డిప్యూటీ డిఎంహెచ్వో లక్ష్మీ ప్రసన్న, డిసిహెచ్ఎస్ అనురాగిణి గైనకాలజిస్ట్ జలజ, శనివారం ప్రభుత్వ ఆస్పత్రికి సందర్శించి వాస్తవ విషయాలను వైద్యులను బాధిత కుటుంబాన్ని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సందర్శించిన అధికారులకి మల్జీజు గూడ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ రెడ్ మోని శిరీష వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో వినతి అందజేశారు. వినతిని ఆసుపత్రిని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య పరికరాల కొరత ఉందన్న విషయం వాస్తవమేనని ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రసవ సమయంలో వైద్యుల వైద్య సేవల విషయమై పరిశీలించి ముమ్ముందు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బాధిత గర్భిణీ ప్రసవం కాకపోవడంతో బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ న్యాయబద్ధంగా పోరాడుతామని గ్రామస్తులు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని చెప్పారు. మున్ముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని చెప్పారు.

# పారమితలో అంబరాన్నంటిన "స్మృతి సౌరభం"

- పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాద్ రావు



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 21 (జనంసాక్షి):** స్థానిక నగరంలోని మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమము 'స్మృతి సౌరభం' అనే పేరుతో నిర్వహించారు. పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాద్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి వీడ్కోలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ... విద్యార్థులు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. గత పదకొండు సంవత్సరాలుగా పారమితలో విద్యనభ్యసించిన విద్యార్థులు, కేవలం మార్కుల కోసమే కాకుండా, నైతిక విలువలు, స్వీయ క్రమశిక్షణ, ఆత్మనియంత్రణ వంటి గొప్ప లక్షణాలను అలవర్చుకున్నారని ఆయన కొనియాడారు. విద్యార్థులు తాము నేర్చుకున్న విలువలనే ఆయుధాలుగా చేసుకుని సమాజంలో ఒక ప్రత్యేక స్థానాన్ని నిర్మించుకోవాలని ఆకాంక్షించా రు. సుదీర్ఘ కాలం పాటు ఒకే గొడుగు కింద పెరిగిన విద్యార్థులు, తమ పాఠశాల విద్యాభ్యాసాన్ని ముగించుకుని వెళ్తున్న తరుణంలో పాత జ్ఞాపకాల ను నెమరువేసుకున్నారు. తమ ఎదుగుదలకు తోడ్పడిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థులు ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. రాబోయే బోర్డు పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలతో తల్లిదండ్రులకు, పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని చిన్నారులకు మార్గనిర్దేశం చేశారు. ఉపాధ్యాయుల బోధన, వారి మార్గదర్శకత్వం తమ జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతాయని విద్యార్థులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాబోయే బోర్డు పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ వీడ్కోలు వేడుక కేవలం భావోద్వేగాలతోనే కాకుండా, విద్యార్థుల కేరింతలు, నృత్యాలతో సందడిగా సాగింది. తమ సీనియర్లకు వీడ్కోలు పలుకుతూ తొమ్మిదవ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమములో పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, వినోద్ రావు, రాకేష్, అనూకర్ రావు, వి.యు.యం. ప్రసాద్, హన్మంత రావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజి, కవిత ప్రసాద్ సమన్వయ కర్త శ్రీనాథ్, మాళవిక, సరిత, లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన మంథని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీకీ నూత నంగా ఎన్నికకాబడిన చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డిలు శనివారం పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షని, అడీషనల్ కలెక్టర్ అరుణశ్రీలను కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లకు కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌లు అభినందనలు తెలిపారు. మంథని మున్సిపాలిటీ అభివృద్ధికై పాలకవర్గానికి సహకరించాలని ఈ సందర్భంగా చైర్మన్, వైస్‌చైర్మన్ వారిని కోరారు. అలాగే పలు అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

# పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరగాలి

- చీఫ్ సూపరెండెంట్ల పాత్ర అత్యంత కీలకం : జిల్లా కలెక్టర్
- మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్ట చర్యలు
- పరీక్షా కేంద్రాల్లో పూర్తి భద్రతా ఏర్పాట్లు
- విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** పదవ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతమైన, పారదర్శకమైన వాతావరణంలో క్రమబద్ధంగా నిర్వహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ముఖ్యంగా చీఫ్ సూపరింటెండెంట్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయడానికి అనుకూల వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు.

చీఫ్ సూపరింటెండెంట్లు నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకత పాటించాలని, ప్రశ్నపత్రాల భద్రత, సమయపాలన, పర్యవేక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు మానసిక ధైర్యం చెప్పి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిపాలన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. పదవ తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. జిల్లాలో 65 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా కఠిన చర్యలు చేపట్టాలని, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని హితవు పలికారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రశ్నపత్రాలను రూట్ల వారీగా పోలీస్ ఎస్కార్ట్‌తో తరలించాలి. పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేసి తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. కేంద్రాల చుట్టూ జిరాక్స్ సెంటర్లను మూసివేయాలి. ప్రతి కేంద్రంలో తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం తప్పనిసరిగా ఉండేలా చూడాలి. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను నియమించి ప్రథమ చికిత్స సదుపాయం అందుబాటులో ఉంచాలి. విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా, రవాణా ఇబ్బందులు లేకుండా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలి. ప్రశ్నపత్రాలు, ఆన్సర్ షీట్లను భద్రత మధ్య తరలించాలి. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించరాదని, ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశం కావడంతో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, చీఫ్ సూపరింటెండెంట్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, అసిస్టెంట్ కమిషనర్ బలరాం, డీసీఈబీ సెక్రటరీ ఎన్.లింగం, సంబంధిత శాఖల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

# ఎటు పోతోందో తెలియని స్థితిలో సమాజం

*పరిస్థితి మారాంటే అభ్యుదయ సాహితీవేత్తలు అప్‌డేట్ కావాలి*

- వీధి పోరాటాల కంటే వీడియో పోరాటాలే ఎక్కువ
- సోషల్ మీడియా వేగానికి సాహిత్యం తగినట్లు మారాలి
- ప్రజల జీవితాలతో మమేకమైన సాహితి స్ఫూర్తిదాయకం



**ముషీరాబాద్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి):** లాభమే పరమావధిగా కొనసాగుతున్న పెట్టుబడిదారీ సమాజంలో మానవత్వం, కరుణ, సోదరత్వం కనుమరుగవుతున్నాయని పలువురు సాహితీవేత్తలు, కవులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎటు పోతున్నామో తెలియని స్థితిలో సమాజం కొట్టుమిట్టాడుతోందని, ఈ పరిస్థితిని సరిదిద్ది మనుషులను సరైన గాడిలో పెట్టాల్సిన బాధ్యత అభ్యుదయ, ప్రగతిశీల సాహితీవేత్తలపైనే ఉందని వారు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తంగిరాల చక్రవర్తి (ఏవీ కాలేజ్) ప్రాంగణంలో తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షతన తెలంగాణ సాహితి దశాబ్ది సాహిత్యోత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి, విమర్శకుడు నందిని సిధారెడ్డి, ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మెన్ డాక్టర్ రియాజ్ పాల్గొని మాట్లాడారు.

మతాలు, కులాల పేరిట మనుషులను విడదీస్తున్న నేటి తరుణంలో సాహిత్యకారులు అందరినీ కలిపి ముందుకు నడపాలని వారు సూచించారు. సాహిత్యం జీవితాన్ని తడిమితే జీవితం సాహిత్యాన్ని తడుముతుందని, ఇద్దరూ సుసంపన్నమవుతాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి ప్రజల జీవితాలను ఆవిష్కరించేలా యువ కవులు సాహిత్యం సృష్టించాలని పిలుపునిచ్చారు. సాహిత్యం తెలిస్తే లోకం తెలుస్తుందని, విద్యార్థులు, యువత సాహిత్యాన్ని చదవాలని సూచించారు. చదువు కేవలం సర్టిఫికెట్లు కాదు, వివేచన కలిగి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇటీవల సినిమాల్లో సాహిత్య ప్రాధాన్యత తగ్గి సంగీత హోరు పెరిగిందని, దాని మోజులో పడిన యువత గాలికి కొట్టుకుపోతున్నారని వాపోయారు. సమస్యలపై వీధి పోరాటాల కంటే వీడియో (సోషల్ మీడియా) పోరాటాలే ఎక్కువయ్యాయని ఎద్దేవా చేశారు. రేటింగులు, వ్యూవర్‌షిప్‌తో సామాజిక మాధ్యమాలు నడుస్తున్నాయని, సమాజ సేవ చేస్తే మాకేం వస్తుందనే ధోరణి పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ ప్రగతిశీల సాహితీవేత్తలు సామాజిక మాధ్యమాల వేగానికి తగినట్లు అప్‌డేట్ కావాలని సూచించారు. పెద్ద పుస్తకాలు, సుదీర్ఘ వ్యాసాలతో పాటు వాటి సారాంశాన్ని చిన్న వీడియోల రూపంలో విడుదల చేస్తే యువతకు సులభంగా చేరుతుందని అన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న సోషల్ మీడియా విషకౌగిలి నుంచి సాహితీవేత్తలు ముందుగా బయటపడాలని, సామ్రాజ్యవాదం, మతోన్మాదం మధ్య వైషమ్యాలను సృష్టిస్తున్న నేపథ్యంలో ప్రజల పక్షాన అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాహితి పదేండ్ల క్రితం ప్రారంభమై ఎన్నో సవాళ్లను ఎదుర్కొని నిలబడటం హర్షణీయమని, సన్మానాలు, పుస్తకావిష్కరణలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాలతో మమేకమవుతున్నందుకు అభినందించారు. మున్ముందు సమాజానికి దిశానిర్దేశం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మెన్ ఏనుగు నర్సింహారెడ్డి, కార్యదర్శి బాలాచారి, కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత శివలింగప్ప, కాళోజీ అవార్డు గ్రహీత నెల్లుట్ల రమాదేవి, ప్రొఫెసర్ బన్న ఐలయ్య, కవులు యాకూబ్, మువ్వా శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.రఘు, ఎడిటర్ రాంపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గడ్డి మందుతో ప్రాణాలు హరీ!

- దాన్ని వెంటనే నిషేధించాలి
- మాజీ ఎంపీ బి. వినోద్ డిమాండ్



**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** మనుషుల ప్రాణాలను హరిస్తున్న పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందు వాడకుండా నిషేధం విధించాలని, దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఈ మందు తాగి పదుల సంఖ్యలో కరీంనగర్, వరంగల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరి మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందని అన్నారు. ఈ మందుకు విరుగుడు మందు లేకపోవడం వల్ల తాగిన వ్యక్తులు చనిపోతున్నారని పేర్కొన్నారు. పారాక్వాట్ డిక్లోరైడ్ వాడకాన్ని ఒడిశా ప్రభుత్వం ప్రతి ఆరు నెలల పాటు నిషేధిస్తూ వస్తోందని, ప్రపంచంలో 70 దేశాలు ఈ గడ్డి మందును నిషేదించాయని వెల్లడించారు. పారా క్విట్ డై క్లోరైడ్‌ను నిషేధించాలని సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి, సీఎస్ రామకృష్ణారావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరామ్ రెడ్డి,ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కిషన్‌కు లేఖ రాశారని వివరించారు.తెలుగు రాష్ట్రాల్లో పారా క్విట్ డై క్లోరైడ్ గడ్డి మందు తాగి ఎక్కువ మంది చనిపోతున్నారని కొందరు వైద్యులు కూడా వెల్లడించారు. ఈ గడ్డి మందు వాడకంపై గ్రామాల్లో తిరిగి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామని, దీనిని నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు. ఎండో సల్ఫన్ అనే మందును ఇండియాలో బ్యాన్ చేసినట్లుగానే పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందు త్రాగి బ్రతికేవాళ్లు సైతం సైడ్ ఎఫెక్ట్స్‌తో చనిపోతున్నారని వివరించారు. పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందును వాడిన తర్వాత మిగిలిన మందును రైతులు దాచుకోవద్దని సూచించారు.

# క్యాతన్‌పల్లిలో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తాం

- బాల్క సుమన్ తదితరులపై కేసులు ఎత్తేయాలి
- మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్




**మంచిర్యాల, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** జిల్లాలోని క్యాతనపల్లిలో బాల్కసుమన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు,చందర్, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేని శంకర్ మాట్లాడారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని అన్నారు.తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తున్నాడని ఆరోపించారు.క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులలో బీఆర్ఎస్, సీపీఐ కూటమి 14 వార్డులు గెలుచుకోగా ప్రజాస్వామ్యబద్ధంగా జరుగవలసిన చైర్మన్ ఎన్నికను మంత్రి వివేక్, ఎంపీ వంశీ అడ్డుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ డమ్మీ కమిషన్ మారిందని,బాల్క సుమన్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులపై మంత్రి వివేక్ ప్రోద్భలంతో పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. క్యాతన పల్లి మున్సిపాలిటీ చేజిక్కించుకావాలన్న కుట్రలతో బీఆర్ఎస్, సీపీఐ కూటమి కౌన్సిలర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి వివేక్ ఆదేశాలతో సింగరేణి అధికారులు క్యాతన పల్లి మున్సిపాలిటీ 11 వ వార్డు కౌన్సిలర్ భీమాగౌడ్ ఇంటిపై దాడి చేసి, కుటుంబసభ్యులపై దౌర్జన్యం చేశారని తెలిపారు. భీమాగౌడ్ తో కుటుంబానికి బీఆర్ఎస్ తరపున అండగా ఉంటామని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మాట్లాడుతూ రాజ్యాంగం పట్టుకొని తిరుగుతున్న రాహుల్ గాంధీకి రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. మంత్రి వివేక్ రేవంత్ తో తిరిగి దొంగలా మారిందని,సింగరేణి అధికారులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొని కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పినట్లు పనిచేస్తున్నారని విమర్శించారు. చెన్నూరు నియోజకవర్గంలో ఎమర్జెసి పాలన నడుస్తున్నదని ఆరోపించారు.టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ కౌన్సిలర్ భీమాగౌడ్ కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు.

# జ్వరంతో ఆస్పత్రికి వెళ్లగా శిశువు మరణం


- వైద్యుల నిర్లక్ష్యంపై మండిపడ్డ కుటుంబం



**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** నగరంలోని ఓ ఆస్పత్రిలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఆరు నెలల శిశువు చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే సాధారణ జ్వరంతో ఆస్పత్రికి వెళ్లామని.. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ ప్రాణాలు పోయాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. సన్ సిటీకి చెందిన దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు కాగా.. ఇటీవల బాబు జన్మించాడు. ఆరు నెలల వయసున్న బాబుకు స్వల్పంగా జ్వరం రావడంతో తల్లిదండ్రులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే జ్వరంతో వెళ్లిన బాబుకు.. వైద్యులు అత్యవసర సమయాల్లో ఇచ్చే ఇంజెక్షన్ ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంజెక్షన్ ఇచ్చిన కొద్ది నిమిషాల్లోనే పసికందు శరీరం రంగు మారిపోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి యాజమాన్యం గడువు ముగిసిన మందులు ఇచ్చిందని, దీనివల్లే తమ బిడ్డ చనిపోయాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇద్దరు ఆడపిల్లల తర్వాత పుట్టిన బాబు కావడంతో అల్లారుముద్దుగా చూసుకున్నామని తల్లిదండ్రులు కన్నీరుమున్నీర వుతున్నారు. శిశువు మృతి వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆస్పత్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హౌస్ అరెస్టు

- కామారెడ్డి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు



**మేడ్చల్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డితోపాటు పెద్ద ఎత్తున ఈటల నివాసానికి చేరుకున్న పోలీసులు ఆయన్ను ఇంట్లోనే నిర్బంధించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిమీద దాడి నేపథ్యంలో ఆయన్ని పరామర్శించేందుకు ఈటల రాజేందర్ కామారెడ్డి బయల్దేరారు. ఈ క్రమంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈటలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఈటల తీవ్రంగా ఖండించారు. గుండాయిజం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

# మహిళల ఆర్థిక వృద్ధితోనే దేశప్రగతి

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే మహిళా సాధికారత
- కేంద్ర మంత్రులను ఆకట్టుకున్న మంత్రి సీతక్క ప్రసంగం
- సీతక్క ప్రసంగాన్ని అభినందించిన శివరాజ్ సింగ్ చౌహాన్
- సీతక్క స్వరంలో మహిళా సాధికరత ప్రతిధ్వనించిందని కితాబిచ్చిన పెమ్మసాని
- తెలంగాణ మోడల్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్న వక్తలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళా సాధికారతే దేశ ప్రగతికి పునాది అని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ కాకతీయలో జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సు, 25వ కేంద్ర స్థాయి సమన్వయ కమిటీ (సీఎల్‌సీసీ) సమావేశం శనివారం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, బ్యాంకింగ్ సంస్థల ప్రతినిధులు, అన్ని రాష్ట్రాల ప్రతినిధులు, అభివృద్ధి భాగస్వాములు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సెర్ప్ సీఈఓ దివ్యాదేవరాజాన్, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సదస్సులో మంత్రి సీతక్క చేసిన ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఆలోచనల ఆధారంగా మహిళల అభివృద్ధినే సమాజ అభివృద్ధిగా భావిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. దేశంలో యంగెస్ట్ స్టేట్ అయిన తెలంగాణ సగటున 12.9 శాతం వార్షిక వృద్ధి రేటుతో వేగంగా అభివృద్ధి చెందుతోందని, పేదరికాన్ని తగ్గించడంలో నీతి ఆయోగ్ ప్రశంసలు అందుకుందని గుర్తు చేశారు. తెలంగాణ విజయాలకు ప్రధాన కారణం గ్రామీణ మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా మార్చడమేనని ఆమె స్పష్టం చేశారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను స్వయం ఉపాధి నుంచి సంపద సృష్టి దిశగా తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతర సమ్మక్క సారాలమ్మ జాతర సందర్భంగా మహిళా సంఘాలకు ప్రభుత్వం ఆర్థిక చేయుత నివ్వగా వారు రూ. 3.5 కోట్ల లాభాలు ఆర్జించడం మహిళల సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. మండల మహిళా సమాఖ్యల ద్వారా బస్సులు కొనుగోలు చేసి టీజీఎస్‌ఆర్టీసీకి లీజుకు ఇవ్వడం, కమ్యూనిటీ క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా మహిళలకు స్థిర ఆదాయం కల్పిస్తున్నామని వివరించారు. దేశ జీడీపీలో మహిళల భాగస్వామ్యం కేవలం 18 శాతమే ఉండగా, అభివృద్ధి చెందిన దేశాల్లో అది 40 శాతానికి చేరుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ అంతరాన్ని తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకర్లు, అభివృద్ధి భాగస్వాములు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళల వృద్ధితోనే దేశ ఆర్థిక వేగం పుంజుకుంటుందని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్ పతి దీదీ కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలపరుస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కోట్లాది మహిళలు ఎస్‌హెచ్‌జీ ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో భాగస్వాములయ్యారని, తదుపరి లక్ష్యం మరింత విస్తరణేనని చెప్పారు. బ్యాంకర్లు కేవలం రుణదాతలుగా కాకుండా భాగస్వాములుగా మారాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ఏలాంటి రాజకీయాలకు తావు ఉండదని స్పష్టం చేశారు. మహిళల అభివృద్ధి విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి సీతక్క ప్రసంగించడం అభినందనీయమన్నారు. మంత్రి సీతక్క ప్రసంగాన్ని ప్రశంసిస్తూ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మహిళా సాధికారత సీతక్క స్వరంలో ప్రతిధ్వనించిందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక పరిపుష్టి దిశలో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీంను వివరించారు. ఈ సమావేశం రాష్ట్ర, కేంద్ర సమన్వయానికి నూతన దిశను చూపించిందని, మహిళా ఆధారిత అభివృద్ధి మోడల్‌తో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని సదస్సులో పలువురు అభిప్రాయపడ్డారు.

### కేంద్ర మంత్రికి పలు విజ్ఞప్తులు చేసిన మంత్రి సీతక్క

సదస్సు వేదికపై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారికి మంత్రి సీతక్క పలు వినతిపత్రాలను సమర్పించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తైన నేపథ్యంలో, 15వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాలు స్థాపిస్తున్న సోలార్ ప్లాంట్లకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీల గడువును రాబోయే ఆర్థిక సంవత్సరాల వరకు పొడిగించాలని కోరారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం, తెలంగాణ చేనేత కార్మికులు నేసిన శాలువాలతో కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులను మంత్రి సీతక్క సత్కరించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు రూపొందించిన గిఫ్ట్ ప్యాకులను వారికి అందజేశారు. మహిళా సంఘాల నైపుణ్యాన్ని ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు అభినందించారు.

# అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

- ప్రజలకు ఎవరేంటో తెలుసు
- తనపై దాడి చేసేందుకు షబ్బీర్ కుట్ర
- ఇక ప్రజల్లో ఉంటే తేల్చుకుంటా
- తనకేదైనా జరిగితే సిఎం రేవంత్‌దే బాధ్యత
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరిక



**కామారెడ్డి, ఫిబ్రవరి21 (జనంసాక్షి) :** కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కామారెడ్డిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోయిన కామారెడ్డిలో షబ్బీర్ అలీ అన్నీ తానే అంటున్నారని చెప్పుకొచ్చారు. తనను కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్, జడ్పీటీసీ చేశామని అన్నారని.. ఆయన కామారెడ్డికి చేసిందేమీ లేదని విమర్శించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో తాను కాంగ్రెస్ నుంచి గతంలో గెలిచానని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ప్రస్తావించారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి నా రాజకీయ గురువు. నువ్వు మా తండ్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడ్డావ్. నువ్వు కట్టిన ఐదు అంతస్తుల భవనానికి మున్సిపల్ అనుమతి లేదు. ఈ నియోజకవర్గం నీ సొంతం కాదు. నీవల్లే నేను కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాను. అసెంబ్లీలో హుందాగా ఉండాలని మాట్లాడిన నన్ను ఇలా చీప్‌గా మాట్లాడేలా చేశారు. నాపై నిందలేస్తే ఎలా ఉంటుందో ఈ రోజు చూశారు. ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది. నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశా. మా వాళ్లు ఎవరూ రావద్దని నేను చెబితే మీరు వేలాదిగా తరలిరావాలని మెసేజ్‌లు పెట్టారు. రేపటి నుంచి గ్రామాలకు వస్తా, ఎవరు అడ్డుకుంటారో చూస్తా. బాన్సువాడలో గొడవ జరిగితే మేం మాట్లాడి సద్దుమణిగేలా చేశాం' అని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి తెలిపారు. 263 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎలాంటి అక్రమాలు లేవు. నేను ఒక్క గజం అమ్మినా నిరూపించాలని వెంకటరమణా రెడ్డి సవాల్ విసిరారు. 'దొంగలెవరో ప్రజలకు తెలుసు. నాకేం జరిగినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత. రేపటి నుంచి యుద్ధమే. ఇది సీఎంకు, నాకూ మధ్య యుద్ధం. కలెక్టర్ వద్ద కూర్చుందాం. కాలేజీ కమిటీ పేరిట ఎఫ్‌డీలు ఉన్నాయి. అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అక్రమాలపై పోరాడాం. తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డిలో పెట్టమని కోరాం. అప్పుడు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఏం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకోం. సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్దాం. నాపై ఒక్క తప్పు తేలినా కాళ్లు పట్టుకుంటా, పదవి వదులుకుంటా. రమ్మంటే సీఎంఓకు వస్తా' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీ భూముల్లో ఒక్క ఇంచు తేడా వచ్చిన రాజీనామా చేస్తానన్నారు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి. దొంగ ఎవరో దొర ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఇన్ని రోజులు ప్రశాంతంగా ఉన్న కామారెడ్డిని రణరంగంగా మార్చారని ఫైర్ అయ్యారు. తనను చంపుతామని బెదిరించారని..ఇవాళ ఆ పనిచేశారని ఆరోపించారు. తాను పిలిస్తే వేలమంది రోడ్లమీదకు వచ్చేవాళ్లు.. అపుడు పరిస్థితి ఎలా ఉండేదని ప్రశ్నించారు వెంకటరమణా రెడ్డి. తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. రేపటి నుంచి గ్రామాల్లో తిరుగుతా. ఇక యుద్ధ వాతారణమేనని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి హెచ్చరించారు. తనపై ఏం జరిగినా ప్రభుత్వానిది, సీఎందే బాధ్యత అనిచెప్పారు. ఇవాళ కారు బోల్తా పడింది రేపు మీ ప్రభుత్వం కూడా బోల్తా పడుతుందన్నారు. తమ కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో తన నిజాయితీ నిరూపించుకునేదాక ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటి వరకు కామారెడ్డిలో ఏది జరిగిన భరించా ఇక నుంచి భరించే ప్రసక్తే లేదన్నారు.

# విద్యార్థులకు పోలీస్ శాఖ ఇంటర్న్‌షిప్

**హైదరాబాద్, ఫిబ్రవరి21 (జనంసాక్షి) :** హైదరాబాద్ సిటీ పోలీసులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. డేటా అనాలసిస్, రీసెర్చ్ ప్రాజెక్టులు, ఆధునిక పోలీసింగ్‌లో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్న లక్ష్యంతో.. 25 ఏళ్లలోపు డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వారికి అధికారిక ధ్రువపత్రాలు ఇవ్వనున్నారు. ఎస్ఎమ్ఐటీ సెల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించ బోతున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

**అమరావతి, ఫిబ్రవరి21 (జనంసాక్షి) :** రాష్ట్రంలో కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చలి తీవ్రత తగ్గుతూ, ఎండలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. తూర్పుగోదావరి జిల్లాలో ఆది, సోమవారం పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. అలాగే.. పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ మీడియా అకాడమి కట్టుబడి ఉందని చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారంనాడు తెలంగాణ మీడియా అకాడమిలోని కాన్ఫరెన్సు హాలులో 2వ పాలకమండలి సమావేశం చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోని 8 జిల్లాలకు చెందిన జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు, వివిధ అంశాలపై 7 వర్క్ షాప్ లు, 12 మంది సీనియర్ జర్నలిస్టులు చేసిన సేవలను రాబోయే తరాలకు తెలియపర్చాలనే ఉద్దేశ్యంతో వారి జీవితాలపై మోనోగ్రాఫ్స్ ముద్రించినట్లు ఆయన తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా విడతల వారీగా 120 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, 5 సంవత్సరాల కాల పరిమితితో నెలకు 3 వేల రూపాయల పెన్షన్ సదుపాయం కల్పించినట్లు ఆయన వివరించారు. అదే విధంగా అనారోగ్యం, ప్రమాదాలకు గురైన 19 మంది జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేశామన్నారు. అకాడమి భవన నిర్వహణలో భాగంగా 250 మంది సీటింగ్ కెపాసిటీ గల ఆడిటోరియం అ÷–దదెకు ఇవ్వడానికి సమావేశంలో చర్చించగా కమిటీ సభ్యులు తమ ఆమోదం తెలుపడం పట్ల కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వర్కింగ్ కౌన్సిల్ సభ్యులు మీడియా అకాడమి భవన నిర్వహణలో భాగంగా ఆడిటోరియం అద్దెకు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేస్తునే ఈ విధానం పూర్తిగా ఆన్ లైన్ విధానం ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా మీడియా అకాడమి వెబ్ సైట్లో ఆయా తేదీలు, సమయ పాలనని పొందుపర్చాలని సూచించారు. అప్పుడే పూర్తి పారదర్శకత చేకూరుతుందని వారు వెల్లడించారు. అందుకోసం ప్రభుత్వ ఆధీనంలోని రవీంద్రభారతి, జె.ఎన్.టి.యూ., సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయాకు సంబంధించిన విధి, విధానాలను అధ్యయనం చేసి అద్దెకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని మీడియా అకాడమీ కార్యదర్శికి సూచించారు. ఈ పాలక మండలి సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీమతి సి.హెచ్. ప్రియాంక, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ సతీష్ కుమార్ తల్లాడి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ ఇంచార్జి హెడ్ డా. సునిల్ కుమార్ పోతన, దూరదర్శన్ కేంద్ర ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రీమతి ఎ. చాందిని, ఆల్ ఇండియా రేడియే ప్రోగ్రామ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. రమేష్ సుంకసారి, స్పెషల్ గెస్ట్ వీర నారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం జర్నలిజం డిపార్టుమెంట్ హెడ్ బి.వి. కృష్ణాజీరావు, తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370